అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 22-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 184 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల: 6.50

అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి
హైడ్రాకు హైకోర్టు ఆదేశం

- జన్వాడలో ఫామ్‌హౌజ్ కూల్చకుండా స్టే ఇవ్వాలి: బద్వేలు ప్రదీప్‌రెడ్డి పిటిషన్
- నిరాకరించిన న్యాయమూర్తి లక్ష్మణ్

వివరాలు 12లో..





ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం భూ సేకరణ
ప్రారంభించండి
పనుల పురోగతిపై రోజువారీ సమీక్ష చేయాలి

భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేపట్టాలి

సేకరణ, పరిహారంలో పారదర్శకంగా వ్యవహరించాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం (సంగారెడ్డి-ఆమన్‌గల్-షాద్ నగర్-చౌటుప్పల్ 189.20 కి.మీ.) భూ సేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆర్‌ఆర్‌ఆర్ ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర, దక్షిణ భాగాల పనుల పురోగతి, తీసుకోవాల్సిన చర్యలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ రోడ్ల విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, ముందుకు సాగాలన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌లో పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలనీ, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. పనులు నత్తనడకన ఎందుకు సాగుతున్నాయి? కలెక్టర్లు ఎందుకు చొరవ తీసుకోవడం లేదంటూ అధికారులను ప్రశ్నించారు. ఉత్తర, దక్షిణ భాగాల పనుల పురోగతిపై రోజువారీ సమీక్ష చేసి, భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం తనతో పాటు సీఎస్‌కు అందజేయాలని ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూసేకరణ విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. సీఎస్‌తో పాటు ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్‌అండ్‌బీ ఉన్నతా ధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి పనులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టండి

ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రధాన రోడ్లకు అనుసంధానం, సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగించేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్‌ఆర్‌ఆర్‌ల అనుసంధానానికి అనువుగా ఉండాలనీ, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయో గకరంగా ఉండేలా చూడాలని సీఎం సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సందీప్ ఘోష్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష ?
సీబీఐ అధికారుల వెల్లడి



10లో..

మహిళలపై ఘోరాలు
151 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు

ఏడీఆర్ రిపోర్ట్



10లో..

21 నకిలీ వర్సిటీలు
ఇవి ఇచ్చే డిగ్రీలు చెల్లవు : యూజీసీ వెల్లడి



10లో..

నీకిది..నాకది
ఆశ్రిత పక్షపాతమే కారణం

- అస్థిరతపై ఆర్థికవేత్తల మనోగతం
- ఆరోపణలున్నా కీలక పదవులు
- తూతూ మంత్రంగా దర్యాప్తులు
- కొంపముంచుతున్న పాలకులు, కార్పొరేట్ల సంబంధాలు

హిండెన్‌బర్గ్ రిసెర్చ్ తాజా నివేదిక నేపథ్యంలో సెబీ చీఫ్ మాధబి పూరీ బచ్‌ను వెనకేసుకొచ్చేందుకు సెబీ బోర్డు, కొందరు బ్రోకర్లు, ఇన్వెస్టర్లు, న్యాయవాదులు, అదానీ సహా పలువురు కార్పొరేట్ దిగ్గజాలు ఆపసోపాలు పడుతున్నారు. మాధబి కూడా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు విఫల ప్రయత్నం చేశారు. తాను విదేశాల్లో పని చేసినప్పుడు పొదుపు చేసిన సొమ్ము నుంచే పెట్టుబడి పెట్టానని, తన ఆర్థిక లావాదేవీల విషయంలో పూర్తి పారదర్శకతతో వ్యవహరించానని ఆమె చెప్పారు. ఈ వ్యవహారంతో అధికార బీజేపీకి ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ మాధబికి బాసటగా నిలిచింది. అదానీతో పార్టీ నాయకత్వానికి ఉన్న సన్నిహిత సంబంధాలే దీనికి కారణం.



న్యూఢిల్లీ : అదానీ గ్రూపు, మాధబి మధ్య ఉన్న సంబంధాలు విరుద్ధ ప్రయోజనాలను సూచిస్తున్నాయి. అదానీ వ్యవహారంలో సెబీ తీసుకున్న చర్యలు దాని విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేశాయి. గతంలో సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ ప్రధానంగా సెబీ నివేదిక పైనే ఆధారపడి నివేదికను అందజేసింది. ఆ నేపథ్యంలోనే న్యాయస్థానం అదానీకి క్లీన్‌చిట్ ఇచ్చింది. నిపుణుల కమిటీ నివేదిక విశ్వసనీయతపై కూడా పలువురు నిపుణులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఎందుకంటే ఈ కమిటీ సెబీ చెప్పిన విషయాలనే ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంది. సెబీకే విశ్వసనీయత లేనప్పుడు దాని మాటలను ఎలా విశ్వసించగలం?

మదుపరులకు స్వర్గధామాలు

అధికారిక విచారణల నుంచి తప్పించుకునేందుకు వ్యాపారులకు అనేక దారులు ఉంటాయి. పన్నులు తక్కువగా ఉన్న చోట, తమ లావాదేవీలు రహస్యంగా ఉంటాయని హామీ ఉన్న చోట వ్యాపారులు పెట్టుబడులు పెట్టడం సహజంగా జరిగేదే. తాము ఏం చేసినా పట్టుబడబోమన్న ధీమా వారిలో ఉంటుంది. డబుల్ ట్యాక్సేషన్ అవాయిడెన్స్ అగ్రిమెంట్స్ (డీటీఏఏ) కింద 87 దేశాల్లో సొమ్ము దాచుకునే భారతీయుల పేర్లను బహిర్గతం చేయరు. ట్యాక్స్ ఇన్ఫర్మేషన్ ఎక్స్ఛేంజ్ (టీఐఈ) ఒప్పందాలు ఉన్న 37 దేశాల్లో మదుపు చేసినా తప్పించుకోవచ్చు. యూబీఎస్ జెనీవా, బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్, పారడైజ్, పనామా...ఇలా ఇవన్నీ ...11లో

నాకెలాంటి ఫామ్‌హౌస్‌ల్లేవు
బఫర్‌జోన్‌లో ఉంటే కూల్చేయండి

ఆ జోన్‌లో ఉన్న సీఎం ఫామ్‌హౌస్ సంగతేంటి?



మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతల నిర్మాణాలను కూల్చేయగలరా?

ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

రైతు రుణమాఫీపై ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తనకు ఎక్కడా, ఎలాంటి ఫామ్‌హౌస్‌లూ లేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం ...11లో

హామీల సంగతేంటీ?
పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లులివ్వాలి

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను స్వచ్ఛంద సంస్థకు ఇచ్చే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

కాంగ్రెస్ ఎన్నికల హామీ రూ.10వేలు వేతనమివ్వాలి : పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు, గుడ్ల బిల్లులు, కాంగ్రెస్ ఎన్నికల హామీ రూ.10 వేలను వెంటనే ఇవ్వాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ అధ్యక్షతన హైదరాబాద్‌లోని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం ముందు కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నా ముందు దూర ప్రాంతాల జిల్లాల నుంచి వచ్చిన కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. జీపులు తదితర వాహనాల్లో తరలి వచ్చిన కార్మికులను దిగకముందే అవే వాహనాల్లో పోలీస్ స్టేషన్లకు తరలించారు. వాహనాల డ్రైవర్ల ఫోన్లు, కాగితాలతో సహా తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. మరికొంత మందిని పోలీసులు వాహనాలను ఎక్కించారు. ఈ క్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి ...11లో

అచ్యుతాపురం సెజ్‌లో ఘోర ప్రమాదం
రియాక్టర్ పేలి 18 మంది మృతి



50 మందికిపైగా గాయాలు

మృతుల సంఖ్య పెరిగే అవకాశం

ఏపీలోని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో ఘటన

రాంబిల్లి: రియాక్టర్ పేలి 18 మంది మృతి చెందిన సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 50 మందికి పైగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని సమాచారం. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో అనేక మంది కార్మికులు, సిబ్బంది పనిచేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అందరూ భోజనాలు చేస్తుండగా భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ అలుముకోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పలువురు కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఫార్మా సెజ్‌లోని అగ్నిమాపక యంత్రం సహా చుట్టుపక్కల నుంచి మరో 11 అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు ...2లో

నేటినుంచి కేజీబీవీ సిబ్బంది బదిలీలు
ఆన్‌లైన్‌లో రేపటి వరకు దరఖాస్తుకు అవకాశం

విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బంది బదిలీల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటన ...11లో

చిన్నారిపై లైంగిక దాడి
సిద్దిపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి

నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన త్రీ టౌన్ పోలీసులు

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఆరుబయట ఆడుకుంటున్న మూడేండ్ల చిన్నారని తన రూమ్‌లో ఆడిపిస్తానని చెప్పి తీసుకెళ్లి ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రం మైత్రివనంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం ...11లో

నవంబర్‌లో సర్పంచ్ ఎన్నికలు ?
ఓటర్ల జాబితా షెడ్యూల్ ఖరారు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా


9,10 తేదీల్లో పార్టీల ప్రతినిధులతో జిల్లా, మండల స్థాయిలో మీటింగ్‌లు వివరాలు 2లో

7 నుంచి 13 వరకు అభ్యంతరాల స్వీకరణ

21న వార్డులు, పంచాయతీల వారీగా తుది జాబితా

లేటరల్ ఎంట్రీకే పీఛే.?
సంకీర్ణంలోని పార్టీలు..ప్రతిపక్షాలే మోడీకి ప్రతిబంధకమా..!

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వంలో జాయింట్ సెక్రెటరీ, డిప్యూటీ సెక్రెటరీ, డైరెక్టర్ స్థాయి 45 పోస్టులను లేటరల్ ఎంట్రీ ద్వారా భర్తీ చేసేందుకు యూపీఎస్సీ ప్రకటన ఇచ్చింది. అయితే లేటరల్ ఎంట్రీ ద్వారా రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన ఈ ప్రకటనకు ప్రతిపక్షాలు వ్యూహాత్మకంగా చెక్ పెట్టాయి. యూపీఎస్సీ ద్వారా భర్తీ కావాల్సిన పోస్టులను కాదని.. లేటరల్ ఎంట్రీ ద్వారా నియామకాలు చేపట్టడమంటే.. రిజర్వేషన్లను లాక్కోవడమేనంటూ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. అంతకు ముందు ఈ విషయాన్ని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి కూడా ప్రస్తావించారు. ఈ చర్య రాజ్యాంగ హక్కుల కాలరాతేనంటూ నొక్కి చెప్పారు. అంతిమంగా కేంద్రప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు టార్గెట్ చేయటంతో.. సంకీర్ణంలో ఉన్న పార్టీలు మేల్కొన్నాయి. ఇది అమలైతే ఆయా రాష్ట్రాల్లో తమ మనుగడ కష్టమేనని భావించాక.. భిన్న స్వరాలు వినిపించాయి. అధికార కూటమిలో ఉన్న లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), జనతాదళ్ (యునైటెడ్) వంటి పార్టీలు నిరసన కూడా వ్యక్తం చేశాయి. లేటరల్ ఎంట్రీకి సంబంధించిన ప్రకటనను రద్దు చేయాలని ఒత్తిడి చేశాయి. తప్పని పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం ఇప్పుడు యూపీఎస్సీ ఛైర్మెన్‌కు లేఖ రాసింది. అయితే బ్రాడ్‌కాస్ట్ బిల్లు, వక్ఫ్ బిల్లు , లేటరల్ ఎంట్రీ ఈ మూడు బిల్లులు వెనక్కి పడడం మోడీ సర్కార్‌కు మింగుడు పడడం లేదు.సీతారాం ఏచూరి, రాహుల్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నుంచి కూడా వ్యతిరేకత రావడంతో బలవంతంగా లేటరల్ ఎంట్రీ ప్రకటనను వెనక్కి తీసుకున్నారని కాంగ్రెస్ చెబుతోంది. మోడీ ప్రభుత్వం వెనక్కి తగ్గడం తమ వల్లేనని సంకీర్ణ పార్టీలు చెప్పుకుంటున్నాయి. అయితే ఇది బలవంతంగా తీసుకున్న నిర్ణయమా లేక బాగా ఆలోచించిన వ్యూహమా అన్నది చర్చనీయాంశంగా మారింది.. వాస్తవానికి, ప్రతి ప్రతిపక్ష స్వరాన్ని తనకు రక్షణగా ఎలా మార్చుకోవాలో తెలిసిన ప్రధాని మోడీకి ఇపుడు పార్లమెంట్‌లో పప్పులు ఉడకటం లేదన్న వాదన వినిపిస్తోంది.



లోక్‌సభ ఎన్నికలకు ముందే, రాజ్యాంగం, కులగణన, రిజర్వేషన్ల అంశంపై ప్రధాని మోడీని, కేంద్ర ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలనేది ప్రతిపక్షాల వ్యూహం. లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా అంటూ స్లోగన్ ఇచ్చిన బీజేపీ.. సంపూర్ణ మెజారిటీ అనే మ్యాజికల్ ఫిగర్‌ను కూడా చేరుకోలేకపోవడానికి ప్రధాన కారణం ప్రతిపక్షాలు తమ ఇమేజ్‌ని సెట్ చేసుకోవడంలో సఫలం ...11లో

మెదక్ ఎంపీ స్వగ్రామంలో
కుల బహిష్కరణ
అనారోగ్యంతో మరణించిన బండమీది సాయిలు

దహన సంస్కారాలకూ కులస్తులు రాని వైనం

సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలంలో ఘటన



నవతెలంగాణ- దుబ్బాక

మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలం బొప్పాపూర్‌లో కుల బహిష్కరణ జరిగింది. భూ తగాదాల్లో నెలకొన్న వివాదంతో బండమీది సాయిలు కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయగా, ఆయన బుధవారం మరణించడంతో కులస్తులు అంత్యక్రియలు రాని పరిస్థితి ఉంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పాపూర్ గ్రామంలో ఎస్సీ ...11లో

అచ్యుతాపురం సెజ్‌లో
ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

చేశాయి. క్షతగాత్రులను చికిత్స కోసం అనకాపల్లిలోని వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో కాలిన గాయాలతో కొందరు మృతి చెందగా, మొదటి అంతస్తు శ్లాబు కింద పడి ఏడుగురు మృతి చెందారు. గాయపడ్డ వారిలో ఐదుగురు 60 శాతానికి పైగా కాలినట్టు తెలుస్తోంది. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పేలుడు ధాటికి పలువురు కార్మికుల మృతదేహాలు ఛిద్రమయ్యాయి. ఘటన జరిగిన సమయంలో పరిశ్రమలో రెండో షిఫ్ట్‌లోని దాదాపు 380 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్టు సమాచారం. రియాక్టర్ పేలుడు ధాటికి పరిశ్రమలోని మొదటి అంతస్తు శ్లాబు కూలిపోయిందని, శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్టు కార్మికులు చెబుతున్నారు. మూడో అంతస్తులో చిక్కుకున్న కార్మికులను క్రేన్ సాయంతో బయటకు తీసుకొచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టాయి. కాగా మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని వైద్యవర్గాలు తెలిపాయి.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

రియాక్టర్ పేలిన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. క్షతగాత్రుల తరలింపునకు అవసరమైతే ఎయిర్ అంబులెన్స్ వాడాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అధికారులను ఆదేశించారు. రియాక్టర్ పేలుడు ఘటన దురదృష్టకరమని కార్మికశాఖ మంత్రి సుభాష్ అన్నారు. భారీగా పొగవల్ల సహాయక చర్యలకు ఆటంకమేర్పడిందని తెలిపారు.

ఐసీఐసీఐ లాంబార్డ్ నుంచి 'ఎలివేట్' ప్లాన్

నవతెలంగాణ- హైదరాబాద్



ప్రయివేటు రంగంలోని జనరల్ బీమా కంపెనీ ఐసిఐసిఐ లాంబార్డ్ తాజాగా వినూత్న ఆరోగ్య బీమా ఉత్పత్తి 'ఎలివేట్'ను ప్రారంభించినట్లు ప్రకటించింది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ ఎజెన్సీ మెడ్ వివేక్ శ్రీవాస్తవ్ మాట్లాడుతూ.. ఎఐ ఆధారిత డిజైన్ చేసిన ఈ వైద్య బీమా అత్యాధునిక ఫీచర్లు, యాడ్-ఆన్‌లను కలిగి ఉందన్నారు. డైనమిక్ జీవనశైలి, ఊహించని వైద్య అత్యవసర పరిస్థితులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం అవసరాలను తీర్చడానికి వ్యక్తిగతీకరించిన పరిష్కారాలను అందిస్తోందన్నారు. వైద్య, మోటార్ బీమా 2015 నుంచి ప్రతీ ఏడాది సగటున 13 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. 2023-24లో రూ.2.89 లక్షల కోట్ల వ్యాపారం నమోదు చేయగా.. ప్రస్తుత ఏడాదిలో రూ.3 లక్షల కోట్లకు చేరనుందని అంచనా వేశారు. హైదరాబాద్‌లో 300 ఆసుపత్రులతో తాము భాగస్వామ్యం కలిగి ఉన్నామన్నారు.

టెస్కాబ్‌ను సందర్శించిన హిమాచల్ బృందం

నవ తెలంగాణ - హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) కార్యాలయాన్ని బుధవారం హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఛైర్మన్ మార్నేని రవీందర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి బ్యాంక్ ప్రధాన ఆర్థిక వివరాలు, టర్నోవర్, పురోగతి, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణ మాఫీ తదితర అంశాలను ఆ బృందానికి రవీందర్ రావు వివరించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ సిజిఎం జ్యోతి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి

- టైర్ల కింద నలిగిన శరీరం
- వేములపల్లి మండలంలో ఘటన


నవతెలంగాణ-వేములపల్లి



బైక్‌ను లారీ ఢీకొట్టడంతో టైర్ల కింద నలిగిపోయి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన బుధవారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని భీమవరం- సూర్యాపేట రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేతపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ జలగం రాములు(53) సూర్యాపేట నుంచి మిర్యాలగూడకు బైకుపై వస్తున్నాడు. మిర్యాలగూడ నుంచి యూరియా లోడుతో సూర్యాపేట వైపు వెళ్తున్న లారీ భీమవరం వద్దకు రాగానే బైకును ఢీ కొట్టింది. దీంతో బైకు లారీ కిందకు పడిపోగా.. రాములుపై నుంచి టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శరీరం నుజ్జునుజ్జయింది. రాములు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియాస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగినట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

గోడ కూలి బాలిక మృతి

- తల్లికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ - అయిజ

గోడ కూలి మీద పడటంతో బాలిక మృతిచెందింది. ఈ ఘటన గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిజ పట్టణంలో 14 వార్డులో చాకలి నరసింహులుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రోజు లాగానే మంగళవారం రాత్రి భోజనం అనంతరం గుడిసెలో అందరూ పడుకున్నారు. అర్ధరాత్రి గోడ కూలింది. దాంతో భార్యకు, కుమార్తెకు గాయాలయ్యాయి. వారిని వెంటనే కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుమార్తె శ్రీకృతి(8) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. భార్య పరిస్థితి కూడా విషమంగానే ఉంది. సోమ, మంగళవారం కురిసిన భారీ వర్షానికి అయిజ పట్టణం పూర్తిగా జలమయం అయింది. వర్షానికి గుడిసె గోడలు దెబ్బతిని కూలడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

25న హైదరాబాద్‌లో విద్యాసెమినార్

- కరపత్రం ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్), ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్స్ (ఐఫియా) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్‌లోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో విద్యాసెమినార్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. 'మహిళా సాధికారత, లింగ సమానత్వం' అనే అంశంపై ఈ సెమినార్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరామ్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, ప్రొఫెసర్ వై ప్రశాంతి హాజరవుతారని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఫియా ఉపాధ్యక్షులు కావలి అశోక్‌కుమార్, నాయకులు ప్రణీద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో సర్పంచ్ ఎన్నికలు ?

- ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్ ఖరారు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం..
- సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా
- 9,10 తేదీల్లో పార్టీల ప్రతినిధులతో జిల్లా, మండల స్థాయిలో మీటింగ్‌లు
- 7 నుంచి 13 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 21న వార్డులు, పంచాయతీల వారీగా తుది జాబితా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలపై కసరత్తు ప్రారంభించింది. వరుసగా అసెంబ్లీ.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత త్వరలో స్థానిక పోరు మొదలు కానున్నది. నవంబర్‌లో సర్పంచి ఎన్నికలు నిర్వహించే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ ఆరో తేదీన గ్రామపంచాయతీ, వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. వాటికి ఫొటో గుర్తింపుతో కూడిన ఓటరు లిస్టును గ్రామపంచాయతీ కార్యాలయంలో, మండల పరిషత్ ఆఫీసులో అంటిస్తారు. ఆ జాబితాపై తొమ్మిదో తేదీన ఆయా పార్టీల జిల్లాస్థాయి నాయకులతో జిల్లా ఎన్నికల అధికారులు సమావేశమవుతారు. ఆ తర్వాత పదో తేదీన మండల స్థాయిలో ఎమ్‌పీడీఓలు సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల ప్రతినిధుల నుంచి ఎన్నికల సంఘం అధికారులు సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. ఏడో తేదీ నుంచి 13 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. వాటిని 19వ తేదీలోగా పరిష్కరించి 21న వార్డులవారీగా, గ్రామపంచాయతీల వారీగా తుది ఓటర్ల జాబితాను సంబంధిత పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో అంటిస్తారు.

ఈ మేరకు ఓటరు జాబితా తయారీపై ఈ నెల 29న ఉదయం 11:30 గంటలకు కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారథి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి పార్థసారథి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ సంగ్రామ్, సెంటర్ ఫర్ గుడ్‌గవర్నెన్స్, ఎన్నికల కమిషన్ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై చర్చించారు. అనంతరం ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. అన్నీ సజావుగా కొనసాగితే నవంబర్‌లో మూడు విడతల్లో గ్రామపంచాయతీ పాలక మండలి ఎన్నికలు నిర్వహించే అవకాశముంది.

వాస్తవానికి ఫిబ్రవరి ఒకటో తేదీనే గ్రామపంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం ముగిసింది. దీంతో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018లో సెక్షన్ 136(3)(3) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనను తీసుకొచ్చింది. పాలకమండళ్లు లేకపోవడంతో పంచాయతీలకు కేంద్రం నుంచి అందే 15వ ఆర్థిక సంఘం నిధులు ఫిబ్రవరి నుంచి ఆగిపోయాయి. ఏడు నెలలుగా ప్రత్యేక పాలనలో గ్రామాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికలు పూర్తికాగానే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో స్థానిక పోరు ఎన్నికలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అయితే, బీసీ కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఇటీవలి కాలంలో ఊపందుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కులగణన చేస్తామనీ, స్థానిక పోరులో బీసీల వాటా తేల్చాకే ఎన్నికలకు వెళ్తామని ప్రకటించింది. ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా కులగణన తర్వాతనే పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తామని నొక్కి చెప్పారు. అయితే, కులగణన చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందు చిక్కుముడులెన్నో ఉన్నాయి. కులగణనతో పెట్టుకుంటే ఎన్నికల ప్రక్రియ మరింత ఆలస్యమవుతుందనీ, దీంతో అప్పటి వరకూ కేంద్రం నుంచి వచ్చే నిధులు రావని అధికారులు రాష్ట్ర సర్కారు దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. అదే సమయంలో బీహార్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణనపై పాట్నా హైకోర్టు తీర్పు, పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్లపై కటాఫ్ నిర్ణయంపై సుప్రీం కోర్టు తీర్పులు ఆటంకంగా మారే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఈసారికి ఇలా ఎన్నికలు కానిచ్చేయాలనే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉంది.

అయితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా లేదంటే మండలం ప్రాతిపదికన తీసుకుని వీలైనంత మేరకు బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చి టెక్నికల్‌గా చేయలేకపోవడంతోనే ఇలా చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తుందని రాజకీయంగా చర్చ నడుస్తున్నది. ఇప్పటికే సర్కారు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసింది. అయితే, టెక్నికల్, ఇతరత్రా కారణాల వల్ల చాలా మందికి రుణమాఫీ కాలేదు. దీన్ని ఎన్నికల నోటిఫికేషన్ వరకు పూర్తి చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఆరు గ్యారెంటీలకు కట్టుబడి ఉన్నా మనీ, ఒక్కో దాన్ని అమలు చేస్తూ పోతున్నామని ప్రజల్లో సానుకూలతను దక్కించుకునేలా రాష్ట్ర సర్కారు ప్రయత్నిస్తున్నది. వీటికి తోడు ప్రజలను బాగా ప్రభావితం చేసే ఒకటెండ్రు పథకాలను కూడా త్వరలో అమలులోకి తీసుకు రాబోతున్నట్టు రాజకీయంగా చర్చ నడుస్తున్నది.

పర్యాటక అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి

- మంత్రి జూపల్లికృష్ణారావు
- అధికారులతో సమీక్ష

నవతెలంగాణ- మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులన్నిటినీ నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖ ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా టూరిజానికి సంబంధించి పిల్లలమర్రి, మినీ ట్యాంక్ బండ్, పాత కలెక్టరేట్ పరిధిలో నిర్మాణంలో ఉన్న 3 స్టార్ హోటల్స్, ఎకో పార్కులో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఎకో పార్కులో పనులపై త్వరలోనే రాష్ట్ర అటవీ శాఖ మంత్రితో మాట్లాడి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని చెప్పారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న మినీ ట్యాంక్ బండ్‌కు పర్యాటకులు ఎక్కువగా వచ్చేందుకు అవకాశం ఉన్నందున అక్కడ చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసే విషయంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. మినీ ట్యాంక్ బండ్‌ను దగ్గరలో ఉన్న కాల్వ ద్వారా కృష్ణా నీటితో నింపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. శిల్పారామంలోని షాపులను మహిళా సంఘాలు, చేతి వృత్తుల వారికి కేటాయించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. పిల్లలమర్రిలో ల్యాండ్ స్కేప్‌తో పాటు ఫౌంటెన్, పిల్లల పార్క్ ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు.వీటన్నింటినీ నిర్దేశించిన కాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మయూరి ఎకోపార్కు వెనుక వైపున హరిత హోటల్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మంత్రి, అధికారులు పిల్లల మర్రి, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, పర్యాటక శాఖ ఎండి ప్రకాశ్‌రెడ్డి, పర్యాటక శాఖ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్, పర్యాటక శాఖ మంత్రి అడిషనల్ పీఎస్ నాగార్జున, డిఈ పరుష వేది, జిల్లా పర్యటకాక శాఖ ఇన్‌చార్జి అధికారి యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంటను సందర్శించిన హైడ్రా కమిషనర్



నవతెలంగాణ-అంబర్‌పేట

హైదరాబాద్ బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటలోని ఆక్రమణల తొలగింపు, కుంటను పునరుద్ధరించే విషయమై మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా.రోహిన్ రెడ్డి ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం బతుకమ్మకుంటను సందర్శించారు. ఈ సందర్భంగా వచ్చే బతుకమ్మ పండుగ నాటికి మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా బతుకమ్మకుంటను పునరుద్ధరించాలని కమిషనర్‌ను కోరారు. గతంలో ఇక్కడే బతుకమ్మలను నిమజ్జనం చేసేవారని, ఇప్పుడు డ్రమ్ముల్లో నీళ్లు పెట్టి నిమజ్జనం చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం 5 ఎకరాల్లో బతుకమ్మకుంట విస్తరించి ఉండగా ప్రస్తుతం రెండెకరాలకే పరిమితమైందని తెలిపారు. మిగతా స్థలం ఆక్రమణలకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, పేదలు కట్టుకున్న ఇండ్ల దగ్గరకు వెళ్లకుండా కుంటను పునరుద్ధరించాలని కోరారు.

అనంతరం కమిషనర్ రంగనాథ్ మొదట స్థలం మొత్తం సర్వే చేయిద్దామని చెప్పారు. ఈ కుంటకు సంబంధించిన పేపర్లు అన్నీ తీసుకొని గురువారం మధ్యాహ్నం హైడ్రా కార్యాలయానికి రావాలని సూచించారు. కుంటను పునరుద్ధరించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటానని చెప్పారు. అనంతరం వీహెచ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఎవరైనా ఇల్లు కోల్పోతే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పిస్తామని చెప్పారు. అలాగే, చే నెంబర్ చౌరస్తాలో మహ్మద్ ఆజాం అనే వ్యక్తి ప్రభుత్వానికి అప్పగించిన మిగులు భూమిలో జ్యోతీరావుపూలే ఆడిటోరియాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట తహసీల్దార్ వీరభాయి, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుమిత్ర, హైడ్రా ఏఈలు, మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్లు పి.నారాయణస్వామి, పి.జ్ఞానేశ్వర్ గౌడ్, పులిజగన్, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

తప్పు చేసిన వారిని వెంటనే శిక్షించాలి

- వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది
- నిమ్స్‌లో నిరసన

నవతెలంగాణ - బంజారా హిల్స్

తప్పు చేసినవారిని వెంటనే కఠినంగా శిక్షించే ప్రక్రియ ప్రారంభిస్తేనే కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కావని వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగికదాడి, హత్య ఘటనను నిరసిస్తూ బుధవారం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలోని ఓల్డ్ బ్లాక్ వద్ద నిమ్స్, ఉస్మానియా, గాంధీ, ఇతర ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రుల వైద్యులు, వైద్యేతర సిబ్బంది, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ.. తప్పు చేసిన వారిని శిక్షించకుండా సమయం వృథా చేయొద్దన్నారు. తప్పు చేస్తే కఠిన శిక్షలు పడతాయన్న భయం ఉండాలన్నారు. ఇన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. తెల్లని చుక్క ఎర్రని రక్తపు మడుగులో తడిసినా పట్టించుకోరా అంటూ ప్రశ్నించారు. నిందితులకు శిక్ష పడే వరకు నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. ఇకనైనా ప్రభుత్వాలు మేలుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనకు మద్దతుగా నిలిచిన ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల సిబ్బందికి నిమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.



ఆలిండియా పీస్ అండ్ సోల్దారిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో..

వైద్యురాలి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా పీస్ అండ్ సోల్దారిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పిపుల్స్ ప్లాజా వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేసిన వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. అవి బహిరంగంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్, మహిళా విభాగం నేత హేమ, వైద్యుల విభాగం నాయకులు డాక్టర్ లాస్య నాయుడు, లోక్‌సత్తా, తెలంగాణ విద్యావంతుల వేదిక, విద్యార్థి ఐక్య వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకించే వారంతా మనువాదులే

- నల్ల కండువా మారదు... కాషాయ కండువా వేసుకోను
- సుప్రీంకోర్టు తీర్పును అన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిందే : మీట్ ది ప్రెస్‌లో మందకృష్ణ మాదిగ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నల్ల కండువా నిరసనలకు ప్రతిబింబం అది మారదని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. కాషాయ కండువా వేసుకోబోనని తెలిపారు. గతంలో కూడా ఇలాంటి ప్రశ్నలు వచ్చాయనీ, ఎక్కడా తాను తలొగ్గలేదన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే వారంతా అంబేద్కరిస్టులు కాదనీ, మనువాదులేనని విమర్శించారు. కొంత మంది స్వార్థపరులు మాత్రం వ్యతిరేకిస్తున్నారనీ, మాలల్లో చాలా మంది మద్దతు ఉన్నదని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును అన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆయా రాష్ట్రాల్లో మ్యానిఫెస్టోలో పొందుపరిచిందనీ, ఇప్పుడు అమలు చేయడం లేదన్నారు. నమ్మించే కాడ నమ్మించి, ఇప్పుడు కుట్రలు చేస్తున్నదని కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు కప్పర ప్రసాదరావు ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగతో మీట్ ది ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు దశాబ్దాలపాటు ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటాలు, అనుభవాలను, ఉద్యమం ఎదుర్కొన్న ఒడిదుడుకులను ఆయన వివరించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి మద్దతు కొనసాగిందని చెప్పారు. దీనికితోడు ఉద్యమానికి మీడియా సహకారం మరచిపోలేనిదని కొనియాడారు. ఉద్యమం పట్ల సానుకూల దృక్పథం కలిగి ఉన్నదని తెలిపారు. ఈ కారణంగా వర్గీకరణ సాధ్యమైందని చెప్పారు. 1994లో ఓ కుగ్రామంలో ప్రారంభమైన ఉద్యమం జాతీయ స్థాయిని ఆకర్షించిందని సంతోషం వ్యక్తం చేశారు. సమాజంలో మాదిగ డప్పు శబ్దమే సమాచారాన్ని తెలియజేసేదిగా ఉన్నదని గుర్తు చేశారు. ఎంఆర్‌పీఎస్ మాదిగ సామాజిక తరగతి సమస్యల కోసమే కాకుండా వితంతువులు, వృద్ధుల పెన్షన్ల కోసం, గుండె జబ్బులు కలిగిన వారికి ఉచిత వైద్యం కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. తమ పోరాట ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం వచ్చిందన్నారు. ఇప్పుడు ఆయుష్మాన్ భారత్ కూడా అందులో భాగంగానే వచ్చిందన్నారు. వర్గీకరణ సమస్యల కోసం నియమించిన లోకూర్, రామచంద్రన్, ఉషామెహ్రా కమిషన్ల వర్గీకరణ న్యాయమైందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు కూడా కమిషన్లు వేశాయన్నారు. దళితుల మధ్య అసమానతలు ఉన్నాయని చెప్పాయని గుర్తు చేశారు. 1998లో ఉమ్మడి ఏపీలో అన్ని పార్టీలు ఏక గ్రీవంగా తీర్మానం చేశాయన్నారు. వైఎస్‌ఆర్, కేసీఆర్ హయాంలో అసెంబ్లీ తీర్మానాలు చేసి పంపాయన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్నది కొంత మంది మాల స్వార్థపరులేనన్నారు. సుప్రీం తీర్పు తర్వాత ఎప్పుడో వర్గీకరణ జరగాల్సింది అంటూ ఎన్నో వ్యాసాలు, ఎడిటోరియల్స్, సోషల్ మీడియాలో కామెంట్లు వచ్చాయన్నారు. అయినా వాటిని గుర్తించడం లేదని విమర్శించారు. దళితుల మధ్య సాంఘిక, ఆర్థిక అసమానతలు ఉన్నాయని తెలిపారు. అన్ని వైపుల నుంచి మద్దతు ఉండడంతో వర్గీకరణ సాధ్యమైందన్నారు. సమాజం ఆమోదం ఉన్నా...కొంత మంది అడ్డుకుంటున్నారనీ, ఇప్పటికైనా వర్గీకరణను వ్యతిరేకించడం మానుకోవాలని హితవు పలికారు. ఉమ్మడి సమస్యల కోసం పోరాటం చేద్దాం..రండి అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బాబురావు, నాయకులు నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

టెండర్ కం బహిరంగ వేలంలో రూ. 40 లక్షల ఆదాయం

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలో గల దుకాణాల సముదాయాలకు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా 40 లక్షల 17,634 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. గత సంవత్సరం 25 లక్షల 57 వేల 139 రూపాయలు రాగా ఈ సంవత్సరం 11 లక్షల 60 వేల రూపాయల 495 రూపాయలు పెరిగినట్లు తెలిపారు.ఖమ్మం దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వీరస్వామి పర్యవేక్షణలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరిండెంట్ విజయ కుమారి, టెండర్ దారులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు తప్పవా?

ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న పోషకాహార లోపం

- వ్యవసాయోత్పత్తిపై వాతావరణ మార్పుల ప్రభావం
- అంతరించిపోతున్న భూగర్భ జలాలు



న్యూఢిల్లీ : దేశంలో ఆహార ధరలపై సరైన కోణంలో విశ్లేషణ జరగడం లేదు. ముఖ్యంగా ఆహార భద్రత కోణం నుంచి ఈ సమస్యను పరిశీలించాలని పలువురు నిపుణులు సూచించారు. ఆహారం సరిగా లభించక పోవడం వల్లనే కరువు కాటకాలు సంభవించడం లేదని, సామాజిక, ఆర్థిక అంశాలు కూడా దానికి దోహద పడుతున్నాయని చాలా ఏండ్ల క్రితమే ఆర్థికవేత్త అమర్త్యసేన్ తెలిపారు. ఈ సిద్ధాంతం నేటికీ చెల్లుబాటు అవుతుంది. రాబోయే కాలంలో పౌష్టికాహార లోపం కుటుంబాల ఆర్థిక వనరులపై ప్రభావం చూపబోతోంది. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా భవిష్యత్‌లో ఆహార భద్రతకు అనేక సవాళ్లు ఎదురవుతాయని నిపుణులు హెచ్చరించారు.

నేడు దేశంలో పోషకాహార లోపం తలెత్తడానికి హరిత విప్లవ వైరుధ్యాలలో ఒకటి పాక్షికంగా కారణం అవుతోంది. హరిత విప్లవం కారణంగా బియ్యం, గోధుమలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా 1950-2007 మధ్యకాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా 2.5 శాతం చొప్పున పెరగ్గా అదే సమయంలో జనాభా 2.1 శాతం చొప్పున వృద్ధి చెందింది. ఫలితంగా మన దేశం బియ్యం, గోధుమలను ఎగుమతి చేయడం ప్రారంభించింది. అయితే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు కేవలం ఆహార ధాన్యాలను మాత్రమే అందిస్తున్నారు తప్పించి అవసరమైన పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలు సరఫరా చేయడం లేదు. ఫలితంగా ప్రజల్లో పోషకాహార లోపం ఏర్పడింది.

అందుబాటులో లేని ఆరోగ్యకరమైన ఆహారం

ఆహార భద్రత, పోషకాహారంపై 2011లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఏఓ) ఓ పరిశీలన ప్రారంభించింది. భారతదేశంలోని జనాభాలో 74.1 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందడం లేదని అది తేల్చింది. గతేడాది విడుదలైన ప్రపంచ ఆకలి సూచికలో భారత్ 111వ స్థానంలో (మొత్తం 125 దేశాల్లో) నిలిచింది. ఈ సూచికలో ప్రతి ఏటా మన ర్యాంకింగ్ పడిపోతూనే ఉంది. 2016లో 97, 2017లో 100, 2018లో 103, 2022లో 107... ఇలా మన ర్యాంక్ పతనమవుతూనే ఉంది. హైతీ, సబ్-సహారా ఆఫ్రికాలోని 12 దేశాలు మాత్రమే మన కంటే తక్కువ ర్యాంకులో ఉన్నాయి. దేశంలో ఐదేండ్ల కంటే తక్కువ వయసున్న ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరు తక్కువ బరువును, 36 శాతం మంది తక్కువ ఎత్తును కలిగి ఉన్నారని 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తెలిపింది. వయసుకు తగినట్టు బరువు, ఎత్తు లేకపోవడం పోషకాహార లోపానికి సూచికలు. 19 శాతం మంది పిల్లలైతే ఎత్తుకు తగిన బరువు లేక పీలగా ఉన్నారు. ఇది కూడా పోషకాహార లోపం సూచికే. 2019-21లో దేశ జనాభాలో 36 శాతం మంది కుంగుబాటుకు లోనయ్యారు. 19 శాతం మంది అసాధారణ రీతిలో బలహీనంగా ఉన్నారు. 6-59 నెలల మధ్య వయసున్న పిల్లల్లో 67 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. పెద్ద వారిలో... అంటే 15-49 ఏండ్ల మధ్య వయస్కుల్లో 57 శాతం మహిళలు రక్తహీనతకు గురయ్యారు.

> తాజాగా ప్రకటించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాలు ప్రభుత్వానికి అసంతృప్తిని కలిగించాయి. అది నివేదికను రూపొందించిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ డైరెక్టర్ సస్పెన్షన్‌కు దారి తీసింది. ఇకపై నివేదికల్లో రక్తహీనత అనే పదమే కనిపించకూడదని ప్రభుత్వం
>
> **ఉన్న మాటంటే ఉలుకెక్కువ**
>
> నిర్ణయం తీసుకుంది. 2011-12, 2017-18 మధ్యకాలంలో దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్న జనాభా శాతం పెరిగిందని జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం వెల్లడించింది. దీంతో ఆ నివేదిక ప్రచురణను ప్రభుత్వం నిలిపి వేసింది. గణాంక వివరాలు బహిర్గతం కావడానికి కారకులైన ఇద్దరు స్టాటిస్టీషియన్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు.

సౌకర్యాల కొరతతో వృథా

దేశంలో తృణధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ ఆహారధాన్యాల తలసరి లభ్యత తగ్గిపోతోంది. 1991లో ఒక్కో వ్యక్తికి రోజుకు 510.1 గ్రాముల ఆహార ధాన్యాలు అందుబాటులో ఉండగా 2021లో 507.9 గ్రాములు మాత్రమే లభించాయి. వివిధ కారణాల వల్ల వ్యవసాయోత్పత్తుల్లో 40 శాతం వరకూ నష్టపోవాల్సి వస్తోంది. కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు లేకపోవడంతో పండ్లు, పాలు వంటి 1.3 బిలియన్ టన్నుల సరుకులను నష్టపోవాల్సి వస్తోంది. అయినప్పటికీ వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్లో భారత్ గణనీయమైన వృద్ధే సాధిస్తోంది. వాటి అమ్మకాల ద్వారా 2021-22లో 50.2 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది.

ఉత్పత్తిని దెబ్బతీసే వాతావరణ మార్పులు

ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ భవిష్యత్‌లో వాటి లభ్యత ఎలా ఉంటుంది అనే విషయాన్ని పరిశీలిస్తే... 2020-2050 మధ్యకాలంలో దేశ జనాభా 0.82 శాతం వార్షిక వృద్ధి రేటు సాధిస్తుందని అంచనా. అంటే శతాబ్దం మధ్య నాటికి దేశ జనాభా 172,33,80,000కు చేరుతుంది. ఈ సమాచారం ఆధారంగా తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఆహార ధాన్యాలు, కూరగాయలు, పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి సగటున ఏటా వరుసగా 2,65 శాతం, 4.9 శాతం, 2.84 శాతం, 4.65 శాతం, 4.58 శాతం, 11.57 శాతం, 5.82 శాతం మేర పెరిగే అవకాశం ఉంది. వాతావరణ మార్పులు సంభవిస్తే ఉత్పత్తిపై ప్రభావం పడవచ్చు. ఉదాహరణకు 2021లో 113 మిలియన్ టన్నుల గోధుమలు ఉత్పత్తి కాగా 2022లో 107 టన్నుల ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈ ఏడాది అది మరింత పడిపోయి 105 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా. గతేడాదితో పాటు ఈ ఏడాది కూడా బియ్యం ఉత్పత్తి పడిపోయింది. అందుకే బాసుమతియేతర బియ్యం ఎగుమతులను కేంద్రం నిలిపివేసింది. ఫలితంగా దేశీయ మార్కెట్‌లో బియ్యం లభ్యత పెరిగింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల ఉత్పత్తి తగ్గిపోతే దాని ప్రభావం ఆకలిపై పడుతుంది. 2050 నాటికి ఆకలితో బాధపడే వారి సంఖ్య 11 నుంచి 20 శాతం వరకూ పెరగవచ్చునని ఓ నివేదిక తెలిపింది. దేశంలో 2022 నుండి తీవ్రమైన వడగాల్పులు సర్వసాధారణమై పోయాయి. వాతావరణ మార్పులే దీనికి కారణం. 1900-2018 మధ్యకాలంలో దేశంలో సగటు వార్షిక ఉష్ణోగ్రత 0.7 డిగ్రీలు పెరిగింది.

> **అడుగంటుతున్న భూగర్భ జలాలు**
>
> వివిధ కారణాలతో దేశంలో 147 మిలియన్ హెక్టార్ల భూమి ఇప్పటికే సారాన్ని కోల్పోయింది. వాతావరణ మార్పులు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2050 నాటికి వ్యవసాయ యోగ్యమైన భూమిలో సగం బీడుగా మారిపోయే ప్రమాదం ఉంది. అంతిమంగా అది ఉత్పాదకత తగ్గడానికి దారితీస్తుంది. భూమిలో లవణాలు పేరుకుపోతున్నాయని, ఫలితంగా ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని, ఆర్థికాభివృద్ధి దెబ్బ తింటుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల క్రితం... అంటే 2012-14లో వేసిన ఓ అంచనా ప్రకారం భూమిలో లవణాలు పేరుకు పోవడంతో అప్పటికే 16.84 మిలియన్ టన్నుల వ్యవసాయోత్పత్తులకు నష్టం చేకూరింది. పులి మీద పుట్రలా జల వనరుల లభ్యత కూడా తగ్గిపోతోంది. జనాభాతో పాటు నీటి వినియోగం కూడా పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. హరిత విప్లవ కాలం నుంచి నీటి వినియోగం అధికంగా ఉండే పంటలనే రైతులు పండిస్తున్నారు. దేశంలో లభ్యమవుతున్న భూగర్భ జలాలలో 89 శాతం వ్యవసాయానికే ఖర్చవుతున్నాయి. అందుకే 2007-2017 మధ్యకాలంలో భూగర్భ జల మట్టం 61 శాతం పడిపోయింది.

ఉత్పత్తి పెంపు అనివార్యం

వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల కారణంగా విదేశీ కరెన్సీ బాగానే వస్తోంది. అయితే జనాభా అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి పెరగకపోతే ఎగుమతులను తగ్గించుకోవడంతో పాటు నిత్యావసరాలను మరోసారి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ పరిణామం మన విదేశీ వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. మనం ఇప్పటికే పప్పులు, వంటనూనెలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నాము. దేశం నుంచి ఆహార ధాన్యాల ఎగుమతులు తగ్గితే అది ధరల పెరుగుదలకు దారితీస్తుంది. బియ్యం, గోధుమల ఎగుమతులపై విధించిన నిషేధం కారణంగా మోడీ ప్రభుత్వం అంతర్జాతీయంగా విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఓ అంచనా ప్రకారం జనాభా అవసరాలను తీర్చాలంటే 2030 నాటికి 311 టన్నులు, 2050 నాటికి 350 టన్నుల ఆహార ధాన్యాలను మన దేశం ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అందుకోసం ఉత్పాదకతనైనా పెంచాలి లేదా సాగు భూమినైనా పెంచాలని నిపుణులు సూచించారు.

వాతావరణ మార్పుల ఎఫెక్ట్

- భారత్‌లో విరిగిపడుతున్న కొండచరియల ఘటనలపై తాజా అధ్యయనం
- మానవుల తప్పిదాలతోనే విపరీత వర్షపాతమని వెల్లడి



> ఆఫ్రికాలోని ఇథియోపియాలో 257 మంది మరణించిన తర్వాత.. కేరళ కొండ చరియల ఘటన జులైలో రెండో తీవ్రమైన ఘటనగా ఉన్నది. యూనివర్సిటీ ఆఫ్ హల్ వైస్-ఛాన్సలర్ దేవ్ పెట్లీ నిర్వహించిన డేటా ప్రకారం.. జులై 2019 తర్వాత 95 కొండచరియలు విరిగిపడి 1,167 మరణాలకు కారణమైనాయి. ఈ ఏడాది నమోదైన 429 ప్రాణాంతకమైన కొండ చరియలు విరిగిపడటంతో 3,600 కంటే ఎక్కువ మరణాలు సంభవించాయి. గ్లోబల్ వార్మింగ్, ప్రధానంగా శిలాజ ఇంధనాల దహనంతో వాతావరణం మరింత తీవ్ర ప్రభావానికి లోనవుతుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు.

న్యూఢిల్లీ : భారత్‌లో చోటుచేసుకుంటున్న కొండచరియలు విగిరిపడుతున్న ఘటనలపై తాజా అధ్యయనం ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తున్నది. వాతావరణ మార్పులే దీనికి కారణమని స్పష్టం చేస్తున్నది. ఒక కొత్త అధ్యయనం ప్రకారం.. మానవుల వల్ల కలిగే వాతావరణ మార్పుల కారణంగా విపరీతమైన వర్షపాతం 10 శాతం ఎక్కువైంది. గత నెల 30న అకస్మాత్తుగా కురిసిన వర్షాల కారణంగా దక్షిణ భారత దేశంలోని పర్వత ప్రాంతాలైన కేరళ ప్రాంతంలోని వాయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి వందలాది మంది సమాధి అయిన విషయం విదితమే.

విపరీతమైన వాతావరణమార్పు ప్రకృతిని ఎలా ప్రభావితం చేస్తుందో లెక్కించే శాస్త్రవేత్తల బృందం వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ అధ్యయనం ప్రకారం.. మానవుల వల్ల కలిగే వాతావరణ మార్పుల కారణంగా కురుస్తున్న వర్షం 10శాతం ఎక్కువగా ఉన్నది. దాదాపు 150 మిల్లీమీటర్లు.. రెండు నెలల రుతుపవనాల నుంచి ఇప్పటికే అధికంగా సంతృప్తమైన నేలలపై వర్షం కురిసింది. ఉత్తర కేరళలో కొండచరియల ఘటన నేడు వేలాది మంది ఎదుర్కొంటున్న క్లిష్ట మానవతా పరిస్థితుల కారణంగా మాత్రమే కాకుండా, నిరంతరం వేడెక్కుతున్న ప్రపంచంలో ఈ విపత్తు సంభవించిందని రెడ్‌క్రాస్ రెడ్ క్రెసెంట్ క్లైమేట్ సెంటర్‌లోని వాతావరణ ప్రమాద సలహాదారు మజా వాల్‌బర్గ్ అన్నారు. ఈ అధ్యయనంలో కనుగొనబడిన వాతావరణ-మార్పు-ఆధారిత వర్షపాతం పెరుగుదల భవిష్యత్తులో ప్రేరేపించబడే కొండచరియల సంఖ్యను పెంచే అవకాశం ఉన్నదని చెప్పారు. కొండచరియలు విరిగిపడే అవకాశం ఎక్కువగా ఉన్న రాష్ట్రంలో, వాయనాడ్ జిల్లా అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా పరిగణించబడుతుంది.

కొండచరియలు విరిగిపడే ప్రమాదకర ప్రాంతాలను వివరించడానికి, ప్రాణాలను రక్షించటానికి భూవిజ్ఞాన శాస్త్రవేత్తలకు సాంకేతికత, నైపుణ్యం ఉందని డాక్టర్ హనెబెర్గ్ చెప్పారు. "ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం. ఈ ప్రమాదకర ప్రాంతాలను వివరించకుండా లేదా గుర్తించకుండా ఉండటం తమ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుందని భావించే వ్యక్తులు ఎల్లప్పుడూ ఉంటారు" అని ఆయన చెప్పాడు.



సీఎం రేవంత్‌రెడ్డిని సీపీఐ(ఎం)పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పి.ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ కూడా ఉన్నారు.

జమ్మూకాశ్మీర్‌లో బీజేపీకి గడ్డు పరిస్థితే

నేషనల్ కాన్ఫరెన్స్‌దే హవా



శ్రీనగర్ : పది సంవత్సరాల విరామం తర్వాత... కేంద్రపాలిత ప్రాంత హోదాను కోల్పోయిన ఐదు సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జమ్మూకాశ్మీర్‌లో తొలిసారి వచ్చే నెలలో శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. సెప్టెంబర్ 18తో ప్రారంభమయ్యే పోలింగ్ ప్రక్రియ మూడు దశలుగా సాగుతుంది. అక్టోబర్ 1వ తేదీతో ముగుస్తుంది. ఇప్పటికే అక్కడ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. జమ్మూకాశ్మీర్‌లో 2018 జూన్ నుండే ప్రభుత్వం లేదు. భద్రతా పరిస్థితులు దారుణంగా ఉన్న నేపథ్యంలో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ)తో బీజేపీ సంబంధాలను తెంచుకుంది. అయితే ఇది వ్యూహాత్మకంగా తీసుకున్న నిర్ణయమే. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాశ్మీర్‌లో శాసనసభ ఎన్నికలు జరిగే అవకాశాలు లేవని బీజేపీకి తెలుసు. 2018 డిసెంబరులో అక్కడ గవర్నర్ పాలన ముగిసింది. రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. ఈ పరిణామం ఆర్టికల్ 370 రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వానికి అందివచ్చిన అవకాశంగా భావించవచ్చు.

డీడీసీలపై విమర్శలు

ప్రత్యేక హోదా రద్దు తర్వాత జమ్మూకాశ్మీర్ సుదీర్ఘ కాలం రాజకీయంగా సుప్తచేతనావస్థలో ఉండిపోయింది. 2020లో ప్రభుత్వం జిల్లా అభివృద్ధి మండళ్లకు (డీడీసీలు) ఎన్నికలు నిర్వహించింది. ప్రజాస్వామ్య ప్రక్రియను క్రమేపీ పునరుద్ధరించేందుకు తాను కట్టుబడి ఉన్నానని చెప్పుకునేందుకే కేంద్రం ఈ ఎన్నికలు జరిపింది. అయితే ఈ వ్యవస్థపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా డీడీసీలను ఏర్పాటు చేసి, ఎన్నికలు జరపడం ప్రజాస్వామ్య నిర్మాణానికి అర్థమా అని పలువురు ప్రశ్నించారు. సాధారణంగా సర్పంచ్‌లు జిల్లా అభివృద్ధి బోర్డులను ఎన్నుకోవడం దేశంలో సంప్రదాయంగా వస్తోంది. ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతి ద్వారా డీడీసీలను ఎన్నుకోవడంపై జమ్మూకాశ్మీర్ మాజీ ఆర్థిక మంత్రి హసీబ్ ద్రాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మండళ్లు రాష్ట్ర శాసనసభకు సమాంతర వ్యవస్థగా మారతాయని, ఈ చర్య శాసనసభను కించపరచడమే అవుతుందని ఆయన విమర్శించారు.

కాశ్మీర్‌లో అభ్యర్థులను నిలపని బీజేపీ

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాశ్మీర్ ప్రాంతంలో అభ్యర్థులను నిలిపేందుకు బీజేపీ వెనకాడింది. పునర్విభజనలో భాగంగా జమ్మూలోని పిర్ పంజల్ ప్రాంతాన్ని కాశ్మీర్‌లో కలపడం దీనికి కారణం. కాగా దక్షిణ, మధ్య కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ రెండు లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. ఉత్తర ప్రాంతంలో మిగిలిన ఏకైక స్థానంలో తిరుగుబాటు రాజకీయ నాయకుడు షేక్ అబ్దుల్ రషీద్ విజయం సాధించారు. ఉగ్రవాద ఆరోపణలపై ఆయన ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఈ పరిణామం బీజేపీకి ఇబ్బందికరంగా, అవమానకరంగా మారింది. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ రషీద్ విజయాన్ని ఆకాశానికి ఎత్తేశాయి.

ఎన్సీదే హవా

జమ్మూ ప్రాంతంలో పహారీ భాష మాట్లాడే వారికి రిజర్వేషన్లు కల్పించడంతో అక్కడ బీజేపీకి మంచి ఫలితాలు దక్కాయి. జమ్మూలో కమలదళానికి ఓ కొత్త ఓటు బ్యాంక్ ఏర్పడింది. మొత్తంగా ఆర్టికల్ 370 రద్దుపై పెల్లుబికిన ప్రజాగ్రహం ఎన్నికల ఫలితాల్లో కన్పించింది. పిర్ పంజల్ ప్రాంతంలో సైన్యాన్ని దింపుతూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హింసను ప్రేరేపించి ఎన్నికలు వాయిదా పడేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపణలు వచ్చాయి. అక్టోబరులో జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ నేషనల్ కాన్ఫరెన్స్ కీలక పాత్ర పోషించడం తథ్యం. ఎందుకంటే ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 34 శాసనసభ స్థానాల్లో (మొత్తం స్థానాలు 90) ఆధిక్యత పొందింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటులో అది కీలక పాత్ర పోషిస్తుంది. జమ్మూకాశ్మీర్‌లో ప్రభుత్వం లేకపోవడంతో అధికారులదే రాజ్యంగా మారింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు కొద్ది గంటల ముందు పెద్ద ఎత్తున పోలీస్ అధికారుల బదిలీలు జరిగాయి. దీనిపై నేషనల్ కాన్ఫరెన్స్ మండిపడింది.

జమ్మూకాశ్మీర్‌లో కొత్తగా 90 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారు. దీంతో అక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 88.03లక్షలకు చేరింది. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో ఓటర్లుగా చేరారు.



తిరువనంతపురం : కేరళ నూతన లోకాయుక్తా అనిల్ కుమార్‌ను అభినందిస్తున్న సీఎం పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్

పోలెండ్, ఉక్రెయిన్‌ల్లో ప్రధాని పర్యటన

వార్సా చేరుకున్న మోడీ



న్యూఢిల్లీ : పోలెండ్, ఉక్రెయిన్‌ల్లో పర్యటన నిమిత్తం ప్రధాని మోడీ బుధవారం బయలుదేరి ముందుగా పోలెండ్ రాజధాని వార్సా చేరుకున్నారు. గత 45ఏండ్లలో పోలెండ్ సందర్శించిన భారత తొలి ప్రధాని మోడీనే. పోలెండ్ అధ్యక్షుడు ఆండ్రెజ్ సెబాస్టియన్ దుడాతో భేటీ అవుతారు, అనంతరం ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. సెంట్రల్ యూరప్‌లో కీలకమైన ఆర్థిక భాగస్వామి పోలెండ్ అని మోడీ వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు 70ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన జరుగుతోందన్నారు. వాణిజ్యం, రక్షణ, సాంస్కృతిక రంగాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. ప్రజాస్వామ్యం, బహుళవాదం పట్ల పరస్పర నిబద్ధత ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసిందని ఢిల్లీ నుంచి బయలుదేరడానికి ముందుగా మోడీ వ్యాఖ్యానించారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు చూస్తున్నామని చెప్పారు.

మహారాష్ట్రలో కీచక టీచర్

బాలికలకు అశ్లీల చిత్రాలు చూపిస్తూ పైశాచికానందం

- వారిని తాకరాని చోట తాకుతూ అసభ్యకర ప్రవర్తన
- నాలుగు నెలలుగా ఇదే తంతు
- తల్లిదండ్రులకు విషయం చెప్పిన బాధిత విద్యార్థినులు
- ప్రభుత్వ ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- అకోలా జిల్లాలో ఘటన

ముంబయి : పశ్చిమబెంగాల్‌లోని కోల్‌తాలో జూనియర్ డాక్టర్‌పై దారుణ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు దారి తీసింది. ఈ ఘటనను అన్ని రంగాలవారూ ఖండిస్తూ కఠిన చట్టాలు, శిక్షలకు డిమాండ్ చేస్తూ తమ గళాన్ని వినిపిస్తున్నారు. ఇలాంటి తరుణంలో మహారాష్ట్రలో చోటు చేసుకున్న ఒక ఘటన ఆందోళన కలిగిస్తున్నది. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడే విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. గత కొన్ని నెలలుగా విద్యార్థినులకు బూతుబొమ్మలు చూపిస్తూ, వారిని తాకరాని చోట తాకుతు అభ్యంతరకరంగా వ్యవహరిస్తూ వచ్చాడు. బాధిత విద్యార్థినులు ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులు చెప్పటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో నిందిత ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.



బాధిత విద్యార్థినులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అకోలా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో నిందితుడు ప్రమోద్ సర్దార్ ఉపాధ్యాయుడు పని చేస్తున్నాడు. విద్యార్థులకు పాఠాలు చెప్పటాన్ని పక్కనబెట్టి బాలికలతో అసభ్యకరంగా వ్యవహరించేవాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఆరుగురు బాలికలకు గత నాలుగు నెలలుగా బూతు బొమ్మలు చూపిస్తున్నాడు. వారిని తాకరాని చోట తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడుతూ వచ్చాడు. ఉపాధ్యాయుడి అనుచిత చేష్టల గురించి బాధిత విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు చెప్పటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని బాలల సంక్షేమ కేంద్రం టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, సంబంధిత అధికారులకు ఒక విద్యార్థిని తెలిజేసింది.

> ముంబయి సమీప పట్టణం బద్లాపూర్‌లోని ఒక స్కూల్‌కు చెందిన క్లీనింగ్ స్టాఫర్ ఇద్దరు బాలికల (మూడు, నాలుగు ఏండ్ల వయసు)పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై ఇప్పటికే పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో రాష్ట్రంలో మరొక ఘటన చోటు చేసుకోవటంతో బాలికలు, మహిళల భద్రతపై ఆందోళన కలుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని మహిళల రక్షణకు మరిన్ని చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ఇలాంటి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

అనంతరం రంగంలోకి దిగిన అధికారులు పాఠశాలకు వెళ్లి, దర్యాప్తును ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాలల సంరక్షణ కమిటీ సభ్యులు కూడా పాఠశాలను సందర్శించారు. కొందరు బాలికలతో మాట్లాడారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు ఆశా మిర్గే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదుపరి విచారణ కొనసాగుతున్నదని పోలీసు అధికారులు వెల్లడించారు.

12 వరకు నామినేషన్ల నమోదు

- 16 వరకు ఉపసంహరణ
- అక్టోబర్ 1న ఓటింగ్.. అదే నెల 4న ఫలితాలు
- మొత్తం 2.03 కోట్ల మందికి పైగా ఓటర్లు
- పురుషులు అత్యధికంగా 1.08 కోట్ల మందికి పైనే
- మహిళా ఓటర్లు 95.08 లక్షలు
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 20,629 పోలింగ్ బూత్‌లు : హర్యానా సీఈఓ పంకజ్ అగర్వాల్ వెల్లడి



చండీగఢ్ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల నామినేషన్ల సమర్పణ, ఉపసంహరణకు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) పంకజ్ అగర్వాల్ తేదీలను ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం.. సెప్టెంబర్ 12 వరకు అభ్యర్థుల నామినేషన్ల నమోదు, ఆ తర్వాత పరిశీలన ఉంటుందన్నారు. అదేనెల 16 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. 2.03 కోట్ల మంది ఓటర్లున్న హర్యానా రాష్ట్ర అసెంబ్లీకి అక్టోబర్ 1న ఓటింగ్ జరగనున్నది. అక్టోబర్ 4న తుది ఫలితాలు వెలువడనున్నాయి. తుది ఓటరు జాబితా ఈనెల 27న ప్రచురిస్తామని అగర్వాల్ తెలిపారు.

రాష్ట్రంలో 18 ఏండ్లు నిండినవారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు కాకపోతే, వారు సంబంధిత బూత్ స్థాయి అధికారి(బీఎల్ఓ)లను సంప్రదించి ఓటు నమోదు చేయించుకోవాలని చెప్పారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2,03,27,631 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో, 1,08,19,021 మంది పురుష, 95,08,155 మంది మహిళ, 455 మంది థర్డ్-జెండర్ ఓటర్లు ఉన్నారు. 18 నుంచి 19 ఏండ్ల మధ్య ఉన్న యువ ఓటర్ల సంఖ్య 4,82,896గా ఉన్నది. అదేవిధంగా, 1,49,387 మంది వైకల్యం కలిగినవారు, 2,42,818 మంది 85 ఏండ్లు పైబడిన ఓటర్లు ఉన్నారు. వందేండ్లకు పైగా వయసున్న ఓటర్లు 9,554 మంది ఉఆన్నరు. 20 నుంచి 29 ఏండ్ల మధ్య వయసున్న ఓటర్ల సంఖ్య 41,52,806గా ఉన్నది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 20,629 పోలింగ్ బూత్‌లు ఉండనున్నాయి. ఇందులో 7,132 పట్టణ ప్రాంతాల్లో, 13,497 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్న హర్యానాలో 17 రిజర్వ్‌డ్ నియోజకవర్గాలున్నాయి. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు ప్రచారం కోసం రూ.40 లక్షల వరకు ఖర్చు చేయొచ్చు. అభ్యర్థులు ఒక ప్రత్యేక బ్యాంకు ఖాతా వివరాలను జిల్లా ఎన్నికల అధికారికి తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల ర్యాలీలు, రోడ్‌షోలు, హెలీప్యాడ్‌లు, ఇతరాలకు అనుమతి పొందటానికి అభ్యర్థులు సువిధ అప్లికేషన్‌ను ఉపయోగించాలి" అని సీఈఓ చెప్పారు.

రుణమాఫీ రాజకీయం



సంపాదకీయం

రాష్ట్రంలో రుణమాఫీ రాజకీయం నడుస్తున్నది. అధికార, ప్రతిపక్షాలు పరస్పర విమర్శలకు దిగి బెట్టుకు పోతున్నాయి. రుణమాఫీతో ప్రజల ఆధరాభిమానాలను చూరగొనాలని అధికార కాంగ్రెస్ భావిస్తుండగా, అందులోని లోటుపాట్లను ఎత్తిచూపే పేర బీఆర్ఎస్ నానాయాగి చేస్తుండటం గమనార్హం. రైతులను పంట రుణాల నుంచి విముక్తులను చేయడమే తమ లక్ష్యమని రేవంత్ సర్కారు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆమేరకు రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ చేయడానికి సర్కారు ఓ మంచి ప్రయత్నమే చేసింది. దాదాపు 22 లక్షల మందికి రైతులకు రూ. 17,933 కోట్ల సొమ్ము వారి ఖాతాల్లో పడింది.

> ఎస్ఎల్‌బీసీ ప్రకారం 47 లక్షల మందికి రూ.49 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా, 22 లక్షల మందికే పరిమితం చేయడం న్యాయం అనిపించు కోదు. రుణమాఫీ అమలుకు వ్యవసాయ శాఖ గుర్తించిన 31 సాంకేతిక సమస్యలు ఆటంకమవుతున్నాయి. వాటిని వేగంగా పరిష్కరిస్తే విమర్శల నుంచి సర్కారు బయటపడేందుకు మార్గ ముంది. పథకం అమలు గురించి సలహాలు, సూచనలు చేయడం, స్వీకరించడం తప్పకాదు. అలాగే పరస్పర భౌతికదాడులకు దిగడం మాత్రం సమర్థనీయం కాదు.

వ్యవస్థలో లోపాల మూలంగా కొంతమంది రైతులకు రుణమాఫీ సొమ్ము చేరలేదు. కాగా రాష్ట్ర క్యాబినెట్ రూ.31 వేల కోట్లమేర రుణమాఫీ చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం చెప్పిన దానికి చేస్తున్న దానికి పొంతన కుదరడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

సీఎం ఒకలా, మంత్రులు మరోలా మాట్లాడటంతో గందరగోళానికి అవకాశం కలిగింది.గత బీఆర్ఎస్ సర్కారు సైతం రుణమాఫీని అమలుచేసింది. అప్పుడు కూడా సాంకేతిక లోపాలతో కొంతమందికి ఖాతాల్లో సొమ్ము పడలేదు. అవే ఇప్పటికీ కొనసాగడం ఆశ్చర్యం, విడ్డూరం. బ్యాంకులు ఆన్‌లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా మాఫీ మొత్తాలను జమచేస్తాయి. సొమ్ముపడటం లేదని కొందరు రోడ్డెక్కడాన్ని సర్కారు తీవ్రంగానే పరిగణించాలి. పరిష్కారాలను కనుగొనాలి. రుణమాఫీని సజావుగా పూర్తిచేయాలి. ఇందులో రాజకీయకోణాన్ని సర్కారు పట్టించు కోవాల్సిన అవసరం లేదు. ఎస్-ఎల్‌బీసీ ప్రకారం 47 లక్షల మందికి రూ.49 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా, 22 లక్షల మందికే పరిమితం చేయడం న్యాయం అనిపించు కోదు. రుణమాఫీ అమలుకు వ్యవసాయ శాఖ గుర్తించిన 31 సాంకేతిక సమస్యలు ఆటంకమవుతున్నాయి. వాటిని వేగంగా పరిష్కరిస్తే విమర్శల నుంచి సర్కారు బయట పడేందుకు మార్గముంది. పథకం అమలు గురించి సలహాలు, సూచనలు చేయడం, స్వీకరించడం తప్పుకాదు. అలాగే పరస్పర భౌతికదాడులకు దిగడం మాత్రం సమర్థనీయం కాదు.

సిద్దిపేటలో చోటుచేసుకున్న రాజకీయ విన్యాసాలు శాంతిభద్రతలకు చేటుచేసేవే. తప్పుడు సంకేతాలు పంపేవే. సర్కారు చిత్తశుద్ధిని శంకించాల్సిన పని లేదుకానీ, అదే సందర్భంలో ఆచరణే ప్రామాణికంగా గుర్తిం చాలి. ఇదిలావుండగా రూ.2 లక్షలకు పైబడిన అదనపు మొత్తాలను చెల్లిస్తేనే కొత్త పంట రుణాలిస్తామని బ్యాంకర్లు కొర్రీలు పెట్టడాన్ని చూస్తూ సర్కారు ఊరుకో కూడదు. దీనిపై ఎస్ఎల్‌బీసీపై ఒత్తిడి తేవాలి. అదనపు సొమ్ముతోపాటు ఎనిమిది నెలల వడ్డీని సైతం బ్యాంకులు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నమాట అక్షరసత్యం. బీఆర్ఎస్ పాలనలో చేసిన మాఫీ కాస్త వడ్డీలకే పోయిందని అప్పట్లోనే విమర్శలు వచ్చిన సంగతి మనం గుర్తుంచుకోవాలి.

2014-15లో 35 లక్షల మందికి రూ.16,140 కోట్లు మాఫీ చేస్తే అందులో రూ.9800 కోట్లు కేవలం వడ్డీ కిందే పోయాయి. 2018-23 వరకు రూ. 19 వేల కోట్లకుగాను రూ.12 వేల కోట్లు వడ్డీకే చెల్లింది. రెండు సందర్భాల్లో రైతులకు ఆశించిన ప్రయోజనం నెరవేరకపోగా, సర్కారిచ్చిన మొత్తంలో రూ.20 వేల కోట్లు వడ్డీ కిందకే బ్యాంకులు జమేసుకున్నాయి. మరో ఆశ్చర్యకరమైన సంగతి ఏంటంటే ఎస్ఎల్‌బీసీ ప్రకారం 72 లక్షల మంది రైతు లుంటే 42 లక్షల మందికే రుణాలిస్తున్నారు. 30లక్షల మందిని అసలు పట్టించు కోవడమేలేదు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాలి. అందరికీ రుణాలు అందేలా గట్టి చర్యలు చేపట్టాలి. బ్యాంకర్లు ప్రభుత్వానికి సరిగ్గా జాబి తాలు పంపకపోవడం, అవకత వకలు, అవినీతి, నిబంధనల మేర రైతన్నలను ముప్పుతిప్పలు పెట్టే పరిస్థితిని క్షేత్ర స్థాయిలో సర్కారు సరిచేయాలి.

పంటల రుణమాఫీ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతిపక్షం తొందరపడుతున్నాదని కాంగ్రెస్, శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుండం గమనార్హం. బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేనివి, కుటుంబ నిర్ధారణ జరగని ఖాతాలు, ఆధార్ నెంబర్లల్లో తప్పులున్నవి, పాసుబుక్కు నంబర్లు లేనివి, బ్యాంకు ఖాతా, ఆధార్ పేరుతో సరిపోలనవి పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు అంటున్నారు. ఈ లోపాలను వ్యవసాయ శాఖ వేగంగా పరిష్కార కేంద్రాల ద్వారా సరిచేస్తేనే రుణమాఫీకి సార్ధకత. పరస్పర విమర్శలతో సమస్యను పక్కదారి పట్టిస్తే క్షమార్హం కాదు. మాఫీ చేయడంతో పాటు కొత్త రుణాలను రైతులకు త్వరగా ఇప్పించాల్సిన బాధ్యతా పాలకులదే.

నియంత్రణ లేని వాణిజ్యంతో చిక్కులు



ప్రభాత్ పట్నాయక్

ఏ తరహా ఆర్థిక వ్యవస్థలోనైనా స్థూల డిమాండ్‌కు లోటు ఉండదని, ఎంత మోతాదులో ఉత్పత్తి జరిగితే అది అంతా వినియోగించడానికి తగిన డిమాండ్ ఉంటుందని ఫ్రెంచి ఆర్థికవేత్త జె.బి.సే విశ్వసించాడు. కొన్ని రక్షణ చర్యలు, కొన్ని కోతలు ఉంటాయే తప్ప వ్యవస్థలో ఉత్పత్తి అయ్యే మొత్తం వినియోగించబడుతుందని అతను భావించాడు. దీన్నే 'సే సూత్రం' అంటారు. అయితే ఈ సూత్రం బొత్తిగా అర్థం, పర్థం లేనిది. ఈ సూత్రమే గనుక వాస్తవం అయితే ఆర్థిక వ్యవస్థలో ఎన్నడూ అధికోత్పత్తి సంక్షోభం ఉత్పన్నం అయి వుండేది కాదు. సే సూత్రాన్ని మార్క్స్ చీల్చి చెండాడాడు. 1930 దశకంలో జె.ఎం.కీన్స్, మిచల్ కాలెక్కీ ఎవరికి వారుగానే, దాదాపు ఒకే సమయంలో ఈ సూత్రం చెల్లదని నిర్ధారించారు. అయినప్పటికీ, బూర్జువా ఆర్థిక పండితులు పెట్టుబడిదారీ వ్యవస్థలో లోపాలు ఉంటాయని అంగీకరించరు. అందుచేత రకరకాల బూటకపు సిద్ధాంత వ్యూహాలతో సే సూత్రాన్ని తిరిగి సమర్థించ డానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ ప్రయత్నాలలో ఎటువంటి శాస్త్రీయతా లేదు.

ఇదంతా ఇప్పుడు ఎందుకు చర్చిస్తున్నాం? స్వేచ్ఛా వాణిజ్యాన్ని సమర్థించే ప్రతీవాదనా సే సూత్రం చెల్లుబాటు అవుతుందనే ప్రాతిపదిక మీద నడుస్తుంది. అన్ని ఆర్థిక వ్యవస్థలూ పూర్తి స్థాయిలో ఉపాధి కల్పిస్తాయనే వాదన ప్రాతిపదికగా స్వేచ్ఛా వాణిజ్య సమర్థకులు వ్యవహరిస్తారు. ప్రతీ దేశంలోనూ లభించే వనరులను పూర్తి స్థాయిలో వినియోగించడం ద్వారా మొత్తం ప్రపంచ ఉత్పత్తిని స్వేచ్ఛా వాణిజ్యం పెంపొందిస్తుంది అని వారంటారు (ప్రతీ దేశమూ తనకు ఏయే రంగాల్లో ప్రావీణ్యత ఉందో ఆ రంగాల్లో ప్రత్యేకించి కేంద్రీకరించి ఉత్పత్తి చేస్తుందన్నది వారి వాదన). అందుచేత స్వేచ్ఛా వాణిజ్యం వలన అన్ని దేశాలూ లాభపడతాయని వారంటారు.

ఈ వాదనలకు మూలం సే సూత్రం. ఆ సూత్రమే అసలు చెల్లదు కనుక వీరి వాదనలు సైతం చెల్లవు. పెట్టుబడిదారీ దేశాలు సాధారణంగా పూర్తి స్థాయిలో తమ వనరులను అన్నింటినీ ఉత్పత్తి కోసం వినియోగించలేవు. ఎందుకంటే వాటిలో ప్రతీ దేశంలోనూ దేశీయ డిమాండ్ ఎప్పుడూ ఉత్పత్తి కన్నా తక్కువగానే ఉంటుంది. అందుచేత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద కూడా ఉత్పత్తి జరిగిన మేరకు సరిపడా డిమాండ్ ఉండదు. మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ డిమాండ్‌కు కొరత ఉన్న వ్యవస్థగానే ఉంటుంది. అందుచేత స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా ఒక దేశం తన ఉత్పత్తిని, ఉపాధి అవకాశాలను పెంచుకోవడం గనుక జరిగితే మరేదో దేశంలో ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు తగ్గిపోక తప్పదు. అంటే, స్వేచ్ఛా వాణిజ్యం వలన దేశాల మధ్య పీకలు తెగిపోయేంత తీవ్రమైన పోటీ నెలకొంటుంది. తక్కిన దేశాలకన్నా ముందే తన సరుకుల్ని అమ్మేసుకోవాలని ప్రతీ దేశమూ తాపత్రయపడుతుంది.

అందుచేత నయా ఉదారవాదం అనుసరించే వృద్ధి వ్యూహం మౌలికంగానే అనైతికమైనది, అంగీకరించ కూడనిది. ఈ వ్యూహం మూడో ప్రపంచ దేశాలు ఒకదానితో ఇంకొకటి పోటీ పడేట్టు చేస్తుంది. ఇది పూర్తిగా బూర్జువా వ్యూహం. పెట్టుబడిదారుడు కార్మికులు ఒకరితో మరొకరు పోటీ పడేట్టు చేస్తాడు (ఆ కార్మికులు సంఘాలుగా ఏర్పడి బూర్జువా వర్గాన్ని ఎదిరించేదాకా ఈ పోటీ సాగుతూనేవుంటుంది. ఆ తర్వాత కూడా కార్మికులకు, నిరుద్యోగులకు మధ్య పోటీ తప్పదు). అదే మాదిరిగా నయా ఉదారవాదం మూడో ప్రపంచ దేశాలు ఒకదానితో మరొకటి పోటీ పడేట్టు చేస్తాయి. వలస పాలనకు వ్యతిరేకంగా ఏ దేశానికి ఆ దేశం పోరాడుతున్నప్పుడు వాటి మధ్య ఒక విధమైన ఐక్యత, సౌహార్ద్రత పెంపొందాయి. నేటికీ ఆ ఐక్యత, సౌహార్ద్రత ఎంతో అవసరం. అది ఉంటేనే అవి సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నిలదొక్కుకోగలవు. వాస్తవానికి మానవ సమాజం పురోగమించాలంటే కావలసినది పరస్పర సహకారమే తప్ప పరస్పర పోటీ కానే కాదు. కాని నయా ఉదారవాదం ఇందుకు పూర్తి వ్యతిరేక దిశలో నడవాలని ఒత్తిడి చేస్తుంది. ఇది నైతికంగా అభ్యంతరకరం.

ఈ విధంగా అభ్యంతరం చెప్పడానికి మరొక కారణం కూడా ఉంది. నయా ఉదారవాద విధానాల అను భవం బట్టి చూస్తే స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో అన్ని రకాల నియంత్రణలనూ తొలగించ డంతో బాటు పెట్టుబడుల రాకపోకల మీద ఆంక్షలనూ తొలగించడం జరుగుతోంది. అలా చేయకపోతే లావాదేవీల చెల్లింపులో లోటును భర్తీ చేయడం చాలా దేశాలకు అసాధ్యం అయిపోతుంది. ఐతే ఈ విధంగా ఆంక్షలను తొలగించడం వలన ప్రపంచ పెట్టుబడుల ప్రవాహ తాకిడికి ప్రతీదేశమూ గురౌతుంది. దాని వలన అక్కడి ప్రభుత్వం బలహీనపడుతుంది. తన దేశంలో ఉత్పత్తిని పెంచడానికి గాని, ఉపాధి అవకాశాలను పెంచుకోడానికి గాని జోక్యం చేసుకోలేని స్థితిలో పడిపోతుంది.



> సంపన్నులు మాత్రమే వినియోగించే వివిధ రకాల విలాస వస్తువుల దిగుమతుల మీద ఆంక్షలు విధిస్తే కార్మికుల వేతనాలను తగ్గించకుండానే ఈ సమస్యను పరిష్కరించవచ్చు. అంటే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉపాధి అవకాశాలను పెంచి స్థూల డిమాండ్‌ను కూడా పెంచే దిశగా జోక్యం చేసుకోవచ్చు. ఆ క్రమంలో ఎదురయ్యే విదేశీ మారకపు కొరత సమస్యను పరిష్కరించ డానికి కొన్ని దిగుమతుల మీద ఆంక్షలు విధించవచ్చు. ఇదంతా సాధ్యమే (దానితోబాటు పెట్టుబడుల రాక, పోకల మీద కూడా ఆంక్షలు విధించాలి). విదేశీ రుణ భారం భరించలేనంతగా పెరిగిపోయిన దేశాల విషయంలో కూడా ఈ వ్యూహాన్ని అనుసరించవచ్చు. తీర్చవలసిన రుణాలలో ప్రాధాన్యత ప్రకారం చెల్లించే విధానాన్ని అనుసరిస్తే దీనికి ఒక దారి దొరుకుతుంది.

తమ అదుపులో లేని అదృశ్య శక్తుల మీద ప్రజల జీవన ప్రమాణాలు ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది. ఆ అదృశ్య శక్తులే ప్రపంచ స్థూల డిమాండ్‌ను నిర్ధారిస్తాయి. స్వతంత్రం వచ్చాక తమ ఆర్థిక భవిష్యత్తును తామే నిర్ణయించుకో గలుగుతామని విశ్వసించిన ప్రజలు వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. ఎన్నికల ద్వారా ప్రజా స్వామ్యయుతంగా తమ ఆకాంక్షల ను, కోర్కెలను ప్రతిబింబించే ప్రభుత్వాలు ఏర్పడతాయని, అవి తమ కోర్కెలను నెరవేరుస్తాయని వారు భావించారు. కాని నయా ఉదారవాద దశలో దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వాలు కాకుండా, పోటీ ప్రపంచపు స్వతఃసిద్ధ నియమాలు నిర్ధారించడం మొదలౌతుంది. ప్రజలు ఒక మేరకు తమ దేశ రాజకీయాలను నిర్ణయించగలుగుతారు. కాని ఆ రాజకీయాలతో దేశ ఆర్థిక వ్యవస్థను నియంత్రించలేని, ప్రభావితం చేయలేని పరిస్థితి వస్తుంది. అంటే వలస పాలన కాలం నాటి నిర్బంధ పరిస్థితి మళ్ళీ ఏర్పడుతుందన్నమాట. స్వతంత్ర దేశంలో ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోలేని స్థితి రావడం అంటే అది నైతికంగా చాలా అభ్యంతరకరమైనది.

ఈ నైతిక అభ్యంతరాలను పక్కన పెట్టి కేవలం ఆర్థిక కోణం నుండే పరిశీలించినా, సే సూత్రం కొరగానిదిగానే తేలుతుంది. ఎటువంటి నియంత్రణా లేని వాణిజ్యం మీద ఆధారపడి రూపొందించిన వృద్ధి వ్యూహం కన్నా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసే వ్యూహమే అన్ని రకాలుగా మిన్నగా ఉంటుంది. ఇప్పుడు ప్రపంచ మార్కెట్‌లో ఉత్పత్తికి తగిన మోతాదులో డిమాండ్ లేదు అంటే దానర్థం ప్రపంచంలో కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలలో (అన్నింటిలోనూ ఉండాలని లేదు) డిమాండ్‌కు కొరత ఉందని అర్థం. మూడవ ప్రపంచ దేశాల విషయానికి వస్తే అవన్నీ సాధారణంగా స్థూల డిమాండ్ తగినంత లేక కొరతతోనే ఉంటాయి. నయా ఉదారవాద విధానాల అమలు అనంతరం ఇది ఆ దేశాలకు సర్వ సాధారణ లక్షణం అయిపోయింది. అటువంటప్పుడు అక్కడ ప్రభుత్వాలు జోక్యం చేసుకుని స్థూల డిమాండ్‌ను పెంచే చర్యలు తీసుకుంటే మూడవ ప్రపంచ దేశాల పరిస్థితి తప్పకుండా మెరుగౌ తుంది. ఉపాధి అవకాశాలు పెరిగి ఉత్పత్తి కూడా పెరుగుతుంది. అటువంటి పరిస్థితి స్వేచ్ఛా వాణిజ్యం అమలౌతుంటే సాధ్యం కాదు.

అయితే ఇక్కడ మూడు మినహాయింపులు అవసరం.

ఒకటి : మనం మూడవ ప్రపంచం మొత్తం మీద అన్నింటినీ కలిపి మాట్లాడుతున్నాం. కాని ఈ మూడవ ప్రపంచ దేశాలలో కొన్ని ఇప్పటికే ఎగుమతుల పెంపుదలలో విజయ వంతమై వుండవచ్చు. వాటి ఉత్పత్తి ఇప్పటికే చాలా ఎక్కువగా ఉండి ఆ దేశాలలో స్థూల డిమాండ్ మరి అదనంగా పెరిగే అవకాశాలు దాదాపు లేకపోవచ్చు. కాని తక్కిన మూడవ ప్రపంచ దేశాలు కూడా అదే విధంగా విజయవంతం కావడం ఇక సాధ్యపడదు. ఒకానొక వ్యక్తి లాటరీలో ప్రైజ్‌మనీ గెలుచుకున్నాడు కాబట్టి లాటరీ టిక్కెట్లు కొన్న వారందరూ గెలుచుకోవడం ఎలా సాధ్యం కాదో ఇదీ అంతే.

రెండవది : మూడవ ప్రపంచ దేశాలలో విజయవంతం అయిన దేశాలు అక్కడ ప్రభుత్వాలు ఎగుమతులను పెంచే విషయంలో బలంగా జోక్యం చేసుకున్నాయి గనుకనే వాటి విజయం సాధ్యపడింది. ఆ ప్రభుత్వాలు గనుక స్వేచ్ఛా వాణిజ్య సూత్రాన్ని పాటించి జోక్యం చేసుకోకుండా వదలివేసినట్లయితే ఈ విజయం సాధ్యపడేది కాదు. దీనిని పట్టుకుని కొందరు అన్ని దేశాలలోనూ ఎగుమతులను ప్రోత్సహించే వాణిజ్య వ్యూహాన్ని అనుసరించాలని వాదిస్తున్నారు. కాని ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగా డిమాండ్ కొరతతో ఉన్నప్పుడు ఒక దేశంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎగుమతులను పెంచడానికి పూనుకుంటే అప్పుడు అనివార్యంగా వేరే ఇంకొక దేశపు వ్యాపారం దెబ్బ తింటుంది. పరస్పర సహకారం ఉంటే తప్ప మూడవ ప్రపంచ దేశాలు సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని నిలవరించలేవు అని అనుకున్నప్పుడు వాటిలో వాటికి పోటీ పెట్టే వాదన ముందుకు తేవడం నైతికంగా అభ్యంతరకరమే గాక ఆర్థిక సూత్రాలను బట్టి చూసినా, మూడవ ప్రపంచ దేశాలన్నీ వృద్ధి చెందడానికి ఈ వ్యూహం ఎంతమాత్రమూ తోడ్పడదు.

మూడవది: ఇప్పటికే మూడవ ప్రపంచ దేశాలలో జరుగుతున్న ఉత్పత్తి వాటికున్న సామర్థ్యం కన్నా చాలా తక్కువ స్థాయిలో ఉంది. ఇటువంటప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుని స్థూల డిమాండ్‌ను పెంచే దిశగా, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా ప్రయత్నిస్తే అప్పుడు విదేశీ మారకద్రవ్య నిల్వలలో లోటు పెరుగుతుంది. అందుచేత ఎగుమతులను పెంచడం తప్ప వేరే వ్యూహం ఏదీ మనకు కనిపించదు. కేవలం దేశీయ డిమాండ్‌ను పెంచినంత మాత్రాన సరిపోదు. ఇలా నయా ఉదారవాద చట్రం లోపల ఉంటూ ఎగుమతులను పెంచుకోవాలంటే మన కరెన్సీ మారకపు రేటును తగ్గించుకోవడం అనివార్యం అవుతుంది. అలా చేస్తే, మనం దిగుమతి చేసుకునే వస్తువుల రేట్లు పెరుగుతాయి. వాటిలో మనకు అత్యవసరమైన చమురు వంటివి కూడా ఉన్నాయి. వాటి రేట్లు పెరిగితే ఆ భారం మళ్లీ వినియోగదారుల మీదే పడుతుంది. దాని ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అలా పెరగకుండా చూడ డానికి నయా ఉదారవాదం ఒక పరిష్కారాన్ని చూపిస్తుంది. ఒకపక్క మన కరెన్సీ మారకపు రేటును తగ్గించినా, మరొకపక్క కార్మికులకిచ్చే వేతనాల రేటును కూడా తగ్గించి వేస్తుంది. కార్మికుల ఉత్పాదకత పెరిగినా దానితోబాటుగా పెరగవలసిన వేతనాలను పెరగనివ్వదు.

కాని ఆ విధంగా చేయడం అన్యాయమే కాదు, అనవసరం కూడా. సంపన్నులు మాత్రమే వినియోగించే వివిధ రకాల విలాస వస్తువుల దిగుమతుల మీద ఆంక్షలు విధిస్తే కార్మికుల వేతనాలను తగ్గించకుండానే ఈ సమస్యను పరిష్కరించవచ్చు. అంటే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉపాధి అవకాశాలను పెంచి స్థూల డిమాండ్‌ను కూడా పెంచే దిశగా జోక్యం చేసుకోవచ్చు. ఆ క్రమంలో ఎదురయ్యే విదేశీ మారకపు కొరత సమస్యను పరిష్కరించ డానికి కొన్ని దిగుమతుల మీద ఆంక్షలు విధించవచ్చు. ఇదంతా సాధ్యమే (దానితోబాటు పెట్టుబడుల రాక, పోకల మీద కూడా ఆంక్షలు విధించాలి). విదేశీ రుణ భారం భరించలేనంతగా పెరిగిపోయిన దేశాల విషయంలో కూడా ఈ వ్యూహాన్ని అనుసరించవచ్చు. తీర్చవలసిన రుణాలలో ప్రాధాన్యత ప్రకారం చెల్లించే విధానాన్ని అనుసరిస్తే దీనికి ఒక దారి దొరుకుతుంది.

కాని ఈ విధమైన వ్యూహాన్ని అనుసరించడానికి అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ఎంతమాత్రమూ అంగీకరించదు. దాని వెనుక ఉన్న బలమైన దేశాలూ అంగీకరించవు. కాని వాళ్ల ప్రబోధిస్తున్న ఆర్థిక సిద్ధాంతం యావత్తూ ఎంత లోపభూయిష్టమో మనం ఇప్పుడు చూశాం. అందుచేత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, సంపన్న పశ్చిమ దేశాలు ఆదేశించినదానికల్లా తలాడించడం కాకుండా మూడవ ప్రపంచ దేశాలు విడివిడిగా కాని, అందరూ కలిసికట్టుగా కాని తమ తమ దేశాల్లో స్థూల డిమాండ్‌ను పెంచేవిధంగా ఉపాధి అవకాశాల కల్పన కోసం ప్రయత్నిం చాలి. విదేశీ మారకద్రవ్యం దేశ అవసరాల ప్రాధాన్యత రీత్యా ఖర్చు చేసే నియంత్రణను పాటించాలి.

(స్వేచ్ఛానుసరణ)

ఎందాక పరిగెడతావ్?

ఆలసించకు యోచించకు
సహనాన్ని పరీక్షించకు
వెంటపడే మగనీడను
క్షమించి వదిలేయకు
అవి ఆపన్నహస్తాలని భ్రమించకు
ఎందాక పరిగెడతావ్?
ఎవరిని నమ్మి అడుగేస్తావ్?
అవి రాబందుల మూకలైతే
తృటిలోనే రెక్కలు తుంచెయ్
అవి కామాంధుల చూపులైతే
తక్షణమే కండ్లు రక్కెయ్
అనుమానం పొడవకముందే
దిక్కులన్నీ అన్వేషించెయ్

నమ్మకాన్ని పరిచావో
అందులో నిన్ను చుట్టేస్తారు
ఆదమరిచి అడుగు వేసావో
ఆరడుగులు తోడేస్తారు
ఒళ్లంతా కండ్లు చేసుకో



మనసుకు పదును పెట్టుకో
కామం కండ్లు కదిపితే
నిలువునా నరికెయ్
చేష్టల్లో చేర్పు కనిపిస్తే
అడ్డంగా చీరెయ్
యువతి శక్తి పురివిప్పితే
యావత్తూ కంపిస్తుందని
పిడికిలి పట్టుకు ఊతమిస్తూ
కామ రక్కసుల గొంతు బిగించెయ్

సుతిమెత్తని నీ అడుగుల్ని
పిడుగుపాటుగా మార్చెయ్
తిరగబడు తెగబడు
ఉరుమై ధ్వనిస్తూ జ్వాలై ఎగస్తూ
వెంబడించే క్రూరత్వాన్ని
పాతాళానికి తొక్కిపడెయ్

ఓ యువతీ
సున్నితత్వంలో శూరత్వం
సహనంలో ధీరత్వం
మెతకదనంలో కఠినత్వం
చూపుల్లో చురుకుదనం
కలబడేతత్వానికి
ఎగబడే ధైర్యాన్ని సంధించు
మహిళా శక్తికి సానబెట్టు
మౌనం సమంజసం కాదు
కామాసురులను తరగబట్టు
నిర్భయంగా సమాజంలో నిలబడు..

- నరెడ్డుల రాజారెడ్డి
సెల్: 9666016636

స్వతంత్ర భారతం - ఎదుర్కొంటున్న సవాళ్లు!



టి. స్కైలాబ్ బాబు
9177549646

మన దేశ స్వాతంత్ర్యానికి డెబ్బయి ఏడేండ్లు నిండాయి. అసమానతలు లేని భారత్ కోసం కలలుగన్న అంబేద్కర్ ఆశయాన్ని అవగతం చేసుకోవాల్సిన తరుణమిది. అయితే మనకు స్వాతంత్ర్యం సిద్ధించినప్పటినుంచి నేటివరకు దేశాన్ని ఏలుతున్న రెండు పార్టీలు ఏమీ సాధించాయి? ఎవరి తరుపున నిలబడ్డాయి? అవి అనుసరించిన విధానాలు పేదల బతుకులు మార్చాయా? నేడు అమలు చేస్తు న్న విధానాలు ఎవరి ప్రయోజనాల కోసం? ఈ అంశాలన్ని కూడా ప్రతి ఒక్క భారతీయుడు ఆలోచించాల్సిన సమయమిది.

బీజేపీ మూడో దఫా అధికారంలోకి వచ్చింది. ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీ ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. తొంభై ఎనిమిది నిమిషాల పాటు మురిపించే మాటలతో ప్రజల్ని మైమరిపించారు.ఆయన ప్రసంగంలోని సారమంతా కూడా మతపరమైన ఎజెండా చుట్టూనే తిరిగింది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు లాంటి వివాదాస్పద అంశాలను లేవనెత్తారు. దేశం అభివృద్ధిపథంలో పయనిస్తోందని, త్వరలో ప్రపంచ మూడో పెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదుగుతుందని చెప్పుకొచ్చారు. అయితే ఆయన ఉపన్యాసంలో చెప్పిన విషయాలు దేశ వాస్తవిక పరిస్థితుల్ని ప్రతిబించించలేదు. ఇంకా బంగ్లాదేశ్ సంక్షోభంలో మైనార్టీల అభద్రత గురించి ఆందోళన వ్యక్తం చేశారు. అయితే స్వదేశంలో ఆరెస్సెస్-సంఘ్ పరివార్ ముస్లింలపై చేస్తున్న దాడుల్ని మాత్రం పట్టించుకోలేదు. దేశం ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలు ఆకలి, పేదరికం, దారిద్ర్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగ్యాన్ని పక్కదారి పట్టించారు. అందరికీ విద్యా వైద్యం, ఉపాధి ఊసే ఎత్తలేదు. నూట నలభై కోట్ల అశేష జనాభా కలిగిన దేశాన్ని నడిపించే నాయకుడు ఎంతో దార్శనికతతో వ్యవహరించాలి. రాజ్యాంగబద్ధంగా పాలన సాగించాలి. కానీ మోడీ గత పదేండ్లుగా చేస్తున్నదేమిటి? చేయాలనుకున్నదేమిటో కూడా దేశ ప్రజలు తెలుసుకుంటున్న సందర్భమిది.

కుల, మత, భాషా, ప్రాంత లింగ భేదం లేకుండా, మనుషులంతా సమానమేనని చాటిచెప్పిన గొప్ప రాజ్యాంగం మనది. భారత ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛ, సమాన హోదా, సమాన అవకాశాలు కల్పించే సౌలభ్యాన్ని ప్రకటించింది. రాజ్యాంగం పౌరులందరికి సమాన హక్కులు కల్పించింది. చట్టం ముందు అందరూ సమానులేనని పేర్కొంది. ఇది అమల్లోకి వచ్చి డెబ్బయి నాలుగేండ్లవుతోంది. అలాంటి రాజ్యాంగం ఇప్పుడు మోడీ పాలనకు అడ్డుగా ఉంది. ఈ రాజ్యాం గాన్ని ఇప్పుడు ఉంచాలా? తుంచెయ్యాలా? అని మనువాద బీజేపీ ఆలోచిస్తున్నది. ఆలోచనే కాదు, ఒక అడుగు ముందుకేసి 'అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పనికిరాదు. ప్రాచీన భారత రాజ్యాంగం మనుస్మృతి' అని ప్రకటించింది. ఇప్పుడు మనుస్మృతిని దేశ పవిత్ర రాజ్యాంగంగా మార్చాలనే కుటిలయత్నాల్లో తలమున కలై ఉన్నది. ఇది దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాల్.

రాజ్యాంగ లక్ష్యాలకు తూట్లు!

భారత రాజ్యాంగ పీఠిక ఐదు మౌలిక పునాది అంశాలతో కూడి ఉన్నది.సర్వసత్తాక, సామ్యవాద లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా విరాజిల్లాలని ఆకాంక్షించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 చట్టం ముందు అందరూ సమానులేనని ప్రకటించింది. ఆర్టికల్ 15 కుల, మత, లింగ, భాష, జాతి, జన్మస్థలం ప్రాతిపాదికన ఏ వ్యక్తి పట్ల వివక్ష పాటించకూడదని పేర్కొన్నది. ఆర్టికల్ 16 ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికీ సమాన ఉద్యోగ అవకాశాలు ఉండాలని పేర్కొన్నది. ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధిం చింది.ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛను కలిగి ఉండాలని పేర్కొన్నది. ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశాలు జరుపు కునే స్వేచ్ఛ, యూనియన్లు, ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ, భారతదేశమంతటా స్వేచ్ఛగా సంచరించే హక్కు, భారత భూభాగంలోని ఏ ప్రాంతంలోనైనా నివసించే హక్కు, ఏ విధమైన వృత్తి వ్యాపారాలను చేసుకునే హక్కును ఆర్టికల్19 కల్పించింది. కానీ భావ ప్రకటన స్వేచ్ఛను పూర్తిగా హరించి వేసింది మోడీ ప్రభుత్వం. ప్రశ్నించే స్వభావాన్ని రాజ్యాంగ స్ఫూర్తి ఆహ్వానిస్తుంటే, బీజేపీ పాలనలో ప్రశ్నించడం నేరం, దేశ ద్రోహమైంది. 'ఉపా' చట్టానికి సవరణలు చేసి సామాజిక హక్కుల కార్యకర్తల్ని నిర్బంధించింది. రాజ్యం నిరంకుశధోరణి కారణంగా సంపూర్ణ వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా పదేండ్లు అకారణంగా జైలు జీవితం గడపాల్సి వచ్చింది. గిరిజన హక్కుల నేత స్టన్‌స్వామి జైల్లోనే మరణించాల్సిన దుస్థితి కల్పించింది.



> పోరాడి సాధించుకున్న ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అటకెక్కించారు. దళిత జనాభా ఇరవై శాతం ఉంటే యూనియన్ బడ్జెట్‌లో పదకొండు శాతం కేటాయించి కాగితాలకే పరిమితం చేశారు. గతపదేండ్లలో ఇందులో కేవలం 3.2 శాతం మాత్రమే ఖర్చు చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ లేనేలేదు. దళితులకు విద్య అందని ద్రాక్షగానే మిగిలింది. నూతన విద్యావిధానం ముసుగులో ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర జరుగుతున్నది. ప్రకృతి వనరుల్లో, బడ్జెట్‌లో, దేశ సంపదలో జనాభా ప్రాతిపాదికన సమాన అవకాశాలు దక్కాలి. అదే సామాజిక న్యాయం. అది మన దరి చేరాలంటే మనువాద బీజేపీని అధికారానికి దూరం చేయాలి. దానికిముందు రాజ్యాంగ రక్షణకు కంకణబద్ధులవ్వాలి.

లౌకికస్ఫూర్తిని దెబ్బతీస్తున్న పాలన!

ఆర్టికల్ 25-28 మత స్వేచ్ఛ సంబంధ విషయాలు తెలియజేస్తుంది.ఆర్టికల్ 25 మతం వ్యక్తిగత విశ్వాసంగా కలిగి ఉండే హక్కును కల్పిస్తుంది. ఆర్టికల్ 26 మత సంస్థల విషయంలో స్వేచ్ఛ ఉండాలని, ఆర్టికల్ 27 మతవ్యాప్తికై పన్ను విధించరాదని, ఆర్టికల్ 28 విద్యాలయాల్లో మత బోధన పనికిరాదని పేర్కొంటున్నది. కానీ మోడీ పాలన ఈ ఆర్టికల్స్ అన్నింటికి భిన్నంగా పని చేస్తోంది. మత విభజనను యథేచ్ఛగా ప్రోత్సహిస్తోంది. లౌకికతత్వం అంటే మతానికి, రాజ్యానికి సంబంధం ఉండకూడదు. మతం వ్యక్తిగతమే కానీ రాజకీయం, పరిపాలనలోకి రాకూడదని రాజ్యాంగం చెబుతోంది. కానీ దేశ లౌకికస్ఫూర్తిని దెబ్బ తీసేవిధంగా బీజేపీ వ్యవహరిస్తోంది. మతసామరస్యానికి నిల యంగా, మతాలకతీతంగా ప్రజలు ఒక్కతాటిపైకి వచ్చి బ్రిటిష్ పాలకులను తరిమికొట్టారు. కానీ నేడు ముస్లింలు పాకిస్థాన్ వెళ్లిపోవాలి లేదా దేశంలో రెండవ శ్రేణి పౌరులుగా ఉండాలంటూ భయభ్రాంతులు సృష్టిస్తున్నారు. ఇది రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధం. చరిత్ర వక్రీకరణ, మూఢత్వ ఛాందస భావాలను పెంచడానికి కుట్రలు చేస్తోంది. విద్యార్థుల పాఠ్యపుస్తకాలను కాషాయికరిస్తోంది. అంబేద్కర్, భగత్‌సింగ్ వంటి మహనీయుల సిలబస్‌ను తొలగించింది. మైనార్టీలు తినే ఆహారంపై కన్నేసింది. గోరక్షక దళాల పేరుతో హత్యలకు పాల్పడుతోంది.ఇదేనా మోడీ చెప్పే 'వికసిత భారత్'. ఇదేనా దేశం వెలుగుతున్న తీరు.

ఎవరి ప్రయోజనాల కోసం?

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల వలన ఎన్నుకున్నదే ప్రజాస్వామ్యం. కానీ ప్రజల కోసం కాకుండా కార్పొరేట్లకు కాపలాగా మారిన మోడీ సర్కార్ ఏకంగా ఓటును ఒక సరుకుగా మార్చింది. మత విద్వేషాలను రెచ్చగొట్టి, ప్రజల మధ్య చిచ్చు పెట్టి, తద్వారా ఓట్లు దండుకోవాలనేది నేడు బీజేపీ విధానంగా మారింది. కోట్లు పెట్టి ఓట్లు కొంటున్న పరిస్థితి ఈ పదేండ్లలో విపరీతమైంది. దేశంలో 169 శత కోటీశ్వర్ల చేతుల్లో దేశ సంపద 40శాతం పోగుపడింది. ప్రపంచ ఆకలి సూచికలో మన దేశం 2022లో 107 స్థానంలో ఉండగా 2023లో 111వ స్థానానికి చేరింది. మరోవైపు ఆదానీ ప్రపంచంలో అతిపెద్ద రెండవ కుబేరుడయ్యాడు. మరో వైపు 42కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. దీన్నిబట్టి చూస్తే ఆర్థిక అంతరాల్ని తగ్గించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. శాస్త్ర, సాంకేతిక రంగం 'ఆకాశమంత' ఎత్తుకు ఎదిగినా క్షేత్రస్థాయిలో నేటికీ కులవివక్ష, అంటరానితనం నిరాం టంకంగా కొనసాగుతూనేవుంది. సామాజిక న్యాయం సమాధి చేయబడుతోంది. నవరత్నల్లాంటి కీలక ప్రభుత్వ సంస్థలను కార్పోరేట్ శక్తులకి కారుచౌకగా కట్టబెడుతున్నది. దీనివల్ల నూటికి 80 శాతం ప్రభుత్వ రంగం ప్రయివేటుపరం అయింది.ఈ రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల సామాజికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాలు అభివృద్ధికి నోచుకోని పరిస్థితి నెలకొంది.

దౌర్జన్యాలు, హత్యలు, లైంగికదాడులు!

బీజేపీ ఈ పదేండ్ల పాలనలో దళితులపై 300 రేట్లు దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, లైంగికదాడులు పెరిగాయి. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై హింస పెట్రేగిపోతోంది. నేషనల్ క్రైం రిపోర్ట్ ప్రకారం హత్యల్లో, 15898 కిడ్నాప్ కేసుల్లో ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం ముందువరుసలో ఉంది. దళితులపై దాడుల్లో మొత్తం 40801 జరిగితే అందులో ఒక్క యూపీలోనే10426 జరిగాయి.రేప్ కేసుల్లో మధ్యప్రదేశ్ ప్రధాన స్థానంలో నిలిచింది. వీటిని పరిశీలిస్తే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మహిళలు, మైనార్టీలు అభద్రతలో ఉన్నారు. సామాజిక న్యాయమంటే కొంతమందికి మంత్రి పదవులివ్వడం, ఆదివాసి మహిళను రాష్ట్రపతిని చేశామని చెప్పుకోవడం కాదు! సామాజిక వర్గాలు స్వతంత్రంగా జీవించేలా హక్కుల్ని కాపాడటం, వారిని అభివృద్ధిలోకి తీసుకురావడం, కొనుగోలు శక్తి పెంచే చర్యలకు ఉపక్రమించడం. పోరాడి సాధించుకున్న ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అటకెక్కించారు. దళిత జనాభా ఇరవై శాతం ఉంటే యూనియన్ బడ్జెట్‌లో పదకొండు శాతం కేటాయించి కాగితాలకే పరిమితం చేశారు. గతపదేండ్లలో ఇందులో కేవలం 3.2 శాతం మాత్రమే ఖర్చు చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ లేనేలేదు. దళితులకు విద్య అందని ద్రాక్షగానే మిగిలింది. నూతన విద్యావిధానం ముసుగులో ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర జరుగుతున్నది. ప్రకృతి వనరుల్లో, బడ్జెట్‌లో, దేశ సంపదలో జనాభా ప్రాతిపాదికన సమాన అవకాశాలు దక్కాలి. అదే సామాజిక న్యాయం. అది మన దరి చేరాలంటే మనువాద బీజేపీని అధికారానికి దూరం చేయాలి. దానికిముందు రాజ్యాంగ రక్షణకు కంకణబద్ధులవ్వాలి.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
గురువారం | ఆగస్టు 22, 2024 | www.navatelangana.com

పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని సర్క్యులర్

- విడుదల చేసిన ఎలక్షన్ కమిషన్

నవతెలంగాణ-వైరా

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ బుధవారం సర్క్యులర్ విడుదల చేసింది. జిల్లా పంచాయతీ అధికారి ద్వారా అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సర్క్యులర్స్ అందినవి. నోటిఫికేషన్ నెంబర్ 1001 / టీజీఎస్ ఈసిబి పంచాయతీ రాజ్ 2024, తేది 21-08-2024 ను విడుదల చేసింది. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ జిల్లా పంచాయతీ అధికారులకు ఈ నోటీస్‌ను బుధవారం పంపింది. 21-09-2024 నాటికి ఫొటోతో సహా ఓటర్ లిస్టులను తయారు చేయాలని నోటిఫికేషన్ లో పేర్కొంది. తయారైన ఓటర్ జాబితాలను గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల వద్ద 6-9-24 కల్లా డిస్‌ప్లే చేయాలని, 09-09-24న జిల్లా స్థాయి రాజకీయ పార్టీలతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించాలని, అన్ని మండల కేంద్రాలలో 10-09-24న రాజకీయ పార్టీల సమావేశం జరపాలని తెలిపింది. 07-09-24 నుండి 13-09-24 వరకు అభ్యంతరాలను స్వీకరించాలని, 19-09-24 నాటికి అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి తెలపాలని, ఫైనల్ పబ్లికేషన్‌ను 21-09-24 నాటికి పూర్తి చేయాలని నోటిఫికేషన్ లో పేర్కొంది.



నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి కల్పించేందుకు కృషి...

- మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గ నిరుద్యోగ అభ్యర్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు గాను రైట్ ఛాయిస్ అకాడమి ఛైర్మెన్ మెండెం కిరణ్ కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన శీనన్న ఉచిత కోచింగ్ ను మండల పరిధిలో నాయుడుపేటలోని రాంలీలా ఫంక్షన్ హాల్లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పడ్డ తరువాత ఇప్పటికే దాదాపుగా 30 వేల పైచిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, త్వరలోనే 11 వేల ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపడతామన్నారు. ప్రతి ఏడాది వివిధ శాఖలలో ఖాళీ అయిన పోస్టులను వెంటనే భర్తీచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ఉద్యోగ క్యాలండర్‌ను కూడా విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ రంగంలోనే

కాకుండా ప్రయివేటు రంగంలో కూడా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తుందన్నారు. నిరుద్యోగ యువకులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకొని మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ ఛైర్మన్ మువ్వా విజయబాబు,గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మెన్ రాయల నాగేశ్వరరావు, సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, రైట్ ఛాయిస్ అకాడమి ఛైర్మెన్ కిరణ్ కుమార్, నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, పాల్గొన్నారు.

ఓబీసీ అడ్వకేట్ కన్వెన్షన్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఓబీసీ అడ్వకేట్ కన్వెన్షన్ వారి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఓబీసీ అడ్వకేట్ కన్వెన్షన్ ప్రోగ్రాం ఆగస్టు 25న హైదరాబాద్‌లో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీసీ వేల్ఫేర్, ట్రాన్స్ పోర్ట్ మంత్రివర్యులు పాల్గొంటారని నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది బిచ్చాల తిరుమలరావు మాట్లాడుతూ దేశంలో కుల గణన జరగాలని, అలా జరిగితే ఓబిసిలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మరికొంత మంది సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ కులగణన జరగాలని ఓబిసిలు బలంగా కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఓబీసీ అడ్వకేట్ కన్వెన్షన్ అధ్యక్షుడు వి.ఎం. కృష్ణ, ఎస్.నరేంద్రర్, బిక్షమయి, ఖమ్మం సీనియర్ న్యాయవాదులు మేకల సుగుణరావు, జహీర్ ఆలీ, రావూరి నర్సింహరావు, మలీదు నాగేశ్వరరావు, షేక్. లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, మరీదు రామారావు, ఆకుల శేఖర్ బాబు, చింతల వెంకట్, టి. వెంకట నారాయణ, జి. వీరభద్రం పాల్గొన్నారు.



ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఎంపీ రామసహాయం రఘు రామిరెడ్డి

నవతెలంగాణ-వైరా

ప్రతీ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తుందని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామ రెడ్డి అన్నారు. బుధవారం వైరా ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం వైరా నియోజక వర్గంలోని ఐదు మండలాల లబ్దిదారులకు వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి ఎంపీ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎంఎల్ఏ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన అన్ని పనులను ప్రాధాన్యతా క్రమంలో చేసుకుంటూ వస్తుందని అన్నారు. ఎంఎల్ఏ రాందాస్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల ఊబిలో దించిపోయినా, పేద కుటుంబాలను, బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు వివిధ పథకాలను ప్రకటించి అమలు చేస్తుందని అన్నారు. 185 మంది లబ్దిదారులకు రూ.51,52,000 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ సూతకాని జైపాల్, మార్క్ ఫెడ్ మాజీ వైస్ ఛైర్మెన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, ఏన్కూరు సహకార సంఘం అధ్యక్షులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, జులూరు పాడు సహకార సంఘం అధ్యక్షులు లేళ్ల వెంకట రెడ్డి, సిరిపురం మాజీ ఎంపీటీసీ సభ్యులు మచ్చా బుజ్జి, మట్టూరి కృష్ణారావు, వెంపటి రంగారావు, పనితి సైదులు తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు రూ.1.15 లక్షల విరాళం

నవతెలంగాణ-ఖమ్మం

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన కేరళ రాష్ట్రం వయనాడ్ బాధితులకు సీపీఐ జిల్లా సమితి విరాళాల ద్వారా సేకరించిన మొత్తాన్ని రాష్ట్ర కార్యదర్శికి అందజేశారు. రూ.1,15,578 చెక్కును జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు అందజేశారు. సత్తుపల్లి నుంచి సేకరించిన రూ.11,250, కూసుమంచి నుంచి రూ.7వేలు, ఖమ్మం జిల్లా నుంచి సేకరించిన రూ.97,320 లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మెన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కూసుమంచి ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన సరిత

నవతెలంగాణ-కూసుమంచి



వ్యవసాయ శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా కూసుమంచి డివిజన్ ఏడీఏగా బి.సరిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కూసుమంచి డివిజన్ ఏడీఏగా పనిచేసిన ఎస్.విజయచంద్ర మధిర బదిలీ అయ్యారు. సరిత ఏడీఏ టెక్నికల్ అధికారిగా జెడీఏ కార్యాలయంలో పనిచేశారు. ఈ సందర్భంగా నూతన ఏడీఏకు మండల వ్యవసాయ శాఖ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు ప్రభుత్వ నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా ప్రతిపాదనపై చర్చ

నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా ప్రతిపాదనపై చర్చకు ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఈ సమావేశం ఉదయం 10.30 గంటల నుండి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కొత్త రెవెన్యూ చట్టంపై సంప్రదింపుల సమావేశానికి మేధావులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, రైతులు పాల్గొననున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- గత 10 సంవత్సరాలు అభివృద్ధి పనులు లేక ఇబ్బందులు పడ్డాం
- జమలాపురం క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తా

నవతెలంగాణ-ఎర్రుపాలెం



గత పది సంవత్సరాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టక తీవ్ర ఇబ్బందులు చెందామని, ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జమలాపురం గ్రామంలో జరిగిన బహిరంగ సభలో భట్టి మాట్లాడుతూ తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం క్షేత్రాన్ని రాష్ట్రానికే వన్నె తెచ్చే విధంగా పర్యాటక కేంద్రంగా మార్చే ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఎనిద్రం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాను., ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిస్టులు రెండు రోజులపాటు జమలాపురంలో గడిపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. జమలాపురం టూరిజం ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ గత ప్రభుత్వ పాలకుల అలసత్వం వల్ల అభివృద్ధి జరగలేదన్నారు. జమలాపురం చెరువు అహ్లాదకరంగా ఉండేలా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అతి త్వరలో పనులకు శంకుస్థాపన చేస్తానన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి అధికారికంగా తూము ఏర్పాటు చేయించి జమలాపురం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారుస్తామన్నారు. మండలంలో ఎక్కడ తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. రెండవ జోన్‌గా మార్చేందుకు అవసరమైన సర్వేలు, మ్యాపులు, ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. త్వరలోనే జీవో విడుదల అవుతుందని బడ్జెట్ లో అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. ఎర్రుపాలెం మండలంలో మిగిలి ఉన్న రోడ్లను పూర్తి చేసి ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లేందుకు వీలుగా రహదారులు నిర్మించి మండలం మొత్తం ఒక రింగ్ రోడ్డులా అభివృద్ధి చేస్తామన్నారు. కట్టలేరు ఆధునికరణకు నిధులు మంజూరు చేశాం.

మండలంలో మీనవోలు గ్రామం నుండి బనిగండ్లపాడు గ్రామం వరకు ఒక కోటి 70 లక్షల రూపాయల రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎర్రుపాలెం నుండి పెగళ్లపాడు గ్రామం వరకు రెండు కోట్ల 40 లక్షల రూపాయలు, కొత్తపాలెం నుండి గట్ల గౌరవరం గ్రామం వరకు 20 కోట్ల రూపాయలు, ఎర్రుపాలెం వయా జమలాపురం నుండి రాజుపాలెం వరకు 25 కోట్ల రూపాయ లు, వెంకటాపురం నుండి బనిగండ్లపాడు వరకు ఆరు కోట్ల రూపాయలు,బుచ్చిరెడ్డిపాలెం నుండి వెంకటాపు రం వరకు రెండు కోట్ల 20 లక్షలు రూపాయలు, నారా యణపురం నుండి రాజుపాలెం వరకు 95 లక్షల రూ పాయలు, రాజుపాలెం నుండి కొత్తపాలెం వరకు కోటి అర్వై లక్షల రూపాయల రోడ్ల నిర్మాణ పనులకు శంకు స్థాపనలు చేశారు.సుమారు 60 కోట్ల రూపాయల ని ధులను కేటాయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, పిసిసి సభ్యులు శీలం ప్రతాపరెడ్డి, డిసిసిపి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు బండారు నర సింహారావు,సేలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకట క ష్ణారావు, తూల్లూరి కోటేశ్వరరావు, రాయల నాగేశ్వర రావు, బొగ్గుల గోవర్ధన రెడ్డి, షేక్ ఇస్మాయిల్, మల్లెల ల క్ష్మణరావు, వేమిరెడ్డి అనురాధ, అంకశాల శ్రీనివాస రా వు, నన్నపనేని రామారావు, మూల్పూరి స్వప్న వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు, కేటీఆర్ సిగ్గు, ఎగ్గు ఉందా..



రైతు రుణమాఫీపై మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లు మాట్లాడటం హాస్యా స్పదంగా ఉందని, అసలు మీకు సిగ్గు, ఎగ్గు ఉందా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘటుగా విమర్శించారు. బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జమలాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో భట్టి మాట్లాడారు. గత 10 సంవ త్సరాల కాలంలో లక్ష రూపాయాల రుణమాఫీ చేయడానికి చేవ చచ్చి చేతకాని మీరు నాలుగు దఫాలుగా రైతు రుణాలు మాఫీ చేయలేని బీఆర్ఎస్ నాయకులు అధికారం చేపట్టి సంవత్సరం గడవకుండా ఒకేసారి 2 లక్షలు రుణ మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద జోన్ 3 గా ఉన్న మధిర, ఎర్రుపాలెం మండలాలను జోన్2 గా మార్చేందుకు రూ.500 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. స్వయం సహా యక సంఘాలను పట్టించుకోకపోయినా వారిని ప్రతిష్ట పరచడం కోసం తమ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు 20 వేల కోట్ల చొప్పున ఈ ఐదు సంవత్సరాలలో లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను అందించనున్నామని తెలిపారు. ప్రతి నిమిషాన్ని వ్యర్థం కాకుండా ఉపయోగించుకొని పదేళ్ళలో వెనుకబడిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మువ్వా పద్మావతికి ప్రముఖుల నివాళి



నవతెలంగాణ-ఖమ్మం

ప్రయివేట్ విద్యా సంస్థల ఛైర్మెన్, ప్రముఖ విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు మాతృమూర్తి మువ్వా పద్మావతి (85) సంస్మరణ కార్యక్రమం బుధవారం హరితా గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రఘురామి రెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, గిడ్డంగుల సంస్థ ఛైర్మెన్ రాయల నాగేశ్వరరావు, సాగునీటి పారుదల కార్పోరేషన్ ఛైర్మెన్ మువ్వా విజయబాబు హాజరై మువ్వా పద్మావతికి నివాళి అర్పించారు. శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులకు తమ సానుభూతి తెలిపారు.

కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎంఎల్సి గోరటి వెంకన్న, సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య, మాజీ ఎం.ఎల్.సి బాలసాని లక్ష్మీనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, తుళ్ళూరి బ్రహ్మయ్య, యువజన నాయకులు చింతనిప్పు కృష్ణ చైతన్య, ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ నాయకులు బాగం హేమంతరావు, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి భోగినేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్య సంఘాల బాధ్యులు గుర్రం కాంతారావు, కాటేపల్లి నవీన్ బాబు, చల్లా శేషగిరి, ఎం.వీరారెడ్డి, పి.రవి మారుత్ సాంబశివరెడ్డి, కేసా.వీరన్న కోటేశ్వరరావు, టివి అప్పారావు, మతిన్, శశిధర్ రెడ్డి, తదితరులు నివాళి అర్పించారు.

మువ్వా పద్మావతికి నివాళి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మల్లెంపాటి వీరభద్రం, వ్యాపార ప్రముఖులు బొమ్మా రాజేశ్వరరావు, మేళ్ళచెరువు వెంకటేశ్వర రావు, కురివెళ్ళ ప్రవీణ్, నాయకులు సాధు రమేష్ రెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పోరేటర్లు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ప్రముఖ వైద్యులు, ప్రముఖ న్యాయవాదులు, కవులు, రచయితలు, యాకూబ్, అట్లూరి.వెంకటరమణ, కపిల రాంకుమార్, రౌతు రవి, కొండపల్లి.పావన్, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుడు మోదుగు గోవిందు మువ్వా పద్మావతి గురించి ఆలపించిన పాటలు హృదయాలను బరువెక్కించాయి.

ట్రేడ్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లుకు శ్రద్ధాంజలి

మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగి అయిన సవరం వెంకటేశ్వర్లు సంస్మరణ కార్యక్రమం బుధవారం ఖమ్మం మంచికంటి హాల్‌లో జరిగింది. ఈ సంస్మరణ సభకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హాజరై నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో సిఐటియు ట్రేడ్ యూనియన్ రంగంలో అనేక పోరాటాలు, ఉద్యమాలను నిర్మించారని గుర్తు చేశారు. ఖమ్మం నగరంలోని రేవతి సెంటర్ 43వ డివిజన్‌లో గతంలో సిపిఎం పార్టీ వరుసగా గెలుపొందటంలో ఎనలేని కృషి చేసి పార్టీ అభివృద్ధి కోసం పాటుపడ్డారని తెలిపారు. వెంకటేశ్వర్లు మృతి పార్టీకి, కుటుంబానికి తీవ్ర నష్టమని వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, ఆర్.ప్రకాష్, నాయకులు సత్యనారాయణ, నెల్లూరి వీరబాబు, సిహెచ్. వీరభద్రం, బీబీ, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ అందించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-మధిర



షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధిర బోడెపుడి భవనంలో మధిర నియోజకవర్గ జోన్ కన్వీనర్ల సమావేశం చింతలచెరువు కోటేశ్వరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల ముందు తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఎన్నికల హామీలను అమలు పరచాలన్నారు.

1జరైతులందరికీ రుణమాఫీ విషయంలో రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలి.
2. రెండు లక్షల పైచిలుకుఉన్న రైతులకు ప్రభుత్వమే రెండు లక్షల మాఫీ చూపించి రెండు లక్షల రూపాయలు రుణమాఫీ డబ్బులు జమచేయాలి.
3. చనిపోయిన రైతుల రుణం రుణమాఫీకి వర్తింపచేయాలి
4. సాంకేతికలోపాల ద్వారా రుణమాఫీ కాని రైతులకు వాటిని సరిచేసి వెంటనే మాఫీ చేయాలి.
5. అధికారులు నాలుగో విడత రుణమాఫీ ని వెంటనే ప్రకటించాలి.
6. అర్హులందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.
7. మహిళలకు 2500 రూపాయలు పథకాన్ని అమలు పరచాలి.
8. రైతు భరోసా 7500 వెంటనే చెల్లించాలి.
9. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలను వెంటనే అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్, మడుపల్లి గోపాలరావు, శీలం నరసింహారావు, దివ్వెల వీరయ్య, ముదిగొండ, మధిర టౌన్ రూరల్ మండల కార్యదర్శి బట్ట పురుషోత్తం, మండవ ఫణీంద్ర కుమారి, మందా సైదులు, ముదిగొండ, చింతకాని, బోనకల్, మధిర టౌన్, రూరల్, ఎర్రుపాలెం జోన్ కన్వీనర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- పీహెచ్‌సీ వైద్యాధికారి అంకం అరుణాదేవి

నవతెలంగాణ-ముదిగొండ



వర్షాకాలం ప్రారంభమైనందున దోమల నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్సి) వైద్యాధికారి అంకం అరుణాదేవి ప్రజలకు సూచించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా, జ్వరాలు రాకుండా దోమల నుండి కాపాడుకునేందుకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తూ, స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ) ఆరోగ్య నియమాలను ఆమె వెల్లడించారు. ఇంటి ఆవరణంలో తులసి మొక్కతోపాటు, లెమన్ గ్రాస్‌ను పెంచుకోవాలన్నారు. ఇంటి గుమ్మాలకు, కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె చెప్పారు. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలన్నారు. దోమతెరలతో పాటు, దోమ నిరోధకాలను వాడాలన్నారు. ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలను తొలగించి, దోమలను లార్వా దశలోనే నిర్మూలించాలన్నారు. డ్రైడే కార్యక్రమాలు నిర్వహించి, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచరాదన్నారు. పూలకుండీలు, టైర్లుతోపాటు ఇంటి ఆవరణం, ఇంటి పరిసరాలలో నీళ్లు లేకుండా చేసి పరిశుభ్రంగా ఉంచుకొని, వ్యక్తిగత శుభ్రతను అలవర్చుకోవాలన్నారు. ఆరోగ్య నియమాలు పాటించి, సీజనల్ వ్యాధులు రాకుండా, దోమల నుండి కాపాడుకోవాలని వైద్యాధికారి అంకం అరుణాదేవి పేర్కొన్నారు.



రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంజేపీ విద్యార్థులు

నవతెలంగాణ-రఘునాథపాలెం రూరల్

బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు రఘునాథపాలెం ఎంజేపీ గురుకుల పాఠశాల ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ఆగస్టు 25, 26 తేదీల్లో మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతున్నారు. విద్యార్థులను ఆర్‌సీవో అంజలి, ప్రధానోపాధ్యాయులు సంజీవ రావు, ఏటీపీ లివిన్, పిఈటి కృష్ణ, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

డీఎంకే శ్రీనివాస రావుకు ఉత్తమ సేవా పురస్కారం

మధిర : జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ చేతులు మీదగా బుధవారం ఉత్తమ వ్యవసాయ అధికారి అవార్డు మధిర మండల వ్యవసాయ అధికారి డీఎస్‌కే శ్రీనివాసరావు అందుకున్నారు. ఈ సందర్భంగా మధిర డివిజన్ ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏవోలు, ఏఈఓలు శుభాకాంక్షలు తెలియజేసారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-కామేపల్లి

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగస్తుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగస్తుల సంఘం టీఎస్‌పిఈయు 1535 యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ సీఎండి వరుణ్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో అనేక సంవత్సరాలుగా పనిచేసిన ఉద్యోగులకు ప్రమోషన్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధ్యక్షులు, కార్యదర్శి ముడిక. శ్రీనివాస్, బీ.వీ.ఎస్.మూర్తి, బి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో సర్వే

నవతెలంగాణ ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం 3 టౌన్ పరిధిలో శ్రీనివాస్ నగర్, ముస్తాఫానగర్ తదితర ప్రాంతాల్లో ఐద్వా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మైక్రో ఫైనాన్స్ సంస్థలలో వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకున్న రుణాలు వాటి వల్ల మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మెహర్ ఉన్నిసా బేగం, కార్యదర్శి భాగం అజిత, మాధవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీల్లో 3వ తరగతి వరకు సమంజసం కాదు

- టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-చింతకాని

అంగన్ వాడీలను ప్లేస్కూల్స్‌గా మార్చి 3వ తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైంది కాదని, విరమించుకోవాలని టీఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. అంగన్ వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించటం లేదని కనుక 1,2,3 తరగతులను అంగన్ వాడీలకు అప్పగించటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడుతుందని టిఎస్ యుటిఎఫ్ అభిప్రాయపడుతున్నది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో తరగతికొక టీచరు, సబ్జెక్టుకొక టీచరు, ప్రధానోపాధ్యాయులు, తగినంత బోధనేతర సిబ్బంది పాఠశాలలో ఉండేలా చూడాలన్నారు. సంవత్సరంన్నర కాలంగా ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం కొదుమూరు, వందనం, రాఘవాపురం, చింతకాని, లచ్చగూడెం, నరసింహపురం, నేరడ, పొద్దుటూరు తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ ప్రారంభించి, ఆయా పాఠశాలల్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోటకూరి శ్రీనివాసరావు, ఉదారపు నాగేశ్వరరావు, ప్రీతం, వాసు, మహేశ్వర్, సురేష్, కృష్ణ, బిక్షం తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన పోలీస్ అధికారులను సీపీ అభినందనలు



నవతెలంగాణ-ఖమ్మం

పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్(ఏఎస్సై)గా భాధ్యతలు నిర్వహిస్తూ పలువురు పదోన్నతి పొందారు. ఎస్సైలుగా పదోన్నతి పొందిన వీ.చంద్రశేఖర్‌రావు, టీ. పుల్లరావు, కే.నగేందర్‌రావుతో పాటు హెడ్ కానిస్టేబుల్‌గా భాధ్యతలు నిర్వహిస్తూ ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన బీ.భస్వనారయణ, టీ. సూర్యచంద్రరావులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

మూగజీవాల ప్రాణాలు హరిస్తున్న 'ప్లాస్టిక్'

నవతెలంగాణ-పెనుబల్లి



మండలంలో లంకాసాగర్ క్రాస్‌రోడ్డు సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థలు తిని పశువులు మత్యువాతపడుతున్నాయి. ఇండ్రస్ట్రీ పేరుతో వాటార్ ట్యూబుల తయారీకి పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ వాడాల్సి ఉంది. భారీ ఎత్తున్న ప్లాస్టిక్‌ను సేకరించి ఫ్యాక్టరీ ఆరుబయట నిల్వ ఉంచుతారు. దీంతో మేతకు వచ్చిన ఆవులు ప్లాస్టిక్ వస్తువులను తిని అనారోగ్యం పాలౌతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టు ప్రహరీ నిర్మించుకొని అందులో ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపర్చుకోవాల్సి ఉన్నప్పటికీ ప్లాస్టిక్ ఇండ్రస్ట్రీ యాజమాని మాత్రం పోలాల మార్గంలో ప్లాస్టిక్ వస్తువులు ఉంచటంతో ఆవులు అవి తిని మత్యువాత పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, ప్లాస్టిక్ ఇండ్రస్ట్రీ యాజమాని పై చర్యలు తీసుకోవాలని రైతులు కొరుతున్నారు. అయితే ఈ ఇండ్రస్ట్రీని మారుములన నడపుతుండటంతో అసలు ఈ కంపెనికి పర్మిషన్‌లు ఉన్నాయా లేవా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

రామదాసు చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నేలకొండపల్లి

శ్రీరాముని అపర భక్తగ్రేశ్వరుడు భక్త రామదాసు చరిత్రను యావత్ ప్రపంచానికి చాటి చెప్పాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని భక్త రామదాసు ధ్యాన మందిరం ఆవరణములో మూడు కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన భక్త రామదాసు ఆడిటోరియాన్ని ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాంరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యాన మందిరంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ భక్త రామదాసు ఆడిటోరియాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆడిటోరియంలోకి అడుగుపెట్టగానే మానసిక ప్రశాంతతతో పాటు భక్త రామదాసు జీవిత చరిత్ర కళ్ళముందే సాక్షాత్కరిస్తున్న అనుభూతి కలుగుతుందన్నారు. రామదాసు చరిత్రను దృశ్యమాలిక ద్వారా కళ్ళకు కట్టినట్లుగా చిత్రీకరించడం అభినందనీయమన్నారు. ఇటీవల దక్షిణ భారతదేశంలోనే మూడవ అతిపెద్దదైన బౌద్ధ క్షేత్రం నేలకొండపల్లి పట్టణంలో ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. చారిత్రాత్మకమైన ప్రదేశాలతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా





ఉన్న భక్త రామదాసు ధ్యాన మందిరం వంటి ప్రసిద్ధ క్షేత్రాలు ఉండడం నేలకొండపల్లి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రానున్న కాలంలో నేలకొండపల్లి ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించునున్నట్లు మంత్రి తెలిపారు. తద్వారా దేశ విదేశాల నుండి వేలాది మది పర్యాటకులు, భక్తులు ఈ ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. నేలకొండపల్లి ప్రాంతాన్ని టూరిజం ప్లేస్‌గా అభివృద్ధి చేసి రామదాసు జీవిత చరిత్రను బౌద్ధ స్తూపం ప్రాసస్త్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే తమ లక్ష్యమన్నారు. రాములోరి కోసం భక్త రామదాసు ఎన్ని ఇబ్బందులు పడ్డారో గత బిఆర్ఎస్ పాలనలో ప్రజలు అంతకంతకు కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మార్పు రావాలనే ఉద్దేశంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి జై కొట్టి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఇందిరమ్మ రాజ్యం పేదోళ్ల కలలు సాకారం చేసేందుకు ముందుకు సాగుతుందన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని ఇందిరమ్మ రాజ్యం ద్వారా నిలబెట్టుకుంటుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. అనంతరం మండలంలోని చెరువుమాదారం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మంత్రి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల కార్పొరేషన్ చైర్మెన్ మువ్వా విజయ్ బాబు, ఆర్డీఓ జీ.గణేష్, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో ఎం. ఎర్రయ్య ఐకేపీ ఎంపీఎం అశోకరాణి, ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, ఎస్ఎస్పీడీఈ ఎస్.మన్మధరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణకుమారి, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, వేగినాటి లక్ష్మీనరసయ్య, రాయపూడి నవీన్, బొడ్డు బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-కొణిజర్ల/ఏన్కూరు

రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు చేసేటప్పుడు లేని నిబంధనలు రుణమాఫీలో విధించడం వల్ల 70 శాతం రైతులకు రుణమాఫీ పోందలేని పరిస్థితి ఏర్పడిందని ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతు కు రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏన్కూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించి వ్యవసాయ అధికారి నరసింహారావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రైతు రుణమాఫీ ఖమ్మం జిల్లాలో 30 శాతం రైతులకు మాత్రమే ఇప్పటి వరకు జరిగిందని, మూడు లక్షల డెబ్బై ఒక వేల మంది రైతులు అర్హులు జాబితాలో ఉంటే కేవలం 1 లక్ష 15 వేల మంది రైతులకు మూడు విడతల్లో కలిపి రుణమాఫీ జరిగిందని తెలిపారు. మిగితా రెండు లక్షల ఏభై ఆరు వేల మంది రైతులు చేతుల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు పాస్ పుస్తకాలు తీసుకుని వ్యవసాయ శాఖ కార్యాలయాలు, రైతు వేదికలు, బ్యాంకులు చుట్టూ డెంగీ, చికెన్ గున్యా, వైరల్ ఇన్ఫెక్షన్ జ్వరాలుతో నడవలేని స్థితిలో తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ శాఖ 31 రకాల సాంకేతిక సమస్యలు పరిష్కారం చేసి బ్యాంకులో అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పహణీనకల మీ పహణీ ద్వారా బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాణోత్ బాలాజీ, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దోంతిబోయిన నాగేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు తమ్మినేని వెంకటయ్య, కార్యదర్శి గుండా సత్యనారాయణరెడ్డి, రేపల్లెవాడ మాజీ ఎంపీటీసీ లక్ష్మా, రైతు సంఘం నాయకులు రేగళ్ళ తిరుమలరావు, స్వర్ణ కృష్ణారావు, ఇటికాల లెనిన్, రాయమాధరం మాజీ సర్పంచ్ బిక్షం, జన్నారం మాజీ సర్పంచ్ దుద్యా, నామా కృష్ణారావు, మన్నేపల్లి మోహన్‌రావు, నేలపట్ల బాబు, మధు, సీతారామయ్య, చంద్రయ్య రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఉన్న అనుమానాలను తొలగించండి

- రైతులకు పూర్తి సమాచారాన్ని తెలియజేయండి
- ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



రుణమాఫీపై రైతుల మనసుల్లో చోటుచేసుకున్న అపోహలను తొలగిస్తూ వారికి సరైన సమాచారాలను అందించి వారి అనుమానాలను నివృత్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఐదు మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లతో ఎమ్మెల్యే రుణమాఫీ-ధరణి అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షకు ముందు నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల రుణమాఫీ వివరాలు, మూడు విడతల్లో లబ్దిదారుల ఖాతాల్లో పడిన నగదు వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు ఉద్యోగుల నుంచి రుణమాఫీ జరిగిన రైతుల వివరాలను తెలుసుకొని పూర్తి సమాచారాన్ని రైతులకు అందించాలని ఎమ్మెల్యే వ్యవసాయశాఖ అధికారులను కోరారు. ధరణి పోర్టల్ సమాచారం, భూ సమస్యలను తహసీల్దార్లను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మెన్లు దోమ ఆనంద్, బాగం నీరజా ప్రభాకర్, వైస్ చైర్మెన్లు వెంకటప్పారెడ్డి, రాజిబోయిన కోటేశ్వరరావు, ఐదు మండలాల వ్యవసాయశాఖ అధికారులు శ్రీనివాసరావు, రామ్మోహనరావు, ప్రసాదరాజు, రూప, తాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నవతెలంగాణ-వైరా

గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీకి చెందిన నిరుపేద తిరుపతిరావుకు కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.5వేలను డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యామ్‌బాబు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ జీవనోపాధి లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నందున సహాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీ కో ఆర్డినేటర్ ఉండ్రు శ్యామ్ బాబు, డిజేఎస్ లగడపాటి ప్రభాకరరావు, జోన్ కన్వీనర్ ఉండ్రు వరలక్ష్మి, సెక్రటరీ జాలా పుల్లారావు, జాలా మహాలక్ష్మి సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సువిధ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చేయూత

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని పల్లిపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు నలభై వేల రూపాయల విలువైన బ్యాగులు, వాటర్ బాటిల్స్, టై బెల్ట్‌లను బుధవారం సువిధ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సంస్థ నిర్వాహకులు అమరనేని మన్మథరావు, న్యాయవాది వీ.రవికుమార్, రిటైర్ ప్రిన్సిపాల్ వీ.వెంకటేశ్వరరావులు బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చదువు అనే ఆయుధంతో ఉన్నతమైన భవిష్యత్ అందుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సుజాత అధ్యక్షతన వహించగా మార్గదర్శులుగా బయాలజీ, ఉపాధ్యాయురాలు కుతుంబాక భార్గవి, వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఎంవిఎల్ సునీత, ఎస్టీ గుల్జార్ బేగం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిలబడేది సీఐటీయూ మాత్రమే..

- సంఘం ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరంలో వందల సంఖ్యలో సీఐటీయూకు అనుబంధంగా వందల సంఖ్యలో రంగాలు వారిగా వివిధ సంఘాలు ఉన్నాయని, ప్రతి సందర్భంలోనూ కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా భావించి నిజాయితీగా కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పోరాటాలు నిర్వహించేది కేవలం సీఐటీయూ మాత్రమే అని సంఘం ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబు స్పష్టం చేశారు. ఖమ్మం బైపాస్ రోడ్ పెద్ద కూరగాయల మార్కెట్‌లోని హమాలీలు పెద్ద సంఖ్యలో బుధవారం ప్రముఖ ట్రేడ్ యూనియన్ సీఐటీయూ సంఘంలో చేరారు. అనంతరం మార్కెట్‌లో కార్మికుల విశ్రాంతి హల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం బైపాస్ కూరగాయల మార్కెట్ లో వారు పడుతున్న కష్టాలకు అనుగుణంగా సరియైన వేతనం హమాలీలకు వచ్చే విధంగా తగిన పోరాటం చేస్తామన్నారు. దేశంలోని ప్రతి కార్మికుడుకు నెలకు కనీస వేతనం 25 వేలు వచ్చే విధంగా రాబోయే కాలంలో కార్మిక సంఘాలను కలుపుకుని పోరాటాలు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వంలో సగటు కార్మికుడు కష్టాలు పడుతున్నారని, వారి ఇబ్బందులు తొలగి పోవాలంటే బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా మార్కెట్ నాయకులు రమేష్ , శ్రీను ఆధ్వర్యంలో పలువురు హామాలీలు సీఐటీయూలో చేరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, భుక్యా శ్రీనివాసరావు, బండారు యాకయ్య, బోడపట్ల సుదర్శన్, తిరుమలరావు, భుక్యా ఉపేంద్ర నాయక్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-ముదిగొండ



బ్యాంకుల్లో పంట రుణాలు ఉన్న ప్రతి రైతుకు షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపచేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-ముదిగొండ

రుణమాఫీ కాని రైతులకు మరోసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ముదిగొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించినట్లు రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి కందుల భాస్కర్‌రావు, కోలేటి ఉపేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాలకతీతంగా జరిగే ఈ ధర్నాలో రైతులందరూ అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తల్లాడ : ఈనెల 22న (గురువారం) ఉదయం 11 గంటలకు, మండల కేంద్రంలోని బ్యాంకుల వద్ద రుణమాఫీ చేయాలని నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. రుణమాఫీ కానీ రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

పలు కుటుంబాలకు మట్టా పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

మండలంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మెన్ భాగం నీరజాదేవి పలు కుటుంబాలను పరామర్శించారు. లింగాల గ్రామంలో దేవరపల్లి వెంకటేశ్వరరావు, చావ మధులను వారి గృహంలలో కలుసుకొని ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రావికంపాడు గ్రామంలో రెడ్డిచర్ల సుబ్బరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. యటా నరసయ్య ఇటీవల మృతి చెందగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం ప్రభాకర్‌చౌదరి, ఏనుగు సత్యంబాబు, మట్టా రామకృష్ణ, ఆలకుంట నరసింహారావు, కేవీ, పసుమర్తి మోహన్‌రావు, తాళ్ల వెంకటేశ్వర్లు, శివకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండలో ముత్యాలమ్మ బోనాలు

ముదిగొండ : మండల కేంద్రంలో స్థానిక గ్రామ పంచాయితీ సమీపాన ఉన్న అంబేద్కర్ నగర్ వాసులు బుధవారం ముత్యాలమ్మ బోనాలు జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలెత్తుకొని ముత్యాలమ్మ దేవాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి మొక్కులు సమర్పించారు.

ప్రమాదకరంగా ఫ్లై-ఓవర్‌పై గొయ్యి

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి శివారులోని ఫ్లై-ఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. నాసిరకంగా నిర్మాణం జరగడం వల్లే ఈ గొయ్యి ఏర్పడిందని దానిని చూసిన వారికెవరికైనా ఇట్టే అర్థమవుతుంది. బ్రిడ్జి స్లాబులో ఉన్న ఇనుప చువ్వలు ఎక్కడికక్కడే విరిగిపోయి ఒకపక్క దాదాపుగా రోడ్డంతా గొయ్యిగా ఏర్పడింది. దీంతో అశ్వారావుపేట వైపు నుంచి వచ్చే వాహనాలకు తీవ్ర అవరోధం కలుగుతోంది. పగటి వేళల్లో అయితే గొయ్యి కనపడే అవకాశం ఉండటం వల్ల దగ్గరి రాగానే వాహన వేగాన్ని పూర్తిగా తగ్గించి దాటుతున్నారు. అదే రాత్రి వేళల్లో అయితే వేగంగా వచ్చే వాహనాలకు గొయ్యి దాదాపుగా కనపడే అవకాశాలు తక్కువగా ఉంటుంది. దీంతో ప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదే మాదిరిగా తమ్మిలేరు బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి కారణంగా ఓ లారీ ముందు టైర్లు గోతిలో పడి అమాంతం ఎగిరి వాగులో పడిన ఉదంతం గత మూడు నెలల కిందట జరిగిన విషయం తెలిసిందే. అంతకన్నా భారీగా ఫ్లై-ఓవర్‌పై ఏర్పడిన గొయ్యి ఎలాంటి ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే ఫ్లై-ఓవర్‌పై ఏర్పడిన గొయ్యిని పూడ్చాలని వాహనదారులు రహదారుల శాఖ అధికారులను కోరుతున్నారు.

నేలకొండపల్లి నేషనల్ హైవేపై ఎగ్జిట్ ఎంట్రీ ఇవ్వాలి

- మంత్రి పొంగులేటికి సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-నేలకొండపల్లి

నేలకొండపల్లిలోని నేషనల్ హైవేపై నేలకొండపల్లి మండల ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం తక్షణమే ఎగ్జిట్, ఎంట్రీ ఏర్పాటు చేయాలని బుధవారం రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భక్త రామదాసు ఆడిటోరియం ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ నేలకొండపల్లి వద్ద నేషనల్ హైవేపై ఎగ్జిట్ ఎంట్రీ లేకపోవడంతో నేలకొండపల్లి మండల ప్రజలతోపాటు, దేశ విదేశాల నుండి ఇక్కడికి వచ్చే భక్తులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారని, రైతురుణమాఫీ సమస్యలను, మండలంలో నెలకొన్న తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మండల గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించి రైతులను ఆదుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ మండల కార్యదర్శి కేవీ.రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, రాసాల కనకయ్య, బెల్లం లక్ష్మి మారుతి కొండలరావు, దుగ్గి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జ్వర పీడిత గ్రామాలలో వైద్య శిబిరాలు

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని ముష్టికుంట్ల, కలకోట, మోటమర్రి గ్రామాల్లో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను బుధవారం నిర్వహించారు. ఈ గ్రామాలలో జ్వరాలు అధికంగా ఉండటంతో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు మండల ప్రాథమిక వైద్యాధికారిని వేముల స్రవంతి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారు అందరికీ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలను ఎమ్మెల్ హెచ్‌పీ సింధు వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు కూడ ఇంటి చుట్టూరా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎవరి ఇళ్లల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వారంలో రెండుసార్లు మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలందరూ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ దంపతులకు సన్మానం



నవతెలంగాణ-కొణిజర్ల

ఈనెల ఏడోవ తేదీన ఎంపీటీసీల పదవి బాధ్యతలు ముగియడంతో మండల పరిధిలోని అమ్మపాలెం ఎంపీటీసీ బాణోత్ అనూష క్రిష్ణ దంపతులను ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ తన నివాసంలో బుధవారం శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మపాలెం ఎంపీటీసీ అనూష గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిందని కొనియాడారు. పదవికి చెడ్డపేరు తీసుకురాకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నిజాయితీ నిబద్ధతతో ఐదు సంవత్సరాలు సేవచేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పగడాల మంజుల, కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



పొలిశెట్టి గిరి ఆధ్వర్యంలో...

ఇండోఖతర్ ఎండీ ప్రముఖ రియల్టర్ పొలీశెట్టి గిరి ఆధ్వర్యంలో అమ్మపాలెం ఎంపీటీసీ దంపతులు బాణోత్ అనూష క్రిష్ణలను ఘనంగా ఇండోఖతర్‌లో శాలువతో సన్మానించారు. అదేవిధంగా వెంకటేశ్వర గార్డెన్స్ మార్కెటింగ్, మేనేజింగ్ డైరెక్టర్ అడపాల సంపత్ కుమార్ ఎంపీటీసీ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

పది రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్


- మంచినీళ్ల కోసం అల్లాడుతున్న ప్రజలు

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామానికి 10 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్ అయ్యాయని తాజా మాజీ ఎంపీటీసీ పారా శ్రీదేవి తెలిపారు. ఒకవైపు అపరిశుభ్రత వలన జ్వరాలు పెద్ద ఎత్తున రోజురోజుకి విస్తరిస్తుండగా మరొకవైపు మంచినీళ్ల లేక గ్రామస్తుల అవస్థలు పడుతున్నారని తెలిపారు. పది రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావటం లేదని ఎవరికి చెప్పిన పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి సమస్యతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరి మీద ఒకరు చెప్పుకోవటం తప్ప మంచినీటి సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీళ్ళని వెంటనే సరఫరా చేసి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

నవతెలంగాణ-ఖమ్మం



వారం రోజుల క్రితం ఖమ్మం రైల్వే పోలీస్ పరిధిలోని బోనకల్లు, మోటమర్రి స్టేషన్ల మధ్యలో సుమారు 35 సంవత్సరాల గల మగ వ్యక్తి రైలు నుండి జారిపడి రైలు కట్ట కింద చెట్ల పొదల్లో పడి చనిపోయి పురుగులు పట్టి ఉన్నాడని, మృతదేహాన్ని రైల్వే పోలీసు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఇప్పటి వరకి మృతదేహం కోసం ఎవరూ రానందున అనాధ శవంగా భావించిన రైల్వే పోలీస్ వారు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి అంత్యక్రియల నిమిత్తం అన్నం ఫౌండేషన్‌కి సమాచారం ఇవ్వగా అన్నం ఫౌండేషన్ మార్చురికి చేరుకొని మృతదేహాన్ని రైల్వే పోలీస్, వైద్యశాల సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఖమ్మం నగరంలోని వైకుంఠధామానికి తరలించి దహన సంస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మెన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్ఫార్మర్ నెపంతో దళిత మహిళను హతమార్చడం హేయమైన చర్య

• ఎస్పీ రోహిత్ రాజు



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన చెన్నాపురం గ్రామ శివారులో ఒక మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించినట్టు ఎస్పీ రోహిత్ రాజు ప్రకటనలో తెలిపారు. బంటి రాధా అలియాస్ నీల్సు (25) మహిళను మావోయిస్టులు అతికిరాతకంగా చంపి అక్కడ పడివేసిన తీరును ఎస్పీ తీవ్రంగా ఖండిచారు. ఇన్ఫార్మర్ నెపంతో ఒక దళిత మహిళను హతమార్చడం హేయమైన చర్య అన్నారు. మృతురాలి గురించి వివరాలు సేకరించగా హైదరాబాద్ వాస్తవ్యురాలైన రాధ ఇంటర్మీడియట్ (డిఎంఎల్‌టి) చదివి 2018లో మావోయిస్టు పార్టీలో చేరిందని, ఈమె ఏటబిలో నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీలో ఏరియా కమిటీ మెంబర్‌గా పని చేస్తున్నదని తేలిందని చెప్పారు. మావోయిస్టు పార్టీ నాయకుల వేధింపులు తట్టుకోలేక పార్టీని విడిచి పెట్టి, జనజీవన స్రవంతిలో కలవాలనుకున్న బంటి రాధా అలియాస్ నీల్సును పోలీసులకు సమాచారం అందిస్తున్నదనే నెపంతో అతి కిరాతకంగా చంపడం హేయమైన చర్య అన్నారు. ఈ విషయంలో చర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు వివరించారు.

రుణ మాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

• జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-కొత్తగూడెం

రుణ మాఫీ కాని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బాబురావు తెలిపారు. చుంచుపల్లి మండలంలోని రుణమాఫీ కానీ రైతులు వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పట్టా లేనివారు పహాని, పట్టాదారు పాస్ పుస్తకం, చనిపోయిన వారు ఉంటే వారి డెత్ సర్టిఫికెట్, బ్యాంకు స్టేట్మెంట్‌తో దరఖాస్తు ఫామ్ తీసుకొని ప్రశాంత్ నగర్ రైతు వేదిక నందు వారం రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ అర్హత తేదీ 12 డిసెంబర్ 2018 నుండి 9 డిసెంబర్ 2023 వరకు తీసుకున్న లోన్లు మాత్రమేనని గుర్తుచేశారు.

చైతన్యవంతమైన పోరాటాలతోనే మెరుగైన ఫలితాలు

• సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా



నవతెలంగాణ-కొత్తగూడెం

కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు చైతన్యవంతమైన పోరాటాలు నిర్వహిస్తేనే మెరుగైన ఫలితాలు లభిస్తాయని, నాయకులకు, కార్యకర్తలకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. బాబు క్యాంపు ఏరియాలోని సీపీఐ కార్యాలయం 'రజబ్ అలి భవన్'లో బుధవారం జరిగిన కొత్తగూడెం పట్టణ స్థాయి కౌన్సిల్ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు, ముఖ్యనాయకుల సమావేశంలో పాష మాట్లాడారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో కొత్తగూడెం పట్టణంతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయన్నారు. కందుల భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, లింగయ్య, రమణమూర్తి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్‌కి ఆత్మీయ సత్కారం, వీడ్కోలు సభ



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఆరేండ్ల పాటు పనిచేసి అడ్మినిస్ట్రేటివ్ ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా గోదావరిఖనికి బదిలీపై వెళుతున్న షబ్బీరుద్దీన్, షబానా దంపతులను మురళి మ్యాన్ పవర్ ఏజెన్సీ (ఎంఎంఏ) ప్రయివేట్ సెక్యూరిటీ గార్డుల ఆధ్వర్యంలో బుధవారం పాత సెక్యూరిటీ కార్యాలయంలో ఆత్మీయ సత్కారం, వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.బీ.సీ రిలేలు, సూపర్వైజర్ల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఏరియా ఎస్‌ఓటు జీఎం డి.శ్యాంసుందర్ పాల్గొన్నారు. మణుగూరు ఏరియాలో పనిచేసిన 14 సంవత్సరాల పాటు సర్వీసులో మైనింగ్ అధికారిగా పనిలో అంకితభావం, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా కంపెనీ ఆస్తులను కాపాడే విభాగానికి టీం లీడర్‌గా అందరి మన్ననలు పొందారన్నారు.

సన్మాన గ్రహీత షబ్బీరుద్దీన్ మాట్లాడుతూ కంపెనీ ఆస్తులను కాపాడటంలో ఎక్కడ రాజీ పడవద్దని తనకిచ్చిన సహకారాన్ని నూతన పదవి బాధ్యతలు చేపట్టే సెక్యూరిటీ అధికారికి కూడా ఇవ్వాలని ఆయన కోరారు. ఏరియా ఎస్‌ఓటు జీఎం డి.శ్యాంసుందర్, రబ్బాని, ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులు పుష్పగుచ్ఛం శాలువాతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వాస్ యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు సామాజిక కార్యకర్త యస్‌డీ నాసర్ పాషా, ఏ.మంగీలాల్, జమేదార్లు షేక్ అక్బర్, టీ.రాములు, షబ్బీరుద్దీన్ కుమారుడు ఈషాన్, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్యశిబిరం

• పాల్గొన్న జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మహేష్ గౌడ్

నవతెలంగాణ-అశ్వారావుపేట



దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నప్పటికీ ప్రశాంత జీవనంతో వృద్ధాప్యాన్ని జయించవచ్చుని జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మహేష్ గౌడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ హోమియో డిస్పెన్సర్ ఆధ్వర్యంలో ఆయుష్ వైద్యాధికారి (మెడికల్ ఆఫీసర్) డాక్టర్ దీపికా నంద్యాల పర్యవేక్షణలో బుధవారం ప్రత్యేక వృద్ధులు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ మహేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతీ వారం నిర్వహించే వైద్య శిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధిక సంఖ్యలో హాజరైన వృద్ధులను పరీక్షించిన డాక్టర్ దీపిక నంద్యాల కీళ్ళ నొప్పులు, మధుమేహం (సుగర్), అధిక రక్తపోటుతో బాధపడుతున్న వారికి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టులు జి.జ్యోతి, బి.విజయ్ కుమార్, ఎస్సీ ఎస్.వి.దిద్దుబాబులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు

• సోమవారం నుండి తరగతులు ప్రారంభం
• కళాశాలను సందర్శించిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఎట్టకేలకు నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసారు. సోమవారం నుండి బోధనా ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందు కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మొదటి అంతస్తులో రెండు గదులను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అల్లు అనిత కేటాయించారు. నూతనంగా ఏర్పాటు చేసిన అశ్వారావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్నత విద్యామండలి నియమించారు. ఆయన బుధవారం అశ్వారావుపేట చేరుకుని కళాశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక పీఎం హెచ్ (జి) హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.ద్వారకను కలిసి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కోరారు. ఈ సందర్భనలో జేవీఆర్ కళాశాల అధ్యాపకులు ఎస్.కే ఫిర్ సాహిబ్, చెన్నారావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

రైలును పునరుద్ధరించాలి



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరులో గతంలో నడిచిన రైలులను పునరుద్ధరించాలని మహబూబాద్ ఎంపీ బలరాం నాయక్, మాజీ కేంద్రం మంత్రిని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ మాజీ ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ బుధవారం మణుగూరులో కలిశారు. పినపాక, భద్రాచలం నియోజకవర్గం ప్రజలు రైలు సౌకర్యాలు సరిగా లేక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతంలో తమరు మంత్రిగా ఉన్నప్పుడు మణుగూరు నుంచి వివిధ ఏరియాలకు ట్రైన్ సౌకర్యం కల్పించారు, కానీ ఇప్పుడు అవి మొత్తం రద్దయి, కేవలం రాత్రి 9:45 గంటలకు హైదరాబాద్ వరకే రైలు ఉన్నదని తెలిపారు. రద్దయిన ట్రైన్లు అన్నీ పునరుద్ధంప చేయాలన్నారు. అలాగే సింగరేణి కంపెనీలో పనిచేస్తున్న సుమారు 33 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని జీతంతో జీవితాలు గడుపుతున్నారన్నారు. వారి సమస్యలను తీర్చాలన్నారు.



సీనియర్ సిటిజన్స్ శేష జీవితాన్ని ఆహ్లాదంగ గడపాలి

• జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి

నవతెలంగాణ-కొత్తగూడెం

సీనియర్ సిటిజన్స్ వారి శేష జీవితాన్ని ఆహ్లాదకరంగ గడపాలని, అందుకు ఒంటరితనాన్ని జయించాలని తద్వారా మానసికంగ దృఢంగ ఉంటారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి అన్నారు. బుధవారం ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా రామ్‌నగర్‌లోని పెన్షనర్ భవన్‌లో ఏర్పాటు చేసిన న్యాయ చైతన్య కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొన్నారు. "వృద్ధాప్యం శాపం కాదని" తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తం రావు, పెన్షనర్స్ భవన్, చుంచుపల్లి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాపన్న, సురేష్, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు, అసిస్టెంట్ కౌన్సిల్స్ జ్యోతి, విశ్వకర్మ నాగ స్రవంతి, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కావలసిన జ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులే

• ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్

నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యార్థులకు కావలసిన జ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులే నని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. జిల్లాలో ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో నిర్వహించనున్న రెండు రోజుల శిక్షణా తరగతులను కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులకు కావలసిన జ్ఞానాన్ని అందించవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తయారుచేసి వారికి మంచి భవిష్యత్తును



అందించడంలో ఉపాధ్యాయులకు కీలక పాత్ర పోషిస్తారన్నారు. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలుపరచడం ద్వారా మంచి విద్యార్థులను భవిష్యత్తు తరాలని తయారు చేయాలని, కేవలం ఈ శిక్షణలోనే కాకుండా సీనియర్ ఉపాధ్యాయుల నుండి నిరంతరం విషయాలను తెలుసుకొని నాణ్యమైన బోధన అందించాలని సూచించారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి : డీఈఓ

జిల్లాలో 680 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పదోన్నతి పొందారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర చారి తెలిపారు. మొదటి విడతలో 130 మంది ఇంగ్లీష్, ఫిజిక్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి శిక్షణా సమన్వయకర్తగా జిల్లా ఆకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగ రాజశేఖర్ వ్యవహరించగా, జిల్లాలో పై సబ్జెక్టులలో పదోన్నతి పొందిన 130 మంది ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, 15 మంది డిఆర్పీలు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ సిబ్బంది పోస్టులు మంజూరీ ఎప్పుడు?

• భవన సముదాయం నిర్మాణం ఎక్కడ?

నవతెలంగాణ-అశ్వారావుపేట

సాధారణంగా నివాసం మో లేక వ్యాపారం మో ప్రారంభించాలని అనుకున్నప్పుడు అనువైన ప్రదేశం తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకుంటాం. ఇది ప్రకృతి నియమం, సామాజిక వ్యవహారం. ఏదైనా ఒక వ్యాపార సంస్థ దాని ఉనికి ప్రారంభించడానికి ముందే అనువైన స్థలం, వసతి సమకూర్చు కుంటుంది. ఉదాహరణ ఒక ప్రయివేట్ పాఠశాల స్థాపించాలి అంటే అనుకూలం అయిన వీధి, ఏదో చిన్న గది ఏర్పాటు చేసుకుని, అందులో పనులు పర్యవేక్షణకు ముందుగా సిబ్బందిని నియమించుకుని దాని కార్యకలాపాలు ప్రారంభిస్తారు. కానీ మన పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం మాత్రం ఈ నియమాలకు పూర్తి విరుద్ధం.

కాలేజీ మంజూరు చేస్తే పోస్టులు ఇవ్వరు. కాలేజీ, పోస్టులు మంజూరి చేస్తే భవన సముదాయం నిర్మించరు. ఇవి మూడు కల్పిస్తే సౌకర్యాలు ఇవ్వరు. కానీ ప్రకటనలు మాత్రం గుప్పిస్తారు.

ఇక విషయంలోకి వస్తే....నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ఉన్నత విద్య అందుబాటులోకి తేవడం కోసం గతంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక విద్యార్థి ఉద్యమాలు, శాసన సభ్యులుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పలు ప్రయత్నాలు చేసారు. ఈ కార్యాచరణ ఫలితంగా అశ్వారావుపేట రెండో ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అశ్వారావుపేటలో డిగ్రీ కళాశాల కావాలని నాటి ప్రభుత్వంలో ఉన్నత విద్యామండలికి దరఖాస్తు చేసారు.



అనంతరం మూడో ఎమ్మెల్యేగా పనిచేసిన, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రయత్నం ఫలితంగా 2023-2024 విద్యాసంవత్సరంలో మంజూరు అయినప్పటికీ ఈ కళాశాల ఏర్పాటు జీవో వచ్చే నాటికే ఆ ఏడాది అడ్మిషన్‌లు గడువు ముగిసింది. అయితే కళాశాల మంజూరు అయినా తరగతులు ప్రారంభం కాకపోవడంతో గత విద్యా సంవత్సరం ఒకటి ఈ కళాశాల చరిత్రలో వృధా అయింది. ఈ ఏడాది 2024-2025 విద్యాసంవత్సరంకు గాను ఆన్లైన్ అడ్మిషన్‌లలో మొత్తం 12 మంది అప్లికేషన్ చేసుకోగా వారందరికీ ఉన్నత విద్యామండలి ఈ కళాశాలలో సీట్‌లు కేటాయించింది. ఈ కళాశాలలో నాలుగు గ్రూపుల్లో విద్యను అందిస్తుంది. అయితే బీఏ గ్రూపుకు 10, బీకాం గ్రూపుకు ఇద్దరు చొప్పున అడ్మిషన్‌లు పొందారు. కానీ వీరికి విద్యా బోధనకు లెక్చరర్ పోస్టులు గానీ, కళాశాల నిర్వహణకు పరిపాలనా పరం అయిన సిబ్బంది పోస్టులను అంటే (క్యాడర్ స్ట్రెంగ్) ఉన్నత విద్యామండలి మంజూరు చేయలేదు. అయితే కాగితంలో జీవోగా ఉన్న, రూపం లేని ఈ కళాశాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపిని నియమించారు. ఇప్పటికైనా బోధనా, బోధనేతర సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను, రెవెన్యూ, గృహ, ఐ అండ్ పీఆర్ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇదే నియోజక వర్గం వాసి, రాష్ట్ర వ్యవసాయ, జౌళి, కో - ఆపరేటివ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణలను కోరుతున్నారు.



చదువును మళ్లీ కొనసాగిద్దాం

• ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణలో మున్సిపల్ చైర్మెన్ డీవీ

నవతెలంగాణ-ఇల్లందు

చదువుతోనే గౌరవమని, బంగారు భవితను పొందడానికి చదువును మళ్ళీ కొనసాగిద్దామని మున్సిపల్ చైర్మెన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. కొత్త బస్టాండ్ సమీపంలోని జవహర్ హైస్కూల్లో బుధవారం ఓపెన్ స్కూల్ అడ్మిషన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మధ్యలో చదువు ఆగిపోయిన వారికి మంచి అవకాశమని దీనిని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. ఎ1 కోఆర్డినేటర్ కె.వెంకట స్వామి మాట్లాడుతూ అనివార్య కారణాలవల్ల చదువు ఆగిపోయినవారు, 10 తరగతి ఫెయిల్ అయిన వారు, 10 పాస్ అయి ఉండి ఇంటర్ ఫెయిల్ అయిన వారు అడ్మిషన్ పొంది పరీక్షలు రాయడం ద్వారా ఒకే సంవత్సరంలో పాస్ కావచ్చని తెలిపారు. ఆగస్టు 31/2024 నాటికి 14 సంవత్సరాలు నిండాలని, ఇంటర్ అడ్మిషన్ కోసం 15 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలని, అన్ని వర్గాల వారికి అడ్మిషన్ ఫీజు రూ.150, స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వికలాంగులు, మాజీ సైనికుల పిల్లలకు రూ.1000, ఓపెన్ కేటగిరి వారికి రూ.1400, ఇంటర్‌కు రూ.1200, ఓపెన్ క్యాటగిరికి రూ.1500 పరీక్ష ఫీజు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9849602072 ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

సహాయ వ్యవసాయ సంచాలకులుగా లాల్చంద్

నవతెలంగాణ-ఇల్లందు



వ్యవసాయ శాఖలో ప్రభుత్వం బదిలీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖలో ఏడీఏ(టెక్)గా పని చేసి బదిలీపై ఇల్లందు సహాయ వ్యవసాయ సంచాలకులుగా లాల్చంద్ వచ్చారు. బుధవారం ఇల్లందు వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులుగా గత 7 ఏళ్లుగా పనిచేస్తున్న వాసవి రాణి బదిలీపై ఖమ్మం ఏడీఏ(టెక్)గా వెళ్లారు.

సేవలు మరువలేని వీడ్కోలు సభలో జనగం

డివిజన్‌లోని టేకులపల్లి, ఇల్లెందు మండలాల అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ అధికారినిగా వాసవి రాణి ఇల్లందు డివిజన్లో సుమారు ఏడు సంవత్సరాలు సమర్థవంతమైన అధికారినిగా పనిచేశారని, రైతులకు చేసిన సేవలు మరువలేనివని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జిల్లా డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, మాజీ రైతు సమన్వయ కమిటీ రాష్ట్ర సలహాదారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పులిగళ్ల మాధవరావులు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎడీఏ లాల్చంద్, పి.సతీష్ ఏఓ, డి.రామకృష్ణ ఏవో, యశ్వంత్ ఏఈవో, వంశీ నాయక్ ఏఈఓ, సందీప్ ఏఈఓ, ఎం.ప్రవీణ్ ఏఈఓ, జి.రేవతి బీటీఎం తదితరులు పాల్గొన్నారు.

మనిషిని 'మహా మనిషిగా' మలిచేది చదువు ఒక్కటే

• హైకోర్టు పీపీ పల్లె నాగేశ్వరరావు



నవతెలంగాణ-చర్ల

సమాజంలో ఎంతో విలువైన వ్యక్తిగా మనిషిని మహా మనిషిగా మలచగలిగేది ఏకాగ్రతతో చదివిన చదువు ఒక్కటేనని రాష్ట్ర హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక శైలజ వివాహాల్లో ప్రముఖ రాజకీయ నాయకులు క్రీస్తు శేషులు చింతలచెరువు వెంకట కృష్ణారావు (సీవికేర్‌రావు) రెండవ వర్ధంతిని పురస్కరించుకొని చింతూరి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సరైన ఆర్థిక వసతులు లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్తోమత లేక ప్రభుత్వ పాఠశాలలో పట్టు దలతో ఏకాగ్రతతో చదవడం వలన నేను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి తన విద్యార్థి దశలో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన అన్నారు. లాయర్ సతీష్ ఉన్నత చదువులు చదవడం వలన, ఇంతటి మారుమూల ప్రాంతలో పుట్టి చక్కటి విద్యాభ్యాసం చేయడం వలన రాష్ట్ర రాజధానిలో రాణిస్తున్నట్టు తెలిపారు. హైకోర్టు అడ్వకేట్ అయినప్పటికిని తనకు జన్మభూమి మీద మక్కువ ఈ ప్రాంత ప్రజల పైన మర్యాద ఎంతగానో ఉందని తండ్రి, తాతలను గుర్తు చేసుకుంటూ జయంతులు, వర్ధంతులు జరిపించడం చాలా హర్షించదగ్గ విషయమని ఆయన కొనియాడారు. తొలుత స్థానిక రాలగూడెం గ్రామంలో సివికే రావు దానం చేసిన యూపీఎస్ పాఠశాల స్థలం పాఠశాలలో మాజీ ఎంపీ కెవిపి రామచంద్రారావు ఎంపీ ల్యాండ్స్ ద్వారా ఏర్పాటు చేసిన ఫర్నిచర్, అభివృద్ధి కార్యక్రమాలను తిలకించిన పీపీ అక్కడి నుండి త్యాగస్థలిలో చింతలచెరువు వెంకటాద్రి, సివికే రావు గాట్లను సందర్శించి పుష్పాలు జల్లి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం శైలజా వ్యవహారలో ఉన్న సివికే రావు విగ్రహానికి పూలమాలవేసి రెండవ వర్ధంతి సభ కార్యక్రమంలో పాల్గొన్నారు. సివికే రావు జాతి రత్నాల లాంటి ఇద్దరు కుమారులను సమాజానికి అందించారని వారు సమాజ శ్రేయస్సు కోసం అనునిత్యం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుతో పాటు పలువురు పెద్దలు కొనియాడారు. జయంతి కార్యక్రమాలను పురస్కరించుకొని నిరుపేదలకు దుప్పట్లు, నిత్యావసర సామగ్రి అందించడంతోపాటు ఈ ప్రాంత ఆదివాసీలకు సిహెచ్ సతీష్ కుమార్ బాసటగా నిలుస్తున్నారని పలువురు కీర్తించారు. తరువాత అతిథులను సీహెచ్ సతీష్ కుటుంబ సభ్యులు సాలువాలు కప్పి, జ్ఞాపికలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఈదయ్య, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, ఎర్రంకి బాబ్జి, తడికల లాలయ్య, దొడ్డి తాతారావు, సాగి శ్రీనివాసరాజు, నీలి నందు, ఎస్.కే.షాజహాన్, చీమకుర్తి భద్రం, సివికే రావు కుటుంబ సభ్యులు, అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అర్హత ఉన్నా రుణమాఫీ సున్నా...

• ఆందోళనలో రైతన్న

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఎంతో మంది చిన్న, సన్నకారు రైతన్నలకు స్వల్ప మోతాదులో రుణాలు ఉన్నా అవి మాఫీ కాలేదు. దీంతో రైతులు బ్యాంకులు, రైతు వేదికలు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. మండలంలో మొదటి దఫాలో 1774, రెండో సారి 1086, మూడో జాబితాలో 754 మొత్తం 3614 మందికి రుణమాఫీ అయినట్టు వ్యవసాయ అధికారులు ప్రకటించారు. కానీ రూ.50 వేలు, రూ.లక్ష లోపు ఉన్న రైతులకు అనేక మందికి రుణమాఫీ జాబితాలో చోటు లేక పోవడంతో ఆందోళనకు గురి అవుతున్నారు. అర్హత ఉండీ రుణమాఫీ పొందని రైతులు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మండలంలో గత రెండు రోజులుగా 170 మంది తనకు రుణమాఫీ అనలేదని దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఎక్కువ దరఖాస్తులు రేషన్ కార్డ్ లేనివిగా, మరికొన్ని రుణ గ్రహీత బ్యాంక్ ఎకౌంట్‌కు ఆధార్ లింక్ కాకపోవడం లాంటివి ఉన్నట్టు తెలుస్తుంది. దరఖాస్తులు స్వీకరించాక ప్రభుత్వం నిబంధనల మేరకు వాటికి పరిష్కారం లభిస్తుందని ఏవో శివరాం ప్రసాద్ తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అధైర్యపడవద్దని సూచించారు.



ఉమ్రా యాత్రికులకు సన్మానం

నవతెలంగాణ-టేకులపల్లి

మండల కేంద్రానికి చెందిన షేఖ్ ఖాజా, మొహమ్మద్ ఫారూఖ్, ఫారూఖ్ సతీమణి మొత్తం ముగురు ఈ నెల 22న ఉమ్రా (మక్కా, మదీనా) యాత్రకు బయలుదేరి వెళ్లనున్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలోని ఉమర్ బిన్ ఖతాబ్ బైతుల్లా మసీదులో ఉమ్రా యాత్రికులకు సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉమ్రాలో అవసరమైన దుస్తులు, వస్తువులను వారికీ అందచేశారు. గురువారం హైదరాబాద్‌లో విమానం ద్వారా వెళ్తారని మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ముగ్గురికి గౌరవంగా, భక్తి శ్రద్దలతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఇనాయతుల్లా, షేఖ్ అహమద్ మౌలానా, హఫీజ్, అజీమ్, మసీదు కమిటీ అధ్యక్షుడు హనీఫ్, ఎండీ సుభాన్ అలీ, ఎండీ హాజీ, రఫీ, అమోర్, నయీమ్, అబ్దుల్ నబీ, యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికులను అరెస్టులు చేయడం అన్యాయం

నవతెలంగాణ-చర్ల

ఎనిమిది నెలలుగా రావాల్సిన పెండింగ్ బిల్లులు, బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు హైదరాబాదులో ధర్నా నిర్వహించేందుకు వెళ్లగా మహిళా కార్మికులను ప్రభుత్వం అరెస్టులు చేసి ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు హైదరాబాదు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించటాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి, మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, మండల నాయకులు పి.బాలాజీ, ఎం.విజయశీల తీవ్రంగా ఖండించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పేద పిల్లలకు పాఠశాలల్లో అన్నం వండి పెట్టినందుకు ఇవ్వాల్సిన బిల్లులు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్యగా సీఐటీయూ పేర్కొన్నది. ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా రూ.18 వేల జీతాన్ని ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కి అప్పగించే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. అరెస్టులు, నిర్బంధాల ద్వారా కార్మిక పోరాటాలని అనచి వేయలేరని, ఇదే పద్ధతి కొనసాగితే మరిన్ని పోరాటాలను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని సీఐటీయూ హెచ్చరించింది. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పృధ్వి, స్వరూప, లక్ష్మి, విజయ్, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తా రోకో



ఇల్లందు మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ అరెస్టులను ఖండించాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఐసీడీఎస్ ఇల్లందు ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుదిమళ్ల వద్ద బుధవారం రాస్తా రోకో నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు అధ్యక్షులు సీహెచ్ రాంబాయి అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, ప్రాజెక్టు కార్యదర్శి కళ్ళేపల్లి మరియాలు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లిన కార్మికులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేసి వేర్వేరు పోలీసు స్టేషన్‌లలో నిర్బందించడాన్ని తీవ్రంగా ఖండించారు.

మహిళలపై అత్యాచారాలు, హత్యలకు ఖండన

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూగా ఈ ఘటనను ఖండించారు. మహిళలపై అత్యాచారాల హత్యలు జరుగుతున్న పాలకులు పట్టించుకోక పోవడం సరికాదన్నారు. మొన్న కోల్ కతాలో మెడికో మోమిత, నిన్న తెలంగాణలో ముక్కుపచ్చలారని చిన్నారులపై జరుగుతున్న వరుస ఘటనలకు కారణాలను గుర్తించి ఖటినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం నేత ఆలేటి సంధ్య, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలి

నవతెలంగాణ-జూలూరుపాడు

మల్టి పర్పస్ వర్కర్‌లు రెండు నెలల జీతాలు లేక అవస్థలు పడుతున్న నేపథ్యంలో బుధవారం స్థానిక మాజీ సర్పంచ్ గుండె పిన్ని విజయ ఇంటి వద్దకు వెళ్లి తమ అవస్థలను గుర్తించి మాకు జీతాలు ఇవ్వాలని కోరారు. 45 రోజుల జీతం సకాలంలో అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని మాజీ సర్పంచును కోరారు.



ఉపాధ్యాయుల అటెండెన్స్‌పై కలెక్టర్ ఆగ్రహం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ప్రభుత్వ పాఠశాలలలో 90 శాతం ఉండవలసిన ఉపాధ్యాయుల అటెండెన్స్ 81 శాతం మాత్రమే ఉండటంతో మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మురళీమోహన్ పై ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజ్మిల్ ఖాన్ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని మీనవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించగా ఇద్దరు ఉపాధ్యాయులు సెలవు పెట్టినట్లుగా రికార్డులో కనిపించగా ఉపాధ్యాయులకు సెలవ ఇవ్వ వద్దని చెప్పాం కదా ఎందుకు సెలవు ఇచ్చావు అని మండిపడ్డారు. మన ఊరు మనబడి పథకం క్రింద మంజూరు చేసిన నిధులతో పూర్తి పనులు ఎందుకు చేయించలేదని దానికి వివరణ ఇవ్వాలని అన్నారు. కిచెన్ గార్డెన్ పై ఫైర్ అయ్యారు. కూర విత్తనాలను చెట్ల కింద చల్లితే అవి ఎలా మొలుస్తాయని కోపగించుకున్నారు. విద్యార్థులతో కలెక్టర్ కొ ద్దిసేపు ముచ్చటించి, వారితో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయుడు లేడని విద్యా ర్థులు కలెక్టర్ కు తెలిపారు. మధ్యాహ్న భోజనం బిల్లులు లేక చాలా ఇబ్బంది పడుతున్నట్టు మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టర్ కి విన్నవించుకున్నారు. సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తానని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, మండల తహసీల్దార్ మన్నె ఉషా శారద పాల్గొన్నారు.

ప్రజలు తమ పాత మొబైల్ ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మవద్దు, ఇవ్వొద్దు

- సీపీఎస్ ఏసీపీ ఫణింధర్

నవతెలంగాణ-ఖమ్మం

సైబర్ నేరాల్లో వినియోగించేందుకు పాత మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసేందుకు ఏవరైన గుర్తు తెలియని వ్యక్తులు సంప్రదిస్తే వారి మాటలు నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఫణింధర్ తెలిపారు. ఇటీవల రామగుండం పోలీసులు బీహార్ రాష్ట్రం, హతియా దియారా ప్రాంతానికి చెందిన ముగ్గురు నిందుతులను అరెస్ట్ చేసి, సుమారు 4000 పాత మొబైల్ ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. సైబర్ నేరాల కోసం పాత మొబైల్ ఫోన్లను తక్కువ ధరకు ప్రజల నుంచి కొనుగోలు చేసి ప్లాస్టిక్ వస్తువులు లేదా డబ్బును ఇచ్చి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇలాంటి సంఘటనల జరగకుండా ముందస్తు అప్రమత్తం అవసరమని తెలిపారు. అక్కడ కొనుగోలు చేసిన మొబైల్స్ ను తమ గ్రామంలో నివసిస్తున్న తమ సహచరుడికి అప్పగిస్తారని, రామగుండం పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు. ఏదైనా సమాచారం వుంటే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ సెల్ నెంబరు 8712665556 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మ్యాన్ వే ఏర్పాటు చేయాలి

- ఎస్‌ఓటు జీఎంకి వినతి

నవతెలంగాణ-మణుగూరు

కొత్తగా ఏర్పాటైన ఓసీ 2 సైట్ కార్యాలయం నందు ఉన్న కార్మిక వర్గానికి ఒకే మ్యాన్ వే ఉండటం వల్ల మస్టర్ నమోదు సమయంలో కార్మికులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని, యాజమాన్యం వెంటనే స్పందించి రెండవ మ్యాన్ వే ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఏరియా యస్‌ఓటూ జీఎం శ్యామ్ సుందర్‌కు ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు వినతి పత్రం అందజేశారు. ఏరియాలోని కేపీయూజీమైన్, మణుగూరు ఓసీలలో మ్యాన్ వేలలో పని చేసే కార్మికులను ఇతర పనులకు వాడుతూ మ్యాన్ వే లక్ష్యాన్ని అధికారులు దెబ్బతీసున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మస్తాన్, నాగేశ్వర రావు, ఆపరేటర్ ముకేశ్, జీఎం కార్యాలయం ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిద్ధి ద్వితీయ వర్ధంతి

నవతెలంగాణ-టేకులపల్లి

సీపీఐ మండల కార్యాలయంలో ఆ పార్టీ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ సిద్ధి వెంకటేశ్వర్లు ద్వితీయ వర్ధంతి సందర్భంగా బుధవారం నివాళులర్పించారు. జిల్లా నాయకులు రామ్ చందర్ మాట్లాడారు. విద్యార్థి సంఘం నుండి యువజన రంగంలో, పార్టీగా ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, పనిచేసి మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వీరన్న, రవీందర్, సతీష్, శ్యామ్, యువ రాజు, సోనీ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ టాబ్లెట్లు కరువు...



- సిట్రాజన్ సంగతి సరే సరి
- ఇది సర్కార్ దవాఖాన్ల తీరు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- ప్రభుత్వం దృష్టి సారించాలంటున్న వైనం

నవతెలంగాణ-అశ్వాపురం

మండల కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పటల్లో గత కొంతకాలంగా గ్యాస్ టాబ్లెట్లు కరువైయ్యాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జలుబు, ఎలర్జీ కోసం వాడే సిట్రాజన్ టాబ్లెట్ల సరఫరా అంతంత మాత్రం గానే ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సీజన్లో ప్రజలు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతూ ఆసుపత్రికి వెళుతుంటారు. ఈ క్రమంలో రోగులను పరీక్షించిన వైద్యులు వారికి మందులు ఇస్తున్న సమయంలో తప్పనిసరిగా గ్యాస్ట్రిక్‌కు సంబంధించిన ర్యాంటెక్ లేదంటే పెన్ ట్రా ప్రజోల్ టాబ్లెట్లను రాయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఈ మందుల కొరత తీవ్రం కావడంతో రోగులతో పాటు వైద్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారని తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులు లేకపోవడంతో ప్రయివేటు వైద్యులను సంప్రదించడం వలన పెద్ద ఎత్తున వైద్య ఖర్చులు అవుతున్నాయని రోగులు చెబుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై రోగులకు సన్నగిల్లుతున్న నమ్మకం

మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాలలో మందుల కొరత తీవ్రంగా ఉందని పలువురు అంటున్నారు. కావలసిన మందులు లేకపోవడంతో వైద్య శాఖలో పనిచేస్తున్న వైద్యులు సైతం రోగులకు నచ్చచెప్పుతూ ఉన్న వాటిని ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సర్కార్ దవాఖానాల్లో రోగులకు సరైన మందులు లేకపోవడంతో కార్పొరేట్ వైద్యశాల వైపు మల్లుతున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వంతో పాటు సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ధర్మాస్పత్రిలో మందులు సమకూర్చాలని రోగులు కోరుతున్నారు.

కిటకిటలాడుతున్న కార్పొరేట్ వైద్యశాలలు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన మందులు లేకపోవడంతో వ్యాధులతో బాధపడుతున్న రోగులు కార్పొరేట్ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. ఆర్ఎంపీలను కొందరు ఆశ్రయిస్తుంటే మరికొందరు మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం వంటి పట్టణ ప్రాంతాలకు వెళ్లి కార్పొరేట్ వైద్యశాలలో వైద్య చికిత్సలను చేయించుకుంటున్నారు.

సమయానికి డబ్బులు లేకపోయినా పెద్ద ఎత్తున అప్పులు చేసి వైద్యానికి ఖర్చు చేసుకుంటున్నారు. ఇదంతా ప్రభుత్వ వైద్యశాలలో సరైన వైద్య సేవలు అందకు పోవడం వలనే జరుగుతుందని రోగులంటున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో అన్ని మందులను సమకూర్చి వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఏసీబీ వలలో చిక్కిన ఎంపీఓ, కార్యదర్శి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఆళ్ళపల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీఓ, మర్కోడు గ్రామం కార్యదర్శి బుధవారం ఏసీబీ వలలో చిక్కారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు దాడులు జరిపారు. మర్కోడు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కుర్ర కమల తాను గతంలో వేసిన రోడ్లకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎంపీఓను కోరగా ఆ రోడ్డు కాంట్రాక్టు బిల్లుల్లు మంజూరు చెయ్యాలంటే రూ.15000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడని, దానితో ఆమె ఖమ్మం ఎసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ప్రత్యేక నిఘా ఉంచి ఎంపీఓ బత్తిన శ్రీనివాసరావు, కార్యదర్శి నాగరాజులు మాజీ ఉపసర్పంచ్ కుర్ర కమల నుండి రూ.15వేలు లంచం తీసుకుంటూ ఉండగా ప్రత్యక్షంగా పట్టుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో ఎవరైనా లంచం అడిగితే వెంటనే ఏసీబీ అధికారులకు తెలియజేయుటకు 1064 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడులలో పట్టుబడ్డ ఎంపీఓ బత్తిన శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భ్రూణ హత్యలు నేరం, రుజువైతే కఠిన చర్యలు

- జిల్లా జడ్జి వసంత్ పాటిల్
- చట్టవిరుద్ధంగా అబార్షన్లు చెయొద్దు : కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ



భ్రూణ హత్యలు నేరమని, రుజువైతే కఠిన చర్యలు తప్పవని జిల్లా జడ్జి వసంత్ పాటిల్ హెచ్చరించారు. ఐడీఓసీ సమావేశ హాల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధ్యక్షతన జిల్లా బహుళ సభ్య అధికార కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్జి వసంత్ పాటిల్ పాల్గొని, మాట్లాడారు. ఆడపిల్లని ఎదగనియాలని, ఆడ, మగ అంటూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే (పిసి పిఎన్డిటి) యాక్ట్ ప్రకారం ఆయా ఆసుపత్రుల అనుమతులు రద్దు చేయాలని సూచించారు. ఆడపిల్లలపై జరుగుతున్న దాడులను నిరో దించేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అధికారులు ప్రయివేట్ ఆసుపత్రులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని, గర్భవిచ్చిన ఆపరేషన్లు చేసే వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎల్.భాస్కర్ నాయక్, పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డా.చైతన్య డా.బాలాజీ, డిప్యూటీ డెమో ఫైజ్ మొహిఉద్దీన్, డీసీపీఓ ఎం.కుమారి తదితరులు ఉన్నారు.

సీపీఐ(ఎం) పట్ల అంకితభావంతో పనిచేసిన వ్యక్తి తిరుపతయ్య

- సంతాప సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు

సీపీఐ(ఎం) పట్ల అంకితభావం, క్రమశిక్షణ కలిగిన నాయకునిగా పనిచేసిన సీఐటీయూ మండల కన్వీనర్ అమరజీవి బర్ల తిరుపతయ్య చేసిన సేవలు మరువలేనివని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బూర్గంపాడులోని గౌతమిపురం కాలనీలో తిరుపతయ్య స్వగృహంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మచ్చా మాట్లాడుతూ సీపీఐ(ఎం), సీఐటీయూ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో అనేక ప్రజా ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయటంలో తిరుపతయ్య ఎంతగానో కష్ట పడి పని చేశారని ఆయన పేర్కొన్నారు. తిరుపతయ్య మృతి పార్టీకి తీరని లోటు అని ఆయన అన్నారు. అదేవిధంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డిలు మాట్లాడుతూ పార్టీలో చురుకైన వ్యక్తిగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటున్న సీఐటీయూ మండల కన్వీనర్‌గా తన బాధ్యతలను నిర్వర్తిస్తున్న తిరుపతయ్య మృతి చెందటం బాధాకరమని వారు పేర్కొన్నారు. తొలుత తిరుపతయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఆర్.వెంకటేశ్వరావు, ఆర్.నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కె.వీరభద్రం, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు భయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజిని, గుంటుక కృష్ణ, నాగేశ్వరరావు, శ్యామల అజయ్ కుమార్, ఎటపాక మండలం గుండాల గ్రామ పార్టీ నాయకులు గంపల అరుణద్, జన విజ్ఞాన వేదిక అల్లాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

- పెండింగ్ స్కాలర్షిప్స్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి
- జిల్లాలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.వీరభద్రం



నవతెలంగాణ-కొత్తగూడెం

పెండింగ్ స్కాలర్షిప్స్, రీయింబర్స్‌మెంట్ విడుదల, మెస్, కాస్మోటిక్ చార్జీల పెంచాలని, భద్రాద్రి జిల్లాలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని, విద్యారంగ సమస్యలపై మాట్లాడకపోతే ఉప ముఖ్యమంత్రి జిల్లాలో ఇదే చివరి పర్యటన అవుతుందని, ఏజెన్సీ జిల్లాకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి జవహర్ నవోదయ పాఠశాలల కోసం కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.వీరభద్రం డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, జిల్లా కమిటీ గురువారం జిల్లాలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో విద్యారంగ సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. బుధవారం రామవరం ఎస్సీ బాలుర వసతి గృహం ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8,245 కోట్ల పెండింగ్ స్కాలర్షిప్స్, రీయింబర్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలనీ, సంక్షేమ వసతి గృహాలలో నివాసం ఉండే విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వం చెల్లిస్తున్న చాలీచాలని మెస్ చార్జీలతో వసతి గృహాల్లో నివాసం ఉండే విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదని ఆరోపించారు. ప్రీ మెట్రిక్ విద్యార్థులకు రూ.3 వేలు, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు రూ.5 వేలు ఇవ్వాలని, వసతి గృహాలకు డైట్ బిల్లులు ప్రతీ నెలా సకాలంలో ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఉన్న కాకతీయ యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలను మైనింగ్ ఇతర కోర్సులను చేర్చి భద్రాద్రి ఏజెన్సీ జిల్లాలో టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని లేదా స్వయం ప్రతిపత్తి గల కళాశాలగా లేదా జెఎన్ టీయూ అనుబంధ కళాశాలగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుజాత నగర్ మండల కేంద్రంలో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల, ములకలపల్లి మండల కేంద్రంలో గిరిజన కళాశాల బాలుర వసతి గృహం, కొత్తగూడెంలో గిరిజన పాఠశాల బాలుర వసతి గృహం, పాల్వంచలో వెనుకబడిన తరగతుల పాఠశాల బాలికల వసతి గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై నోరు మెదపకపోతే ఉప ముఖ్యమంత్రికి ఇదే చివరి పర్యటన అవుతుందని, భవిష్యత్తులో అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.రామ్ చరణ్, టెక్నికల్ స్టూడెంట్స్ రాష్ట్ర కమిటీ సభ్యులు విష్ణు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కోసమే మాలల భారత్ బంద్

- వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఐక్య కార్యాచరణ కమిటీ

నవతెలంగాణ-కొత్తగూడెం



జిల్లాలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బంద్ విజయవంతంగా జరిగింది. బంద్ సందర్భంగా పట్టణంలో వాణిజ్య, వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంక్‌లు, సినిమా థియేటర్స్, స్కూల్స్ కాలేజీలు. హోటల్స్ ఇంజనీరింగ్ కాలేజిలు, ఎలక్ట్రికల్ షాప్స్, ట్రేడర్స్, బేకరీ, చికెన్ సెంటర్స్, సిమెంట్ షాప్స్, జిరాక్స్ చిరు వ్యాపారులు అందరూ స్వచ్ఛందంగా బంద్‌కు సంపూర్ణ మద్దతును తెలిపారు. స్వచ్ఛందంగా షాపులు మూసివేశారు. ఈ సందర్భంగా ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మనువాద వారసుడు ప్రధాని మోడీ అని మండి పడ్డారు. ఈ దేశంలో దళితుల అనైఖ్యతకు ఆజ్యం పోశాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పూల రవీందర్, నవతన్, గిద్ద పరంజ్యోతి, మధుసూదన్‌రావు (చిన్ని), అంతటి.పాల్, కూరపాటి. రవీందర్, ఆంతోటి రాజు, అఖిల్, గిల్బర్, జున్ను, మహేష్, తుంపురి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చర్ల ఇటీవల ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కు తీసుకోవాలని, దీనివల్ల ఎస్సీల్లో విభజన ఏర్పడే అవకాశం ఉందని జాతీయ మాల మహానాడు జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఏడెల్లి గణపతి ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తాజాగా ప్రకటించిన తీర్పును నిరసిస్తూ దేశవ్యాప్తంగా బుధవారం భారత్ బంద్‌కు మాల సామాజిక వర్గం నేతలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మండలంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి తోటమల్ల రమణమూర్తి, రాష్ట్ర నాయకులు కొంగూరు రమణారావు, దొడ్డా ప్రభుదాస్, కొంగూరు నరసింహారావు, కోడి రెక్కల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బంద్ సంపూర్ణంగా విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు గణపతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కొంగురు రమణారావు, మాలమహానాడు మండల గౌరవ అధ్యక్షులు ప్రభాకర్, మండల అధ్యక్షులు రాజా, మాజీ మండల అధ్యక్షులు గోపాలరావు, నాయకులు, పాల్గొన్నారు.

చంద్రుగొండ : చంద్రుగొండ ప్రధాన సెంటర్లో భారత్ బంద్ విజయవంతమైంది. విద్యా, వ్యాపార, చిరు వ్యాపారులు బందుకు సహకరించారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్లో ఇల్లంగి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో మాల మహానాడు మండల అధ్యక్షులు బడుగు శంకర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు గ్రామ పెద్దలు తంబళ్ల ముత్తయ్య, చిన్న ఎల్లయ్య, తలారి రాంబాబు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దమ్మపేట : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను విరమించుకోవాలని జాతీయ మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. భారత్ బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం దమ్మపేటలో నిరసన కార్యక్రమాలు జరిపారు. ఈ క్రమంలో దమ్మపేట మండలంలో పాఠశాలలు, కళాశాలలు, బ్యాంక్‌లు బంద్ చేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు బొజ్జ రమేష్, పసుపులేటి సాంబశివరావు, సాయి, రంగారావు, లక్ష్మణరావు, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం

- నవ సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యత వహించాలి : జీఎం శామ్యూల్ సుధాకర్

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ సమీపంలోని సీమ కార్నర్ కాంప్లెక్స్‌లో మైనార్టీ యువత పాల్గొని తల సేమియా సైకిల్ సెల్ సొసైటీ వారి అభ్యర్థన మేర రక్తదాన శిబిరంను నిర్వహించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జీఎం వెల్ఫేర్ శామ్యూల్ సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహకరించిన వారందరికీ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి రజాక్ ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేట్ ఐఎన్‌టీయూసీ నాయకులు పీతాంబరం, హెచ్ఎంఎస్ నాయకులు ఆంజనేయులు, జమాతే ఇస్లామీ హింద్ నాయకులు బాసిత్, సింగరేణి మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆసిఫ్, ట్రెజరర్ కరీం, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గౌస్, షకీల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జోనల్ క్రీడల సమావేశం

నవతెలంగాణ-కొత్తగూడెం

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు నిర్వహించనున్న మండల స్థాయి, జోనల్ స్థాయి క్రీడల నిర్వహణ సమావేశం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు కొత్తగూడెం సింగరేణి స్కూల్, పోస్ట్ ఆఫీస్ సెంటర్ నందు నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖ అధికారి బి.జుంకీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం మండలాల ఉన్నత పాఠశాల ప్రాధానోపాధ్యాయులు, ఈ సమావేశానికి ప్రభుత్వ, లోకల్ బాడీ, ప్రయివేటు యూఆర్ఎస్, ఏడెడ్ స్కూల్సలతో పాటు వ్యాయామ దర్శకులు, వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

హైస్కూల్‌ను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ-ముదిగొండ



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న ఐఎఫ్పి ట్రైనింగ్ క్లాస్ తోపాటు, కిచెన్ గార్డెన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి బెండకాయ, సొరకాయ తదితర కూరగాయల మొక్కలను పెంచాలని హెచ్‌ఎం శాంతికి ఆయన సూచించారు. ఐఎఫ్పి ప్యానల్ ద్వారా అర్థవంతంగా, సరళంగా విద్యార్థులకు బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కే.శాంతి, సీసీ మాధవరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐ మురళిని కలిసిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ముదిగొండ



ముదిగొండ పోలీస్ స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మురళిను, పెద్దమండవ, బాణాపురం గ్రామాలకు చెందిన సిపిఐ(ఎం) నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ మురళిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ,మండలంలో రాజకీయ పార్టీలతోపాటు,ప్రజల సహకారంతో శాంతి భద్రతలను కాపాడతానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు పంద్రకోల రాంబాబు, పెద్దమండవ, బాణాపురం సిపిఐ(ఎం) గ్రామశాఖల కార్యదర్శులు మాదారపు శ్రీనివాసరావు, చింతకాయల రామారావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన కానిస్టేబుల్‌కు సన్మానం

నవతెలంగాణ-వైరా

ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బండి వెంకటేశ్వర్లు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ రహమాన్ బండి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఎన్.అప్పారావు, బాబు జాన్, సీహెచ్చ్.నాగేశ్వరరావు, కే.శ్రీనివాసరావు, బీ.బాల్య, ఎస్‌కే.నాగూల్ మీరా, శంకర్, బీ.నాగేశ్వరరావు, కే. రామకృష్ణ పాల్గొన్నారు.

సీపీఐలో చేరికలు

నవతెలంగాణ-బోనకల్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన పక్ష నేత కూనంనేని సాంబశివరావు సమక్షంలో బుధవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో ముష్టికుంట్ల గ్రామానికి చెందిన కొంగర భాస్కర్‌రావు, బోళ్ళ ప్రసాదరావు, చిరునోముల గ్రామానికి చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి గుంపుల జయరాజు ఆ పార్టీలో చేరారు. వీరికి సాంబశివరావు పార్టీ జెడాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఎంత బలంగా ఉంటే దేశ ప్రజలు అంత బలంగా ఉంటారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి కమ్యూనిస్టులు వాటి పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి యంగల ఆనంద్‌రావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, ఏనుగు గాంధీ, మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, ముష్టికుంట్ల శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మేడేపల్లి హైస్కూల్లో మొక్కలు నాటిన విద్యార్థులు

నవతెలంగాణ-ముదిగొండ

దేశంలో అన్ని ప్రాంతాలలో తల్లితోపాటు, లేక తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలో మేడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం మొక్కలు నాటి వాటి ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సామినేని హరి ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ పోటు ప్రసాద్, హైస్కూల్ హెచ్‌ఎం బండి నాగేశ్వరరావు, జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రభాకర్, విజయ్ కుమార్, యుగంధర్, పాల్గొన్నారు.

అమేర్ అలీ ఖాన్‌కు జావీద్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఖమ్మం



శాసన మండలి సభ్యుడిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన అమేర్ అలీ ఖాన్‌ను హైదరాబాద్ లో బుదవారం ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జావిద్ మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జావేద్ మాట్లాడారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కరించేందుకు ఆ సమస్యల పట్ల ఎంతో అవగాహన కలిగిన అమేర్ అలీ ఖాన్ చిత్తశుద్ధితో పనిచేస్తారని, నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లో బుధవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన గురునాధరావు (24) ప్రేమ విఫలం అయి,అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపం చెంది ఈనెల 18వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఆర్థిక సాయం చేసిన మాజీ జెడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి

నవతెలంగాణ-చంద్రుగొండ



మండల కేంద్రంలోని ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన సమ్మెట వెంకటరమణ దశ దిన కర్మ గురువారం జరుగనుంది. ఈకార్యక్ర మానికి తన వంతు సహాయంగా ఆయన భార్యకు సమ్మెట నాగమణికి ఆర్థిక సాయం జిల్లా రైతు సమన్వ సమితి మాజీ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మీకు ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ పార్టీ గాని, వేముల కోటితో గాని నాకు తెలియజేయాల్సిందిగా ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నన్నక సంపత్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు అన్వర్, బడుగు శంకర్, మండల సేవాదళ్ అధ్యక్షులు బుంగ శ్రీను, వేముల కోటేశ్వరరావు, బోగి బోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఇనగాలి గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరెడ్డి(50) తన గేదెలకు గ్రామ సమీపంలోని కట్టలేరు ఏటిలో ఉండగా వాటిని తోలుకొచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందారు. మృతుడికి భార్య వెంకటరావమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గ్రామ గ్రామాన వైద్య శిబిరాలు

నవతెలంగాణ-తల్లాడ



మండలంలో విష జ్వరాలు ప్రబలుతున్నందున గత మూడు రోజులుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామాలలో విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తున్నారు. బుధవారం కొత్త మిట్టపల్లి, బాలపేట, నూతనకల్లా, మాలలో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు డాక్టర్ రత్న మనోహర్ తెలిపారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుతూ.. నీటి నిల్వలను తొలగించి దోమలు పుట్టకుండా చూసుకోవాలన్నారు. గృహ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు. ఎవరికైనా ఏ అనారోగ్య సమస్య ఉత్పన్నమైన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

పిల్లలను చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

నవతెలంగాణ-ఖమ్మం

పిల్లలను చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ స్త్రీ-శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో ఉన్న ఇద్దరు పిల్లల దత్తత ప్రక్రియను కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో చేపట్టి, దరఖాస్తుచేసిన హైదరాబాద్, ఖమ్మంకు చెందిన దంపతులకు పిల్లలను అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దత్తత అనేది ఒక వరమని, అనాధలు అయిన పిల్లలను తీసుకుని వారికి మంచి భవిష్యత్తును ఇవ్వటమే కాకుండా ఆ పిల్లలకి కూడా మంచి తల్లిదండ్రులతో కూడిన కుటుంబంను ఇవ్వడం అనేది చాలా గొప్ప విషయమన్నారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు న్యాయబద్ధమైన బిడ్డగా మారతారన్నారు. దత్తత పిల్లలకి ప్రభుత్వం ద్వారా చట్ట భద్రత కల్పించడం జరుగుతుందని, ఈ పిల్లలకి దత్తత ప్రక్రియ ద్వారా తల్లిదండ్రులుకి అందించడం వలన వారికి బంగారు భవిష్యత్తు లభిస్తుందని తెలిపారు. చట్ట విరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరమని, చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత ఇచ్చిన, తీసుకున్న వారికి 3 సంవత్సరాల కారాగార శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధించబడుతుందన్నారు. ఏ ప్రయోజనాల కోసం అయినా ఒక బాలుడు, బాలికను అమ్మటం కానీ, కొనటం కానీ జరిగితే వారికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, దానితో పాటు లక్ష రూపాయల జరిమానా విధించబడుతుందని తెలిపారు. చట్ట ప్రకారం మాత్రమే దత్తత తీసుకోవాలని, శిశు గృహలో ఉన్న పిల్లల్ని చట్ట ప్రకారం దత్తతకి ఇవ్వనున్నట్లు, పిల్లలు దత్తత కావాలనుకున్న ఖమ్మం జిల్లాకు సంబంధించిన వారు మాత్రమే శిశు గృహ ద్వారా, బంధుత్వ దత్తత కావాలనుకున్న వారు జిల్లా బాలల పరిరక్షణ విభాగంను సంప్రదించాలన్నారు. దత్తత పట్ల ఆసక్తి గల వారు https://cara.wcd.gov.in నందు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.



మాతృభాష, నైతిక విలువల అభివృద్ధికి...
విద్యార్థి దశనుంచి వేమన పద్యాలు దోహదపడతాయి

- **ఎమ్మెల్యే రాగమయి దయానంద్**

నవతెలంగాణ-సత్తుపల్లి



పిల్లలకు విద్యార్థి దశనుంచి వేమన శతక పద్యాలను చదివించడం ద్వారా వారిలో మాతృభాషపై పట్టుతో పాటు నైతిక విలువలు అభివృద్ధి చెందడానికి ఎంతగానో దోహదపడతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గార్లపాటి పాపాచలం, బొల్లేపల్లి సత్యనారాయణరాజు స్మారకార్థం వారి కుమారులు రామకృష్ణ, మధుసూదనరాజు సంయుక్త ఆధ్వర్యంలో ప్రచురించిన వేమన శతక పద్యాల ప్రతులను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ బుధవారం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న విపరీత పోకడలను చూడటం, వింటున్న క్రమంలో విద్య, విలువలు ఈ రెండింటిని విద్యార్థి దశనుంచే పిల్లలకు అవగాహన కలిగించాల్సిన ఆవశ్యకత మన ముందుందన్నారు. పిల్లల కోసం వేమన శతకాన్ని ప్రచురించడం అభినందనీయమని ప్రచురణ కర్తలను ఎమ్మెల్యే అభినందించారు. సత్తుపల్లి మండల విద్యాశాఖ నోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రస్తుతం అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలకు వేమన శతక పద్యాలు, పఠన లేఖనాలు ఉపయోగపడతాయన్నారు. వేమన శతక ప్రచురణ కర్తలు రామకృష్ణ, మధుసూదనరాజు మాట్లాడుతూ గత 20యేండ్లుగా తమ తల్లిదండ్రుల పేరున ఏర్పాటైన స్మారక ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న సాహిత్య, విద్యా వికాస కార్యక్రమ వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. సత్తుపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలకు ఈ శతక పద్య ప్రతులను ఉచితంగా అందజేస్తామని వారు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ శతక పద్య ప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో తహసీల్దారు యోగేశ్వరరావు, సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ కమిటీ ఛైర్మెన్లు దోమ ఆనంద్, బాగం నీరజా ప్రభాకర్, ట్రస్మా జిల్లా, మండల అధ్యక్షులు నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, లైవ్ సంస్థ నిర్వాహకులు గంధ్ర కిశోర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, వినుకొండ కృష్ణ పాల్గొన్నారు.



రుణమాఫీ ప్రక్రియ వేగవంతం చేయాలి

- **గ్రామాల్లోనే దరఖాస్తులు స్వీకరించాలి : సీపీఐ(ఎం)**

నవతెలంగాణ-కారేపల్లి

రాష్ట్ర ప్రభుత్వ రుణమాఫీ పక్రియ ను వేగవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కారేపల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణను కొండబోయిన నాగేశ్వరరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ అర్హతకు అనేక నిబంధనలు పెట్టడంతో మండలంలో వందల సంఖ్యలో రైతులకు మాఫీ కాలేదన్నారు. రైతులు రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్కులు ఇతర ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రం దరఖాస్తుల స్వీకరణతో దూరపు ప్రాంతాల నుండి వచ్చిన రైతులు ఇబ్బంధులు పడుతున్నారని గ్రామపంచాయతీలలో దరఖాస్తులను, ఏఈవో, గ్రామ కార్యదర్శుల ద్వారా స్వీకరించాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు రుణమాఫీ అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముండ్ల ఏకాంబరం, తలారి దేవప్రకాశ్, పాసిన్ని నాగేశ్వరరావు, అన్నవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-బోనకల్



సీజనల్ వ్యాధులు పట్ల మండలంలోని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సిహెచ్ఓ పెద్దినేని శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన సదస్సును ఐకెపి మహిళలకు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో పాటు ఆయా గ్రామాలలో గల ఆరోగ్య ఉప కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని తెలిపారు. వారికి తోడుగా ఐకెపి సిబ్బంది కూడా నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రజలలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. మండలంలోని అనేక గ్రామాలలో ప్రజలు కీళ్ల నొప్పులు, ఒళ్ళు నొప్పులు, జ్వరాలతో బాధపడుతున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని కోరారు. అనవసరంగా ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దని కోరారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్యం అందుతుందన్నారు. ఇందుకోసం డ్వాక్రా మహిళలు జ్వరాల బారిన పడిన వారిని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే విధంగా చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో ఐకెపి ఏపీఎం యద్దనపూడి పద్మలత, అజ్మీర సోనీ, వివిధ గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్ మేనేజర్‌గా ప్రియాంక అత్యుత్తమ సేవలు

- **ప్రశంసా పత్రం అందజేసిన కలెక్టర్**

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ కార్యాలయం మేనేజర్‌గా పని చేస్తున్న నాగటి ప్రియాంక తమ విధి నిర్వహణలో అధికారుల ప్రశంసలను అందుకున్నది. స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆమె సేవలను అభినందిస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రియాంకకు అత్యుత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలి

- **మాలమహానాడు ఏజేసీ ఆధ్వర్యంలో నిరసన**

నవతెలంగాణ-సత్తుపల్లి



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సత్తుపల్లిలో మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం భారత్ బంద్ కార్యక్రమం జరిగింది. స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట మాల మహానాడు నాయకులు వర్గీకరణను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాల మహానాడు జేఏసీ జాతీయ నాయకులు మేకతోటి కాంతయ్య మాట్లాడుతూ మాలల ఆత్మభిమానాన్ని కాపాడుతూ, మాలలు కోల్పోతున్న హక్కులను కాపాడేందుకు జాతీయస్థాయిలో జేఏసీ నాయకులు పోరాటం చేస్తున్నారన్నారు. మాలల ఆర్థిక పరిస్థితి రూ. 10 లక్షలకు మించి ఉండదని, అయినా మాలలను క్రిమీలేయర్లుగా ప్రకటించడం ఆత్మహత్యా సదృశ్యమవుతుందన్నారు. న్యాయవ్యవస్థ అనేది పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల ఆత్మాభిమానాలను కాపాడే విధంగా ఉండాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును కచ్చితంగా సమీక్షించవలసిందేనన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జేఏసీ నాయకులు కరిపెడ సుదర్శనం, సుఖభోగి రాము, బల్లెం చిరంజీవి, సి.హెచ్. ప్రభాకర్, జంగం కిరణ్, వేము మోహనరావు, దానయ్య, కామా శ్యాంసన్, వసంత్, శంకర్, రాజ్‌కుమార్, వెంకటరత్నం, నాగేంద్రబాబు, పిల్లి సురేశ్, డీపీ రావు పాల్గొన్నారు.

మహిళా మావోయిస్టు హత్య

మృతదేహం వద్ద లేఖను పెట్టిన మావోయిస్టులు

నవతెలంగాణ- చెర్ల



ఓ మహిళా మావోయిస్టు విప్లవ ద్రోహిగా మారిందని, దీంతో ప్రజా కోర్టులో శిక్ష విధించి మేమే చంపామని, మృతదేహం వద్ద ఓ లేఖను మావోయిస్టులు విడిచి పెట్టారు. ఈ ఘటన చర్ల మండలంలోని చెన్నాపురం గ్రామ శివారులో బుధవారం జరిగింది. మృతదేహం వద్ద మావోయిస్టు పార్టీ ఆంధ్ర -ఒడిషా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరుతో లేఖ విడుదల చేశారు. హైదరాబాద్‌లోని బాలాజీ నగర్‌కు చెందిన బంటి బాలయ్య, బాలమ్మల కుమార్తె బంటి నీల్సో అలియాస్ రాధ డీఎంఎల్టీ చదివి 2018లో మావోయిస్టు పార్టీ ఏఓబీలో చేరింది. అంచెలంచెలుగా ఎదిగి రక్షణ కమాండర్‌గా పని చేస్తోంది. నీల్సో పార్టీ పద్ధతులకు లోబడకుండా వ్యక్తిగత స్వేచ్ఛ కోసం క్రమశిక్షణారాహిత్యంతో మెలగుతూ వచ్చిన సమయంలో ఆమెను కమాండర్ స్థాయి నుంచి పార్టీ సస్పెండ్ చేసిందని ఆ లేఖలో మావోయిస్టులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులపై పోలీసులు ఒత్తిడి తేవడంతో పోలీసులకు కోవర్టుగా పని చేస్తున్నట్లు గుర్తించామని, ప్రజా కోర్టులో హాజరు పరిచి విచారణ జరిపి అనంతరం మెడకు ఉరి బిగించి హత్య చేసినట్లు పేర్కొన్నారు. శత్రువు కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతుక దాడిని ఓడించాలని, విప్లవ ఉద్యమాన్ని రక్షించుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న చర్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చర్ల ఆస్పత్రికి తరలించారు. సీఐ రాజువర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్నది

- **సీపీఐ నిర్మాణ కౌన్సిల్లో కూనంనేని, పువ్వాడ**

నవతెలంగాణ-ఖమ్మం

పాలకుల పోకడలు అనుసరిస్తున్న విధానాల నేపథ్యంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టు వ్యతిరేకులు సైతం కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారని బాధితుడు, పేద, మధ్యతరగతి ప్రజలు కమ్యూనిస్టుల బలోపేతాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. సిపిఐ ఖమ్మం జిల్లా సమితి నిర్మాణ కౌన్సిల్ సమావేశం బుధవారం ఖమ్మంలోని గిరిప్రసాద్భవన్లో నిర్వహించారు. తొలుత అరుణ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. బిజి.క్లైమెంట్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. ప్రజలే కేంద్రంగా సిద్ధాంతం ఆవిర్భవించిందని, సోషలిజానికి మరో ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. రుణమాఫీ నూటికి నూరు శాతం అమలు కాకపోవడానికి కారాణాలను అన్వేషించి పరిష్కార మార్గం చూపాలన్నారు. వరంగల్లో ఈనెల 22 నుంచి 24 వరకు రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు జరుగనున్నాయని, ఈ సమావేశాలలో రాష్ట్ర, జాతీయ అంశాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా పాల్గొన్నారు.

నిజాయతీ, నిబద్ధతకు మారుపేరు సిద్ధి
వర్ధంతిసభలో పువ్వాడ

నిజాయతీ నిబద్ధతకు దివంగత సీపీఐ నేత సిద్ధి వెంకటేశ్వర్లు మారు పేరుగా నిలిచారని ఆ పార్టీ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థి దశ నుంచి రాష్ట్ర సహాయ కార్యదర్శి అంచలంచెలుగా ఎదిగిన సిద్ధి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేవారని ఆయన సేవలను కొనియాడారు. వెంకటేశ్వర్లు ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో సిద్ధి చిత్రపటానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఎస్‌కే. జానిమియా, యర్రాబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు వితరణ


నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని చింతపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి పగిళ్ల విజయ్ కుమార్ తమ తాత, నానమ్మ పగిళ్ల బసవయ్య, గంగమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు బుధవారం బూట్లు, సాక్స్ లను వితరణగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆదుకోవాడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్, పాఠశాల సిబ్బంది శ్రీనివాస్, భారతి, రాధ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-కరకగూడెం

మండల పర్యటనలో భాగంగా కొత్తగూడెం, చొప్పల, తుమ్మలగూడెం, అనంతారం, పద్మపురం గ్రామ పంచాయతీలలో అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. గ్రామలలో నీటి సరఫరా, కరెంటు సమస్య, ఇరిగేషన్ ఇలా అన్ని సమస్యలను అధికారుల దృష్టిలోకి తెచ్చి వారం రోజుల్లో పరిష్కారం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఎలాంటి అలసత్వం వహించకుండా,ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ప్రజల మధ్యన ఉంటూ సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని, వారికి దిశానిర్దేశం చేశారు. మండల వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా అధికారులను ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని అన్నారు. చొప్పాలా గ్రామపంచాయతీ పరిధిలో 19 లక్షలు, తుమ్మలగూడెం, అనంతారం, పద్మాపురం గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 21 లక్షలతో అంచనా వ్యయంతో నిర్మించిన 7 సీసీ రోడ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే పర్యటనకు బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ నాగ ప్రసాద్, ఇన్‌చార్జీ ఎంపీడీవో దేవ వర కుమార్, విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ దినేష్ కుమార్, ఇరిగేషన్ ఏఈ సక్రు, ఎంఈఓ, టీపీసీసీ సభ్యులు డా.చందా సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సీనియర్ నాయకురాలు పోలేబోయిన శ్రీవాణి, నాయకులు పోలుబోయిన తిరుపతయ్య, ఎర్ర సురేష్, తొలెం నాగేశ్వరరావు, గొగ్గాలి రవి, జలగం కృష్ణ, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు చేపట్టాలి

- ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలి : టీఎంటీఎస్‌టీఎఫ్ నిరాహారదీక్షలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను వెంటనే చేపట్టాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్(టీఎంటీఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పదకొండేండ్లుగా బదిలీలు, పదోన్నతులు కల్పించలేదని గుర్తు చేశారు. ఈ క్రమంలో 30 మంది ఉపాధ్యాయులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన టీచర్ల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీలతో పాటు నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలనీ, 010 పద్దుకింద వేతనాలు చెల్లించాలనీ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రారంభంలో మోడల్ స్కూళ్లల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు పోటీ పడేవారనీ, ప్రస్తుతం అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులు తిరిగే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల కాలంలో మోడల్ స్కూల్ వ్యవస్థను గత సర్కార్ నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్ర చరిత్రలో మొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను చేపట్టిందని పేర్కొన్నారు. అదే తరహాలో మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టులో ఉన్న కేసుపై సీఎం చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావరవి, ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు ప్రకాష్, టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము రమేశ్ తదితరులు నిరాహార దీక్షలో పాల్గొని తమ సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కొండయ్య, ఎస్.మహేష్, రాంప్రసాద్, శోభారాణి, క్రాంతి కుమార్, సాత్విక్ నాగరాజు, అశోక్, రాధాకృష్ణ, సురేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

21 నకిలీ వర్సిటీలు

న్యూఢిల్లీ : గతేడాది దేశవ్యాప్తంగా 20 నకిలీ యూనివర్సిటీలు ఉండగా.. 2024 మే నాటికి ఈ యూనివర్సిటీల సంఖ్య 21కి చేరింది. ఈ నకిలీ వర్సిటీలకు డిగ్రీలు ప్రదానం చేసే అధికారం లేదని గతంలోనే యూజీసీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. యూజీసీ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ యూనివర్సిటీలు ప్రదానం చేసే డిగ్రీలను ఉన్నత విద్య, ఉద్యోగ ప్రయోజనాల కోసం గుర్తించబోమని.. ఆ డిగ్రీలు చెల్లుబాటు కావని యూజీసీ ఇప్పటికే తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో కాకుమానివారి తోటలో క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ విశాఖలోని బైబిల్ ఓపెన్ యూనివర్శిటీ ఆఫ్ ఇండియాను నకిలీవిగా యూజీసీ ప్రకటించింది.

దేశ వ్యాప్తంగా 21 యూనివర్సిటీలు నకిలీవిగా ఉన్నట్టు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇలాంటి వర్సిటీలు ఢిల్లీలో అత్యధికంగా ఎనిమిది ఉండగా.. యూపీలో నాలుగు, ఏపీ, బెంగాల్, కేరళలో రెండు చొప్పున, కర్నాటక, మహారాష్ట్ర, పుదుచ్చేరిలలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నట్టు తెలిపింది.

ఢిల్లీలో ఎనిమిది నకిలీ యూనివర్సిటీలు

1. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్ (ఏఐఐపీహెచ్ఎస్)
2. కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్- దర్యాగంజ్
3. యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ
4. వొకేషనల్ యూనివర్సిటీ
5. ఏడీఆర్ - సెంట్రిక్ జ్యూరిడికల్ యూనివర్సిటీ
6. ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్
7. విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్‌బీ
8. ఆధ్యాత్మిక్ విశ్వవిద్యాలయ (ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం)

ఉత్తరప్రదేశ్‌లో నాలుగు ..

1. గాంధీ హిందీ విద్యాపీఠ్, ప్రయాగ్‌రాజ్
2. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూనివర్సిటీ (ఓపెన్ యూనివర్సిటీ)
3. భారతీయ శిక్షా పరిషత్
4. మహామయ టెక్నికల్ యూనివర్సిటీ

పశ్చిమ బెంగాల్‌లో రెండు..

1. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్
2. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ అండ్ రీసెర్చ్

కేరళలో రెండు..

1. సెయింట్ జాన్స్ యూనివర్సిటీ (కేరళ)
2. ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ ప్రొఫెటిక్ మెడిసిన్ (ఐఐయూపీఎం)
3. బదగాన్వి సర్కార్ వరల్డ్ ఓపెన్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ సొసైటీ (కర్నాటక)
4. రాజా అరబిక్ యూనివర్సిటీ (మహారాష్ట్ర)
5. శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (పుదుచ్చేరి)

మహిళలపై ఘోరాలు

న్యూఢిల్లీ : కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలి ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతుంటే... మహిళలపై నేరాలు, ఘోరాలకు సంబంధించి 151 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కేసులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) తెలిపింది. అందులో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ అధిక మంది నేతలు ఈ తరహా కేసులు ఎదుర్కొంటున్నట్టు వెల్లడించింది. 2019 నుంచి 2024 మధ్య ఎన్నికల కమిషన్‌కు ఎంపీలు, ఎమ్మెల్యేలు సమర్పించిన 4809 అఫిడవిట్లలో 4,693ను విశ్లేషించి ఈ నివేదిక రూపొందించినట్లు ఏడీఆర్ పేర్కొంది. 16 మంది ఎంపీలు, 135 మంది ఎమ్మెల్యేలు మహిళలపై నేరాలకు పాల్పడిన కేసులను ఎదుర్కొంటున్నట్టు తెలిపింది.

మహిళలపై నేరాలకు పాల్పడిన ఎమ్మెల్యేలు, ఎంపీలు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచే 25 మంది ఉన్నారని తెలిపింది. తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ నుంచి 21 మంది, ఒడిశా నుంచి 17 మంది ఉన్నారని పేర్కొంది. 16 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు లైంగికదాడి కేసులు ఎదుర్కొంటున్నారని, వీరిపై నేరాలు రుజువైతే పదేండ్లు లేదా జీవిత కారాగారం పడే అవకాశం ఉందని ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది.

అత్యధికంగా 54 మంది బీజేపీ నేతలు ఈ కేసులు ఎదుర్కొంటుండగా.. 24 మంది కాంగ్రెస్ నేతలు ఉండడం గమనార్హం. వీరిపై కేసులకు సంబంధించి ఫాస్ట్ ట్రాక్ విచారణ జరగాలని ఏడీఆర్ కోరింది. అలాగే ఈ నేరాలు ఎదుర్కొంటున్న నేతలను దూరం పెట్టాలని ఓటర్లకు విజ్ఞప్తి చేసింది.

నాలాలన్నీ కూలగొట్టి పామ్ హౌస్ నిర్మిస్తావా?

- అది నాది కాదు...లీజుకు తీసుకున్నట్టు బుకాయిస్తావా? : కేటీఆర్‌పై మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నాలాలన్నీ కూలగొట్టి జన్వాడలో పామ్ హౌస్ నిర్మిస్తావా? అది నాది కాదు...లీజుకు తీసుకున్నట్టు బుకాయిస్తావా? అంటూ మాజీ మంత్రి కేటీఆర్‌పై టీపీసీసీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు బెల్లయ్యనాయక్, బండ్రు శోభారాణితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేటీఆర్‌కు పౌరుషముంటే వెంటనే పామ్ హౌస్‌ను కూలగొట్టాలని సవాల్ విసిరారు. ఎఫ్‌టీఎల్‌లో ఏ నిర్మాణాలు ఉన్న వాటిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా ఏర్పాటు చేసి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

షరతుల్లేకుండా రుణమాఫీ అమలు చేయాలి

- రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలి
- కౌలు రైతుకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలి
- రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం), ప్రజాసంఘాలు, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు
- నిజామాబాద్‌లో రైతుల అరెస్ట్



నవతెలంగాణ -కూసుమంచి/విలేకరులు

కొర్రీలు పెట్టకుండా రూ.2 లక్షల వరకు రుణం తీసుకున్న ప్రతి రైతులకూ రుణమాఫీ చేయాలని, అదే విధంగా రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం పలు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్, వ్యవసాయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలో యడవల్లి పద్మారెడ్డి భవనం నుంచి ఖమ్మం-సూర్యాపేట రహదారిపై నిరసన తెలిపిన అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. అనంతరం తహసీల్దార్ సురేష్ కుమార్, వ్యవసాయ అధికారి వాణికి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ మాట్లాడుతూ.. మండలంలో సుమారు 18 వేల మంది పట్టాదారు రైతులుండగా, వారిలో సగం మందికి కూడా రుణమాఫీ అమలు కాలేదన్నారు. రుణమాఫీ కానీ రైతుల్లో సన్న, చిన్న కారు రైతులే అధికంగా ఉన్నారని, వారంతా వ్యవసాయ పనులు వదిలిపెట్టుకొని మరీ బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన హామీనిచ్చి అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగంగానే కౌలు రైతులకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని, రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు శీలం గురుమూర్తి, తోటకూరి రాజు, మాజీ జెడ్పీటీసీ ఎర్రబోయిన భారతి, రైతు సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మూడు గన్యనాయక్, చిట్టూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎండీ గఫూర్ పాషా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో 161వ జాతీయ రహదారిపై పార్టీలకతీతంగా రైతులు రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. రుణమాఫీ కాని వారి వివరాలు అందజేయాలని కోరారు. అయినా రైతులు వినిపించుకోకపోవడంతో పోలీసులు వచ్చి రైతులను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో రుణమాఫీ కానీ రైతులు చేపట్టిన ఆందోళనకు ఎర్రబెల్లి దయాకర్‌రావు మద్దతు పలికి ధర్నాలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రుణమాఫీ పథకాన్ని సమగ్రంగా అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రైతాంగం పూర్తిగా చిన్నాభిన్నమైందన్నారు. అనంతరం స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ తోట ప్రవీణ్‌ను కలిసి, రుణమాఫీ విషయంలో రైతులను ఇబ్బందులు గురిచేయొద్దని కోరారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరులో కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారిపై రైతులతో కలిసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రోడ్డుమీదనే పడుకొని నిరసన తెలిపారు. రవిశంకర్ సహా ఆందోళన చేస్తున్న రైతులను, బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, దొంగ హామీలతో గద్దెనెక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'దివీస్'పై చర్యలు తీసుకోండి..

- బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్

కలెక్టర్‌కు వినతిపత్రం



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

దివీస్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం, ఆరెగూడెం గ్రామానికి చెందిన బాధిత రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేసి, దివీస్ కంపెనీ వల్ల రైతులకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. వ్యర్థ రసాయనాలతో వస్తున్న బోరు నీళ్లను కలెక్టర్‌కు చూపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు రావాలని కలెక్టర్‌ను కోరగా.. కలెక్టర్ స్పందించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా లక్షల రూపాయల విలువ చేసే పంటలను, పశు సంపదను రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దివీస్ కంపెనీ ఆవరణలోనే బోర్ వెల్స్ ద్వారా సుమారు 150 బోర్లను వందలాది అడుగుల్లోతు వేయించి వాటిల్లోకి కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను పంపడంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని చెప్పారు. అది పంట నష్టం, ప్రాణ నష్టానికి కారణం అవుతోందని తెలిపారు. వ్యర్థ రసాయనాల వల్ల పంటలు మాడి మసైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పశువులు ఈ నీళ్లను తాగడం వల్ల చనిపోతున్నాయని చెప్పారు. పశువులకు నీళు తాపడానికి రైతులు ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఈ కంపెనీ వెదజల్లే విషవాయువులను, వ్యర్థ రసాయనాలను ఆపడానికి సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు, పశు పోషణ కరువై రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. బాధిత రైతులకు ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన సీపీఐ(ఎం) పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, రైతులు సామ జనార్దన్ రెడ్డి, గుండెబోయిన బాలకృష్ణ, అనంతుల రాములు, శ్రీరాముల బక్కయ్య, జిల్లల రాంరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ లబ్ది కోసమే బీఆర్ఎస్ ఆరాటం

- రూ.18 వేల కోట్లు 22 లక్షల రైతుల ఖాతాలో జమ చేశాం
- రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న బీజేపీ ప్రభుత్వం
- ఎవరెన్ని చేసినా రుణమాఫీ చేసి తీరుతాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



రైతుల ద్వారా రాజకీయాలు చేసి లబ్దిపొందాలని బీఆర్ఎస్ చూస్తుందని, వారు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా రుణమాఫీ చేసి తీరుతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగానికి లాభం చేయకపోగా నష్టపరిచే విధంగా చట్టాలు చేస్తున్న బీజేపీ.. రాష్ట్రంలో రైతుల గురించి ముసలి కన్నీరు కారుస్తుందని ఆరోపించారు. రైతులను ఆందోళన పరిచి దాని ద్వారా రాజకీయం చేయాలని చూడటం దుర్మార్గమైన ఆలోచన అని అన్నారు. రైతులకు అనేక సమస్యలు సృష్టించి, వారిని ఇబ్బందులు పెట్టిన బీఆర్ఎస్ పార్టీకి రైతుల గురించి మాట్లాడే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రానికి ఒకేసారిగా రూ.31 వేల కోట్లు మాఫీ చేయడం కష్టమయినా, చేసి చూపించమని తెలిపారు. రాష్ట్రంలో ఒకేసారి రూ.18 వేల కోట్లను 22 లక్షల రైతుల ఖాతాలో జమ చేశామని, రుణమాఫీ కానీ రైతుల సమస్యలు తీర్చేందుకు ప్రత్యేకంగా అధికారులను రైతుల వద్దకు పంపించి పరిష్కరిస్తున్నామని అన్నారు.

మాఫీ కానీ రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే లోపాలను సరిచేస్తారని తెలిపారు. తెల్లకార్డు లేకపోయినా రుణమాఫీ చేస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 41,78,892 రైతుల ఖాతాలను బ్యాంకులు ప్రభుత్వానికి పంపించాయని, రూ.31 వేల కోట్ల రుణాలు ఉన్నాయని అన్నారు.బీఆర్ఎస్ రుణమాఫీ దోపిడీ పద్ధతుల్లో జరిగిందని, అది విఫలమయినట్టు గతంలో కాగ్ నివేదిక పేర్కొన్నదని గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు ఉండాలి తప్పా.. సొంతప్రయోజనాల కోసం కాదని అన్నారు. అన్ని వ్యవస్థలనూ బీఆర్ఎస్ అవినీతిమయం చేసిందని ఆరోపించారు.

సందీప్‌ఘోష్‌కు పాలిగ్రాఫ్ పరీక్ష ?

సీబీఐ అధికారుల వెల్లడి

- మాజీ ప్రిన్సిపల్‌పై ఈడీ దర్యాప్తు చేపట్టాలి
- హైకోర్టును ఆశ్రయించిన ఆస్పత్రి మాజీ అధికారి
- వివాదాలమయం ఘోష్ వ్యక్తిగత, వృత్తి జీవితాలు

న్యూఢిల్లీ, కోల్‌కతా : ఆర్‌జీ కార్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌పై సిబిఐ అధికారులు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించే అవకాశం వుంది. జూనియర్ డాక్టర్ వైద్యురాలిపై లైంగికదాడి,హత్య జరిగిన రెండు రోజుల తర్వాత తన పదవికి రాజీనామా చేసిన ఘోష్ ఇప్పటికే అనేకసార్లు సీబీఐ ముందు హాజరయ్యారు. జరిగిన ఘటనకు సంబంధించి అనేక ప్రశ్నలను సిబిఐ సంధించింది. అయితే ఘోష్ ఇచ్చిన సమాధానాలను మరింత నిర్ధారించాల్సి వుందని సీబీఐ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. తాము అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన కొన్ని సమాధానాల్లో పొంతన లేదని అందువల్ల వాటిని ధ్రువీకరించుకోవాల్సి వుందని చెప్పారు. అందువల్లే ఆయనకు పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించే అవకాశాల గురించి యోచిస్తున్నామని చెప్పారు. గత కొద్ది రోజులుగా సీబీఐ అధికారులు ఘోష్‌ను వివిధ రకాల ప్రశ్నలు అడిగారు. డాక్టర్ మృతి వార్త తెలిసిన తర్వాత ఆయన వ్యవహరించిన తీరు, పోషించిన పాత్రను ప్రశ్నించారు. తమ కుమార్తె మృత దేహాన్ని చూసేందుకు ఆ తల్లిదండ్రులను మూడు గంటలకు పైగా వేచి వుంచాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలని కోరారు. పైగా సంఘటన జరిగిన వెంటనే సెమినార్ హాల్‌కు ఆనుకుని వున్న గదులకు మరమ్మత్తులు చేసేందుకు అనుమతి ఇవ్వడాన్ని కూడా వారు ప్రశ్నించారు. అంత హడావిడిగా చేయాల్సిన అవసరమేమొచ్చిందని అడిగారు.

ఘోష్‌పై ఈడీ దర్యాప్తు చేపట్టాలి

ఆర్‌జీ కార్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ పాల్పడిన ఆర్థిక అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో దర్యాప్తు జరగాలని కోరుతూ అదే ఆస్పత్రిలో గతేడాదివరకు పనిచేసిన మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్, ప్రస్తుతం ముర్షిదాబాద్ డిప్యూటీ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా వున్న అక్తర్ అలీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై పిటిషన్ దాఖలు చేసేందుకు జస్టిస్ రాజర్షి భరద్వాజ్, అలీకి అనుమతి మంజూరు చేశారు.

డాక్టర్ ఘోష్ పాల్పడిన అనేక అవకతవకలపై 2023లోనే పశ్చిమ బెంగాల్ అధికారులకు ఫిర్యాదు చేశానని అలీ ఇంతకుముందే చెప్పారు. ఈ ఆరోపణలపై తాజాగా ఏర్పడిన సిట్ ఇటీవల అక్తర్‌ను విచారించింది. ఆయన చేసిన ఫిర్యాదుల ఆధారంగానే ఘోష్‌పై ఎఫ్ఆర్ నమోదైంది. సందీప్ ఘోష్ వ్యక్తిగత, వృత్తి జీవితాలు రెండూ వివాదాస్పదమేనని అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రిలో అనాథ శవాలను విక్రయించడం, సెలైన్ బాటిళ్ల, సిరంజ్‌లు వంటి వాడి పారేసిన ఆస్పత్రి సామగ్రిని రీ సైక్లింగ్ చేయించడం వంటి ఆరోపణలను ఆయన ఎదుర్కొంటున్నారు.

తరచూ భార్యపై కూడా అమానుషంగా ప్రవర్తించే వాడని ఆరోపణలు వున్నాయి. సిజేరియన్‌తో బిడ్డకు జన్మనిచ్చిన భార్యపై 14రోజుల వ్యవధిలోనే దారుణంగా దాడికి దిగాడని ఇరుగు, పొరుగువారు చెబుతున్నారు. ఇంటి చుట్టుపక్కల వారితో కూడా సక్రమ సంబంధాలు లేవని తెలుస్తోంది.

సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణలో ఆర్‌జీ కార్ ఆస్పత్రి

ఆర్‌జీకార్ ఆస్పత్రిలో సీఐఎస్ఎఫ్ బలగాలను మోహరించాల్సిందిగా కోరుతూ పశ్చిమ బెంగాల్ చీఫ్ సెక్రెటరీకి కేంద్ర హోం శాఖ లేఖ రాసింది. సుప్రీం ఆదేశాల నేపథ్యంలో ఈ లేఖ వెలువడింది. డిఐజి ర్యాంక్ అధికారి నేతృత్వంలో సీఐఎస్ఎఫ్ బృందం బుధవారం ఉదయం ఆస్పత్రి సముదాయాన్ని సర్వే చేసింది. పోలీసు, ఆస్పత్రి అధికారులతో సీఐఎస్ఎఫ్ డీఐజీ సమావేశాన్ని కూడా నిర్వహించారు. కోర్టు ఆదేశాల పట్ల ఆందోళన జరుపుతున్న డాక్టర్లు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బెంగాల్‌వ్యాప్తంగా నిరసనలు

పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా వివిధ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులకు చెందిన జూనియర్ డాక్టర్లు బుధవారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. పనిప్రదేశాల్లో తమకు భద్రత పెంచాలని కోరారు. పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ ఈ ర్యాలీని నిర్వహించింది. వి వాంట్ జస్టిస్ అనే బ్యానర్ కింద ఈ ర్యాలీలు జరిగాయి. దాదాపు నాలుగు కిలోమీటర్ల మేరా ర్యాలీ సాగింది.

దీంతో రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలు తీవ్రంగా ప్రభావిత మవుతున్నాయి. ఇప్పటికి 13 రోజులుగా దేశవ్యాప్తంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది నిరసనలు, ఆందోళనలు కొనసాగుతునే వున్నాయి.

సెప్టెంబరు 4కి వాయిదా

ఆర్‌జీకార్ ఆస్పత్రిలో జరిగిన జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య తదనంతరం ఆస్పత్రిపై దుండగులు జరిపిన విధ్వంసానికి సంబంధించి దాఖలైన పలు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాల సంయుక్త విచారణను కలకత్తా హైకోర్టు సెప్టెంబరు 4కి వాయిదా వేసింది. కాగా ఆస్పత్రిలో విధ్వంసానికి సంబంధించిన కేసులో ముగ్గురు పోలీసు అధికారులను కోల్‌కతా పోలీసులు సస్పెండ్ చేశారు.



కాలుష్య జలాలతో చేపలు మృత్యువాత

- సంగారెడ్డి జిల్లా మహబూబ్‌సాగర్ చెరువులో ఘటన
- పరిశీలించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి

కాలుష్య జలాల వల్ల సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. బుధవారం ఉదయం చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లిన మత్స్యకారులు నీటిపై తేలియాడిన చేపలను చూసి కన్నీరు మున్నీరయ్యారు. తమను ఆదుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి సమాచారం అందించారు. దీంతో ఇరిగేషన్, మత్స్యశాఖ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి జగ్గారెడ్డి చెరువును పరిశీలించారు. నీటి కాలుష్యం వల్లే చేపలు చనిపోయినట్టు అధికారులు నిర్ధారించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌సాగర్‌లో చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్న కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నీటి కాలుష్యం వల్లే చేపలు మృత్యువాతపడ్డాయని, చెరువులో పెద్దఎత్తున గుర్రపు డెక్క ఉందని అన్నారు. దాన్ని తొలగించాలంటే మహబూబ్‌సాగర్ పూడికతీత ఒక్కటే మార్గమని ఇందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను కలిసి చెరువు పూడికతీతకు నిధులు కేటాయించాలని కోరుతానని తెలిపారు. అధికారులు మహబూబ్‌సాగర్‌లోకి సంగారెడ్డి పట్టణ డ్రయినేజీ నీరు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, పూర్తిగా మహబూబ్‌సాగర్‌ను ఖాళీ చేసి పూడిక తీయాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, మున్సిపల్ డీఈ ఇంతియాజ్, మత్స్యశాఖ అధికారులు, సంఘం అధ్యక్షులు ఎం.నగేష్, ప్రధాన కార్యదర్శి కూన చిదంబరం సాయి, నాయకులు కూన సంతోష్ వెంకట్ రాజు, నరసింహా రాజు, వంశీ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేపపిల్లల సరఫరాలో అవకతవకలు నిర్మూలించాలి

- ప్రభుత్వానికి టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర కమిటీ వినతి


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఉచిత చేపపిల్లల సరఫరాలో అవకతవకలను నిర్మూలించి మత్స్యకారులకు న్యాయం చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోరెంకల నరసింహ, లెల్లెల బాలకృష్ణ నేతృత్వంలోని బృందం మత్స్యశాఖ కమిషనర్, ప్రియాంక అలా, ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించింది. పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలంటే టెండర్ల ప్రక్రియను రద్దు చేసి మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలని కోరారు. రాష్ట్ర డిమాండ్‌కు సరిపడా చేప పిల్లలు సరఫరా చేసే సామర్థ్యం లేని వారు తాజాగా చేపట్టిన టెండర్లలో పాల్గొన్నారనీ, ఫలితంగా అనేక అవినీతి అక్రమాలు జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే నాణ్యమైన 3 అంగుళాల చేప పిల్లలు సరఫరా చేయాలనీ, లేదంటే ప్రతి మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముఠా విజయ్ కుమార్, చెనమోని శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ముఠా దశరథ్, రంగారెడ్డి జిల్లా నాయకులు పూల గాజుల జంగయ్య, చెక్క లలిత తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం చేస్తూ గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



వ్యాయామం చేస్తుండగా గుండెపోటుతో ఏఎస్ఐ మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ నగరంలోని 1వ టౌన్ ఏఎస్ఐ దత్త్రాత్రి (56) గాయత్రినగర్‌లోని తన ఇంట్లో రోజు వారి దినచర్యలో భాగంగా బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో వ్యాయామం చేస్తున్నారు. ఈ క్రమంలో హఠాత్తుగా గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలపోయారు. గమనించిన కుటుంబీకులు ఆందోళనకు గురై.. వెంటనే ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దత్త్రాత్రి అంతకు ముందు బోధన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. పదోన్నతిలో భాగంగా రెండు సంవత్సరాలుగా నిజామాబాద్ ఒకటవ టౌన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఏఎస్ఐ మృతి విషయం తెలుసుకున్న తోటి పోలీస్ సిబ్బంది షాక్‌కు గురయ్యారు. సంతాపం ప్రకటించారు.

నవతెలంగాణ
మానవి
గురువారం 22 ఆగస్టు 2024
www.navatelangana.com
ఖమ్మం

సంపూర్ణ భోజనం అంటే అందులో కూర, పప్పు, పచ్చడితో పాటు కారప్పొడి కూడా ఉండాలి. పల్లీలు, నువ్వులు, అవిసె గింజలు, వెల్లుల్లి, కరివేపాకు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని వివిధ రూపాల్లో మన రోజువారీ ఆహారంలో చేర్చుకోవచ్చు. వీటితో పొడులు చేసుకుంటే ఎంతో రుచిగా ఉంటాయి. ఇడ్లీ, దోసె వంటి టిఫిన్లకు అప్పటి కప్పుడు పచ్చడి చేయలేకపోయినా.. ఈ పొడులు రుచితోపాటు, ఆరోగ్యాన్నీ అందిస్తాయి. అలాంటి కారప్పొడులు ఎలా చేయాలో ఈ రోజు నేర్చుకుందాం...

కారం కారంగా...



మానసిక ఆరోగ్యం కోసం...

మన దేశంలో శారీరక ఆరోగ్యంపై చూపించేంత శ్రద్ధ మానసిక ఆరోగ్యంపై చూపించరు. సాధారణంగా మానసిక సమస్యల్ని తేలిగ్గా తీసుకుంటాం. కానీ.. మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే.. శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటామని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందుకే మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు.



బలాలను గుర్తించండి: మానసికంగా బలంగా ఉండేందుకు మీ బలాలను గుర్తించండి. మీరు సాధించాల్సిన గొప్ప విషయాల్ని తలచుకోండి. నిరాశ చెందొద్దు. ప్రపంచంలో గొప్ప విజయాలన్నీ ఒక్కసారే రాలేదనీ, కొన్ని ప్రయత్నాల తర్వాతే వచ్చాయనే విషయాన్ని గుర్తించండి.

విజయాలను రాసుకోండి: డైరీ రాసే అలవాటు ఉంటే మంచిదే. మీరు సాధించే విజయాలను అందులో రాయవచ్చు. మీ పట్ల పాజిటివ్‌గా జరిగే అంశాలనూ రాసుకోవచ్చు. అలాగే మంచి సందర్భాలను ఫొటోలు తీసుకొని.. వాటిని తరచూ చూడటం ద్వారా మానసిక ఆరోగ్యం పెరుగుతుంది.

అంతా మంచికే: ఇది ఇలాగే జరగాలి అనుకుంటే అన్నిసార్లూ జరగకపోవచ్చు. నెక్స్ట్ ఏం జరుగుతుందో మన చేతుల్లో ఉండదు. కాబట్టి.. జరిగేది జరగనివ్వాలి. దాన్ని మీరు ఆమోదించడం అలవాటు చేసుకోవాలి. మీ ప్రయత్నాలను సాగిస్తూనే రాజీ పడేందుకు కూడా సిద్ధపడితే నిరాశ అనేదే ఉండదని నిపుణులు చెబుతున్నారు.

టూర్‌లకు వెళ్లండి : ఎప్పుడూ అదే పని, రొటీన్ లైఫ్‌స్టైల్ ఉంటే జీవితం బోర్ కొట్టేస్తుంది. కాబట్టి, అప్పుడప్పుడూ పర్యాటక ప్రదేశాలకూ, ఇష్టమైన కొత్త ప్రదేశాలకూ వెళ్లాలి. తద్వారా మీలో కొత్త ఉత్సాహం వస్తుంది. ■

నువ్వుల పొడి...

నువ్వుల పొడి ఒకప్పుడు కచ్చితంగా ప్రతిరోజూ తినే ఆహారంలో భాగంగా ఉండేది. కానీ ఇప్పుడు నువ్వుల వాడకం చాలా వరకు తగ్గిపోయింది. నువ్వులను వేయించి పొడిచేసి ఒకసారి దాచుకుంటే... కొన్ని నెలల పాటు వినియోగించుకోవచ్చు. ముఖ్యంగా మహిళలు కచ్చితంగా తినాల్సిన ఆహారాలలో నువ్వులు కూడా ఒకటి. రోజువారీ భోజనంలో రెండు ముద్దలు నువ్వుల పొడితో కలుపుకొని తినండి. మీకున్న నెలసరి సమస్యలు తొలగిపోతాయి.



కావలసిన పదార్థాలు : నువ్వులు - ఒక కప్పు, ఎండుమిర్చి - ఎనిమిది, ఉప్పు - రుచికి సరిపడా, కరివేపాకు - గుప్పెడు, ధనియాలు - ఒక స్పూను, జీలకర్ర - ఒక స్పూను, వెల్లుల్లి రెబ్బల - గుప్పెడు

తయారీ విధానం : ముందుగా స్టవ్ మీద కళాయి పెట్టి నువ్వులు వేసి వేయించుకోవాలి. వాటిని ఓ ప్లేట్‌లో వేసి చల్లారనివ్వాలి. అదే కళాయిలో ఎండుమిర్చి, ధనియాలు, జీలకర్రను వేసి వేయించుకోవాలి. తర్వాత స్టవ్ కట్టేయండి. ఇప్పుడు మిక్సీ జార్లో నువ్వులు, వేయించుకున్న ఎండుమిర్చి, జీలకర్ర, ధనియాలను వేసి మరీ మెత్తగా కాకుండా కొంచెం బరకగా పొడి చేసుకోవాలి. అందులో గుప్పెడు వెల్లుల్లి రెబ్బలు కూడా వేసి పొడి చేస్తే మంచి రుచి వస్తుంది. రుచికి సరిపడా ఉప్పుని కూడా వేసుకోవాలి. గాలి చొరబడని సీసాలో ఈ మొత్తం మిశ్రమాన్ని వేసి మూత పెట్టుకోవాలి. గాలికి వదిలేస్తే ఇది త్వరగా పాడైపోయే అవకాశం ఉంది. వేడి వేడి అన్నంలో నెయ్యి, ఈ పొడి వేసుకొని తింటే ఆ రుచే వేరు.

కరివేపాకు.. వెల్లుల్లితో

కరివేపాకు, వెల్లుల్లి ఈ రెండూ మన వంట గదిలో అందరికీ అందుబాటులో ఉండేవే. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ రెండింటి కాంబినేషన్‌లో చేసే కారం పొడి చాలా టేస్టీగా ఉంటుంది. అన్నం, టిఫిన్‌లోకి ఎంతో రుచిగా ఉంటుంది. అందులోనూ వర్షాకాలంలో ఈ పొడి ఇమ్యూనిటీని కూడా పెంచుతుంది.

కావలసిన పదార్థాలు : వెల్లుల్లి రెబ్బలు - 15, కరివేపాకు - రెండు గుప్పిళ్లు, నూనె - ఒక స్పూన్, శనగ పప్పు - ఒక స్పూను, ధనియాలు - నాలుగు టీ స్పూన్లు, మినపప్పు - రెండు స్పూన్లు, జీలకర్ర - అర టీ స్పూన్, మెంతులు - చిటికెడు, ఎండుమిర్చి - 15, ఉప్పు - రుచికి సరిపడ, చింత పండు - చిన్న నిమ్మకాయంత సైజు.

తయారీ విధానం: ముందుగా కరివేపాకును శుభ్రంగా కడిగి.. తడి లేకుండా ఆర బెట్టుకోవాలి. ఆ తర్వాత ఒక కళాయిలో నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడెయ్యాక శనగ పప్పు, మెంతులు, మినపప్పు వేసి చిన్న మంట మీద వేయించాలి. ఇవి కొద్దిగా వేగిన తర్వాత జీలకర్ర, ధనియాలు వేసి వేయించుకోవాలి. తర్వాత ఎండు మిర్చి వేసి వేయించాలి. ఇవి వేగిన తర్వాత కరివేపాకు వేసి వేయించి.. పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత కరివే పాకును కరకర లాడేంత వరకు వేయించి.. స్టవ్ ఆఫ్ వేసి చల్లారనివ్వాలి. వీటన్నింటినీ ఓ మిక్సీ జార్‌లోకి తీసుకోవాలి. ఇందులో చింత పండు, ఉప్పు వేసి మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఆ తర్వాత వెల్లుల్లి రెబ్బలు కూడా వేసి మరోసారి మిక్సీ తిప్పాలి. ఇదంతా కలిసేలా చేత్తో కలుపుకుని ఓ గాజు సీసాలో భద్ర పరుచుకోవాలి. అంతే ఎంతో రుచిగా ఉండే కరివేపాకు, వెల్లుల్లి కారం రెడీ. ఈ కారం నెల రోజుల పాటు నిల్వ ఉంటుంది.



పల్లీలతో...

ఇడ్లీలు.. చట్నీతో కంటే కారంపొడితో ఇష్టపడే వారి సంఖ్య ఎక్కువే. అలాగే దోశెల పైన కారంపొడిని చల్లుకుంటే ఆ రుచే వేరు.

కావలసిన పదార్థాలు : పల్లీలు - ఒక కప్పు, ఎండుమిర్చి - 15, ధనియాలు - ఒక స్పూను, వెల్లుల్లి రెబ్బలు - 15, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - రెండు స్పూన్లు, జీలకర్ర- అర స్పూను.

తయారీ విధానం : స్టవ్ మీద కళాయి పెట్టి పల్లీలను వేయించుకోవాలి. వాటిని తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు అదే కళాయిలో నూనె వేసి ఎండుమిర్చి, జీలకర్ర, ధనియాలు వేయించుకోవాలి. వీటిని బాగా వేయించాక స్టవ్ కట్టేయాలి. వీటన్నింటిని ఒక మిక్సీ జార్లో వేసి పొడిలా చేసుకోవాలి. అలాగే వెల్లుల్లి రెబ్బలను, ముందుగా వేయించుకున్న వేరుశెనగ పలుకులను, రుచికి సరిపడా ఉప్పును వేసి మళ్లీ మిక్సీ పట్టుకోవాలి. అంతే కారంపొడి రెడీ అయినట్టే. ఈ పొడి దాదాపు మూడు నెలలు నిల్వ ఉంటుంది. ఇడ్లీల్లోకి ఈ పొడి అదిరిపోతుంది.



వెల్లుల్లి కారం

పక్కా కొలతలతో చేస్తే దీని రుచి అదిరిపోతుంది. ఒక్కసారి చేసుకుంటే ఏడాదంతా వస్తుంది అన్నంలోకైనా, ఇడ్లీ, దోశ వంటి టిఫిన్లలోకి కూడా ఈ వెల్లుల్లి కారంపొడి టేస్టీగా ఉంటుంది.

కావలసిన పదార్థాలు : వెల్లుల్లి - 20 రెబ్బలు, ఎండుమిర్చి - 15, ధనియాలు - రెండు స్పూన్లు, జీలకర్ర - అర స్పూను, మినపప్పు - రెండు స్పూన్లు, కరివేపాకు - గుప్పెడు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - ఒక స్పూను.

తయారీ విధానం : స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక మినప్పప్పును వేసి వేయించాలి. ఆ తర్వాత ధనియాలు, జీలకర్ర కూడా వేసి వేయించాలి. అవి వేగాక ఎండుమిర్చి, కరివేపాకులు వేయించి స్టవ్ ఆఫ్ చేయాలి. ఇప్పుడు వెల్లుల్లి రెబ్బలను పొట్టుతోనే తీసుకోవాలి. మిక్సీ జార్లో వెల్లుల్లి రెబ్బలను, ఉప్పును వేసి మిక్సీ వేయాలి. ఆ తర్వాత ముందుగా వేయించి పెట్టుకున్న పదార్థాలను వేసి పొడిలా చేసుకోవాలి. అంతే వెల్లుల్లి కారప్పొడి రెడీ అయినట్టే. దీన్ని గాలి చొరబడని డబ్బాలో వేసి దాచుకుంటే ఎన్ని రోజులైనా ఉంటుంది. ఇడ్లీలోకి, వేడివేడి అన్నంలో ఎంతో రుచిగా ఉంటుంది.

అవిసె గింజలతో...

ఫ్లాక్స్‌సీడ్స్ అంటే తెలుగులో అవిసె గింజలు. వీటిని ఆహారంలో భాగం చేసుకొమ్మని వైద్యులు సిఫారసు చేస్తూ ఉంటారు. అయినా వాటిని తినేవారి సంఖ్య చాలా తక్కువ. అవిసె గింజలతో చేసిన ఆహారాలు తినడం వల్ల మన శరీరానికి కావాల్సిన ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా అందుతాయి. అలాగే దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కాబట్టి అవిసె గింజలు తినడం వల్ల అజీర్తి సమస్యలు రావు.



కావలసిన పదార్థాలు : అవిసె గింజలు - ఒక కప్పు, జీలకర్ర - అర స్పూను, చింతపండు - ఉసిరికాయ సైజులో, ఎండుమిర్చి - 20, కరివేపాకులు - గుప్పెడు, మెంతులు - పావు స్పూను, ధనియాలు - రెండు స్పూన్లు, మినపప్పు - ఒక స్పూను, శనగపప్పు - రెండు స్పూన్లు, నూనె - రెండు స్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా, వెల్లుల్లి - ఎనిమిది రెబ్బలు.

తయారీ విధానం : స్టవ్ మీద కళాయి పెట్టి అవిసె గింజలను చిన్న మంటపై కొద్దిగా వేయించుకోవాలి. వాటిని తీసి ఒక గిన్నెలో వేసుకోవాలి. అదే కళాయిలో నూనె వేసి ఎండుమిర్చి, శెనగపప్పు, మినపప్పు, ధనియాలు, మెంతులు, జీలకర్ర, చింతపండు, కరివేపాకు వేసి వేయించుకోవాలి. అన్నింటిని తీసి పక్కన పెట్టుకోండి. అవి చల్లారాక మిక్సీ జార్లో అవిసె గింజలను వేయండి. వాటిని మెత్తని పొడిలా చేసుకోవాలి. అందులోనే ఈ ఎండుమిర్చిల మిశ్రమాన్ని కూడా వేసి మెత్తగా అయ్యేదాకా మిక్సీ పట్టుకోవాలి. ఇవి మెత్తగా అయ్యాక ఉప్పును కూడా వేసి మళ్లీ మిక్సీ పట్టుకోండి. అంతే అవిసె గింజల కారప్పొడి తయారైనట్టే. దీన్ని మీరు అన్నంలోనే కాదు, ఇడ్లీ, దోశ వంటి వాటితోనూ తినొచ్చు. చాలా రుచిగా ఉంటుంది. ■

రాష్ట్రానికి కీడు జరగొద్దు

మాట తప్పిన సీఎంను క్షమించండి

లక్ష్మీనర్సింహ స్వామిని వేడుకోనున్న హరీశ్‌రావు

నేడు యాదాద్రికి మాజీ మంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రుణమాఫీకి సంబంధించి దేవుళ్లపై ఒట్టేసి మరీ ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్, ఆ ఒట్టును తీసి గట్టున పెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆయన చేష్టల వల్ల రాష్ట్రానికి కీడు జరిగే అవకాశముందని వాపోయారు. అందువల్ల సీఎంను క్షమించాలని వేడుకునేందుకు రేవంత్ ఒట్టేసిన అందరి దేవుళ్ల వద్దకు వెళుతున్నానని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా తొలుత గురువారం యాదగిరిగుట్టలోని లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించి, ప్రత్యేక పూజలు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం ఆలేరులో నిర్వహించబోయే రైతు ధర్నాలో పాల్గొంటానని వివరించారు.

హామీల సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

జె.వెంకటేష్, ఎస్వీ రమ తదితర నాయకులు శాంతియుత ధర్నా నిర్వహించేందుకు వచ్చిన వారిని అరెస్ట్ చేయడం సరికాదని పోలీసులతో వాదించారు. దీంతో వెనక్కి తగ్గిన పోలీసులు కార్యాలయం సమీపంలో కొద్ది సేపు ధర్నా చేసేందుకు అనుమతించారు. ఈలోపు మరికొన్ని జిల్లాల నుంచి వచ్చిన కార్మికులను లకిడీకాపూల్ ప్రాంతంలో అరెస్టు చేసేందుకు పోలీసులు చేసిన ప్రయత్నానికి వారు అక్కడే బైఠాయించారు. దీంతో రోడ్డుపై కిలోమీటర్ల ట్రాఫిక్ జాం కావడంతో బైఠాయించిన వారిని ధర్నాలో పాల్గొనేందుకు అనుమతించారు. దాదాపు రెండు గంటల సేపు లకిడీకాపూల్ నుంచి సచివాలయం వరకు ట్రాఫిక్ జాంలో పోలీసులు, మధ్యాహ్న భోజన కార్మికులతో నిండిపోయింది. మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్లతో కూడిన బ్యానర్లు, ప్ల కార్డులను ప్రదర్శిస్తూ డిమాండ్లను నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. అక్రమ తొలగింపులను అరికట్టాలనీ, రాజకీయ వేధింపులను ఆపాలని కోరారు. గుర్తింపు కార్డులను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. తాము ఖర్చు పెట్టిన వాటికి సంబంధించిన పెండింగ్ బిల్లులను కూడా విడుదల చేయకపోవడంతో అప్పులపాలవుతున్నామని వాపోయారు. అనంతరం ధర్నాను ఉద్దేశించి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ వారం రోజుల్లో డిమాండ్లను పరిష్కరించకుంటే ఛలో కొడంగల్ (సీఎం ఇంటికి) చేపట్టేందుకు కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. సొమ్మొకడిది సోకొకడిది అన్నట్టుగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు పెట్టిన ఆహారానికి సంబంధించిన బిల్లులు చెల్లించకుండా కార్మికులు పౌష్టికాహారాన్ని పెట్టాలని కోరుతున్నారని ఎద్దేవా చేశారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అవసరమైతే సమ్మెకు కూడా వెనుకాడేది లేదని తెలిపారు. జె.వెంకటేష్ మాట్లాడుతూ కార్మికులు బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌ను గెలిపించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎస్వీ రమ మాట్లాడుతూ డిమాండ్లు నెరవేర్చేంత వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలనీ, పథకం నిర్వహణకు గ్యాస్‌ను సబ్సిడీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

10 రోజుల్లో గ్రీన్ ఛానల్ ద్వారా పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనం : విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డి

మధ్యాహ్న భోజన కార్మికులకు 10 రోజుల్లో గ్రీన్ ఛానల్ ద్వారా పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనం కార్మికుల అకౌంట్లలో వేస్తామని హామీ ఇచ్చారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు వై.స్వప్న, ఆఫీస్ బేరర్లు ఉన్ని కృష్ణ, నర్సమ్మ, సులోచన, రాజేశ్వరి, సత్యనారాయణ, రజిత తదితరులతో పాటు 33 జిల్లాల నుంచి వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

నీకిది..నాకది

(మొదటిపేజీ తరువాయి)

పన్ను ఎగవేతదారులకు స్వర్గధామాలే.

ఆ వాదన నిలబడదు

అక్రమ నిధుల బదిలీలకు బెర్ముడా లేదా మారిషస్ దేశాల్లోని కంపెనీలు ద్వారాలు తెరుస్తున్నాయి. సెబీ చీఫ్, ఆమె భర్త ధావల్ బచ్ తన పొదుపు మొత్తాలను ఓ కంపెనీలో పెట్టుబడి పెట్టారు. ఆ కంపెనీలో వినోద్ అదానీ ప్రధాన డిపాజిటర్‌గా ఉండడం అనుమానాలకు తావిస్తోంది. భవిష్యత్ ప్రయోజనాల కోసం సమాజంలో శక్తివంతులైన వ్యక్తులతో సంబంధాలు నెలకొల్పుకునే ఉద్దేశంతో ఇలాంటి కంపెనీలో సొమ్ము మదుపు చేస్తుంటారు. కాబట్టి సెబీ చీఫ్‌గా నియమితురాలు కావడానికి ముందే మాధబి బచ్ పెట్టుబడి పెట్టారన్న వాదనకు ఇక్కడ విలువ ఉండదు. ఈ సంబంధాలు భారత్‌లో కీలక నియామకాలు పొందడానికి కూడా దోహదపడి ఉండవచ్చు. దీనిపైనా విచారణ జరగాల్సి ఉంటుంది.

రక్షణ కవచాలుగా ప్రభుత్వ పదవులు

ప్రభుత్వ లేదా ప్రయివేటు సంస్థల్లో ఉన్నత పదవులు చేపట్టాలంటే ప్రతిభ తప్పనిసరి. ఏదైనా సమస్య వస్తే దానిని పరిష్కరించి, సంస్థను కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. ముఖ్యంగా ఆర్థిక రంగానికి సంబంధించిన సంస్థల్లో నియామకాలు జరిపేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. సంస్థలకు ఛైర్‌పర్సన్లు, డైరెక్టర్లు అయ్యే వారు నమ్మకస్తులై ఉండాలి. వారిపై ఎలాంటి ఆరోపణలు, అపవాదులు ఉండకూడదు. అయితే దురదృష్టవశాత్తూ ఇవాళ అధికారుల్లో కానీ, న్యాయ వ్యవస్థలో కానీ అలాంటి వారు కన్పించడం చాలా అరుదు. ప్రస్తుత పాలకులకు అదానీ గ్రూపు కంపెనీలు అత్యంత విశ్వసనీయమైన సంస్థలు. అందుకే అవి లాభాలు తెచ్చి పెట్టే ఆస్తులు పోగేసుకుంటున్నాయి. బ్యాంక్ రుణాలను సులభంగా పొందుతున్నాయి. ఇక్కడ ముఖ్యమైన విషయమేమంటే హిండెన్‌బర్గ్ తొలి నివేదికపై విచారణే జరగలేదు. వ్యాపారులు, రాజకీయ నాయకుల మధ్య ఉండే సంబంధాల కారణంగా కొందరు కార్పొరేట్ దిగ్గజాలు ఆర్థిక సంస్థల్లో, బ్యూరోక్రసీలో కీలక పదవులు పొందుతున్నారు. ఆ పదవులే వారికి రక్షణ కవచంగా నిలుస్తున్నాయి.

పస లేని బీజేపీ ఆరోపణలు

అదానీ గ్రూప్, మాధబి బచ్ సంబంధాలపై నిష్పాక్షిక విచారణ జరపాలని, సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్లను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. హిండెన్‌బర్గ్ తాజా నివేదికను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని కూడా ప్రతిపక్షం కోరుతోంది. ఎందుకంటే గతంలో అదానీ గ్రూపుతో మాధబి బచ్‌కు సంబంధాలు ఉన్నందున సెబీ నివేదిక నిష్పాక్షికంగా ఉండదని ప్రతిపక్ష పార్టీలు వాదిస్తున్నాయి. అదానీ గ్రూపుతో తన సంబంధాలను మాధబి సుప్రీంకోర్టుకు తెలియజేయలేదు. తన నిర్దోషిత్వాన్ని కూడా నిరూపించుకోలేదు. అదానీపై, కేంద్ర నాయకత్వంతో ఆయన సంబంధాలపై వచ్చిన ఆరోపణలను పక్కదారి పట్టించేందుకు అధికార పార్టీ విశ్వ ప్రయత్నం చేస్తోంది. ప్రపంచ శక్తిగా భారత్ అవతరించకుండా విదేశీ శక్తులు, దేశంలోని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపిస్తోంది. హిండెన్‌బర్గ్, అమెరికా సంపన్నుడు జార్జ్ సొరోస్ మధ్య ఉన్న సంబంధాలను పదేపదే ప్రస్తావిస్తోంది. కానీ వాస్తవం ఏమిటి? ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లోనూ, సైనిక శక్తిలోనూ అమెరికా, చైనా కంటే మన దేశం చాలా వెనుకబడి ఉంది. సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్యం కోసం ఆ రెండు దేశాలపై మనం ఎక్కువగానే ఆధారపడుతున్నాం. చైనాను కట్టడి చేసేందుకు మన దేశంతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నెలకొల్పుకోవాలని అమెరికా కోరుకుంటోంది. అలాంటప్పుడు భారత్‌ను సొరోస్ అస్థిరపరచాలని అమెరికా ఎందుకు కోరుకుంటుంది? కాబట్టి ఆర్థిక అస్థిరత అనేది ఉంటే అది దేశంలోనే తప్ప బయట నుంచి కాదు. పాలకుల ఆశ్రిత పక్షపాతమే అస్థిరతకు దారితీస్తోంది తప్ప బీజేపీ ఆరోపిస్తున్నట్టు హిండెన్‌బర్గో లేక సొరోసో కాదని ఆర్థికవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

నాకెలాంటి ఫామ్‌హౌస్‌ల్లేవు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. జన్వాడలో తన స్నేహితుడికి సంబంధించిన ఫామ్‌హౌస్‌ను తాను లీజుకు తీసుకున్నానని ఆయన వెల్లడించారు. ఒకవేళ అది నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా, బఫర్‌జోన్‌లో ఉన్నా నిర్దంధంగా కూల్చేసుకోవచ్చని సూచించారు. తాను తప్పు చేశానని నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవచ్చని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయకుమార్ తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. తాను లీజుకు తీసుకున్న ఫామ్‌హౌస్ గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం... ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నేతలు మహేందర్‌రెడ్డి, వివేక్ లాంటి వారి నిర్మాణాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆయా ఫామ్‌హౌస్‌ల సంగతేంటని ప్రశ్నించారు. పలువురు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజభవనాలు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయంటూ ఎద్దేవా చేశారు. ముందు వాటిని కూల్చేయాలంటూ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ ఇప్పటికైనా హైడ్రా పేరుతో చేస్తున్న హైడ్రామాను ఆపాలంటూ ఆయన హితవు పలికారు. రుణమాఫీ పేరిట రేవంత్ ప్రభుత్వం రైతులను పచ్చిగా మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. పావుశాతం రుణాలను మాఫీ చేసి, వందశాతం చేసినట్టు బిల్డప్‌లు ఇస్తున్నారని దుయ్యబట్టారు. రుణమాఫీపై సీఎం ఒక మాట మాట్లాడుతుంటే, ఆయన మంత్రివర్గ సహచరులు తలోమాట మాట్లాడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. ఇదేంటని అడిగిన రైతులపై నాన్‌బెయిలబుల్ కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. రుణమాఫీ, రైతు భరోసా తదితరాంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఎం... బజారు భాషను ఉపయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఉచ్చులో తమ పార్టీ పడబోదని వ్యాఖ్యానించారు. ప్రతీ రైతు రుణం మాఫీ అయ్యే వరకూ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఈ విషయంలో రేవంత్ సర్కార్ మెడలు వంచేందుకే గురువారం రాష్ట్రవ్యాప్త ధర్నాలకు తమ పార్టీ పిలుపునిచ్చిందని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ వాటిని జయప్రదం చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

నేడు చేవెళ్లకు కేటీఆర్

బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించబోయే రైతు ధర్నాకు కేటీఆర్ హాజరుకానున్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితోపాటు పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

లేటరల్ ఎంట్రీకే పీఛే.?

(మొదటిపేజీ తరువాయి)

కావడమే. లేటరల్ ఎంట్రీ ప్రకటన రిజర్వేషన్ అంశంలో బీజేపీకి వ్యతిరేకంగా కొత్త ఫ్రంట్ తెరవడానికి అవకాశం ఇచ్చింది. లేటరల్ ఎంట్రీ నిర్ణయాలతో ప్రభుత్వం కూర్చొని విపక్షాలకు చిక్కులు తెచ్చిపెడుతోందని జేడీయూ నేత కేసీ త్యాగి అన్నారు.

2005లో వీరప్ప మొయిలీ నేతృత్వంలో ఏర్పాటైన రెండో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిషన్ సూత్రప్రాయంగా లేటరల్ ఎంట్రీని సిఫారసు చేసిందని ఆయన రాశారు. 2013లో ఆరవ వేతన సంఘం సిఫారసులు కూడా ఆ దిశలో ఉన్నాయి.

ప్రధాని మోడీ ప్రభుత్వం రిజర్వేషన్‌లకు వ్యతిరేకమనే వ్యూహాన్ని ప్రతిపక్షాలు చేశాయి. దీన్ని అడ్డుకునేందుకు డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రతిగా స్పందించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం , సామాజిక న్యాయం సూత్రాలకు అనుగుణంగా ఉండాలని, ముఖ్యంగా రిజర్వేషన్ల నిబంధనలకు సంబంధించి ఉండాలని ప్రధాని గట్టిగా విశ్వసిస్తున్నారని ఆయన అన్నారు. ఆర్ఎస్ఎస్, హిందూత్వ శక్తులు మాత్రం రిజర్వేషన్లు అవసరంలేదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. పైగా వందమంది బీజేపీ ఎంపీలు ప్రధాని మోడీని కలిసి క్రీమీలేయర్ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవద్దని కూడా కోరారు. దానికి మోడీ మీకు అండగా ఉంటానంటూ భరోసా కూడా ఇచ్చారు. అయితే రిజర్వేషన్లను కొల్లగొట్టడానికే లేటరల్ ఎంట్రీ ద్వారా భర్తీ చేస్తున్నారని ప్రతిపక్షాలు వేసిన వ్యూహాత్మక అడుగులు మోడీ ముందరి కాళ్లకు బంధంలా మారాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అంతేకాదు బీజేపీ సర్కారులో ఉన్న భాగస్వామ్య పక్షాల నుంచి కూడా తీవ్రవ్యతిరేకత రావటంతో మోడీ సర్కార్ చేతులెత్తేయక తప్పలేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

నేటినుంచి కేజీబీవీ సిబ్బంది బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, పీఈటీలు ప్రస్తుతం ఉన్న కేజీబీవీ నుంచి ఇతర కేజీబీవీలకు మార్పు కోరే సిబ్బంది నుంచి ఆన్‌లైన్‌లో గురువారం నుంచి శుక్రవారం వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామని వివరించారు. ఇంతకు ముందు ప్రత్యక్షంగా ప్రజాప్రతినిధుల ద్వారా విజ్ఞప్తి చేసుకున్న వారు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలు, సూచనలు, మార్గదర్శకాలు https://schooledu.telanganag.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

చిన్నారిపై లైంగికదాడి

(మొదటిపేజీ తరువాయి)

మైత్రివనంలో నిర్మాణంలో ఉన్న గో గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో నేపాల్‌కు చెందిన వ్యక్తి వాచ్‌మెన్‌గా పని చేస్తూ తన భార్య, మనవరాలితో నివాసం ఉంటున్నాడు. కాగా ఈ నెల 19న మధ్యాహ్నం సమయంలో.. అదే అపార్ట్‌మెంట్‌లో పెయింటింగ్ పని చేస్తున్న ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్ పూర్‌కు చెందిన అజయ్ వాచ్‌మెన్ రూమ్‌కు వచ్చి తాను పాపను ఆడిస్తానని చెప్పి, తన రూమ్‌లోకి తీసుకపోయి పాపపై లైంగికదాడికి పాల్పడ్డాడు. పాప ఏడుపు విన్న వాచ్‌మెన్ అజయ్ రూమ్‌కు వెళ్లి చూసి మనవరాలిని ఎత్తుకొని తీసుకెళ్లాడు. అనంతరం వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. కాగా, అప్పటికే అజయ్ అక్కడి నుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న త్రీ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పూర్తి విచారణ జరిపి, పాపను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా.. మంగళవారం రాత్రి పొన్నాల బ్రిడ్జ్ వద్ద ఏదైన వాహనం దొరికితే ఎక్కడానికి నిలబడి ఉన్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని విచారించి, జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. కాగా చికిత్స పొందుతున్న పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ బి. అనురాధ మాట్లాడుతూ.. అధికారులు విచారణ త్వరగా చేపట్టి బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. టెక్నికల్, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్స్ త్వరితగతిన తెప్పించి, చార్జిషీట్ దాఖలు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ట్రయల్ నిర్వహించేలా చూడాలని తెలిపారు.

మెదక్ ఎంపీ స్వగ్రామంలో
కుల బహిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక తరగతికి చెందిన బండమీది మల్లయ్య, సాయిలు అన్నదమ్ములు. సాయిలు గతంలో నక్సలిజంలో చేరి బయటకు వచ్చారు. అనంతరం ఆయన ఎంపీగా, ఎమ్మెల్యేగా, సర్పంచ్‌గా పోటీ చేశారు. ఎంపీగా పోటీ చేసిన ఆయన డిపాజిట్ కూడా దక్కించుకున్నట్టు సమాచారం. బండమీది మల్లయ్య భార్య బాలమణి బొప్పాపూర్ తాజా మాజీ సర్పంచ్. మాదిగ కులస్తులైన వీరిద్దరికీ కుల సంఘం పెద్దలతో గత కొన్నేండ్లుగా భూ వివాదం నడుస్తోంది. ఈ విషయంలో కుల బహిష్కరణ గురైన వీరు మూడేండ్ల క్రితం కొంత మొత్తంలో జరిమానా చెల్లించి మళ్లీ కులంలో చేరారు. అప్పటి నుంచి మల్లయ్య, సాయిలు కుటుంబ సభ్యులతో కులస్తులు పట్టీ పట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో తాజా మాజీ సర్పంచ్ బావ అయిన బండమీది సాయిలు మంగళవారం మరణించారు. అంత్యక్రియల కోసం కుల పెద్దలను రావాలని కోరగా అందుకు వారు నిరాకరించారు. బుధవారం ఉదయం అంత్యక్రియల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి డప్పు కొట్టేందుకు రావాలని కోరినా.. కులస్తులు రాలేదు. సాయిలు అంత్యక్రియలకు వెళ్లిన కులస్తులకు రూ.5000 జరిమానా విధిస్తామని కుల పెద్దలు వార్నింగ్ ఇచ్చినట్టు సాయిలు కుటుంబీకులు చెప్తున్నారు. పోలీసులు కుల పెద్దలను సంప్రదించి చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. దాంతో చేసేదేమీ లేక పక్క గ్రామం నుంచి డప్పు కొట్టే వారిని రప్పించుకొని సాయిలు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన పట్ల గ్రామస్తులు, దుబ్బాక నియోజకవర్గంలోని పలువురు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కుష్బూ చౌదరి, తేజస్ కంచర్ల

ఓరి మాయలోడా..

'హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన హీరో తేజస్ కంచర్ల తాజాగా 'ఉరుకు పటేల' చిత్రంతో అలరించేందుకు రెడీ అవుతున్నారు. 'గెట్ ఉరికిఫైడ్' అనేది ట్యాగ్ లైన్. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మించారు.
సెప్టెంబర్ 7న ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందించిన ఈ సినిమాకు ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని సమకూర్చారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, 'పట్నం పిల్లా..' అనే సాంగ్‌కు ప్రేక్షకుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఓరి మాయలోడా..' అనే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా ఈ సాంగ్ విడుదలైంది. హీరో ప్రేమలో పడిన హీరోయిన్ తన మనసులోని ప్రేమను తెలియజేసే సందర్భంలో వచ్చే పాట ఇది. ఈ పాటను స్ఫూర్తి జితేందర్ పాడగా, శ్రీనివాస మౌళి రాశారు.

తెలుగులోనూ హిట్ ఖాయం



అరుల్ నిధి

ఈ నెల 23న 'డీమాంటీ కాలనీ 2' తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పంపిణీ చేస్తోంది. ఈ సినిమాను శ్రీ బాలాజీ ఫిలింస్ బ్యానర్ పై ఎన్ శ్రీనివాస రెడ్డి సమర్పణలో ప్రొడ్యూసర్స్ బి సురేష్ రెడ్డి, బి.మానస రెడ్డి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.
ఈ సినిమాలో అరుల్ నిధి, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించారు. దర్శకుడు అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకులు రామ్ గోపాల్ వర్మ అజయ్ భూపతి, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ తదితరులు అతిథులుగా పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.
నిర్మాత బి.సురేష్ రెడ్డి మాట్లాడుతూ, 'తమిళంలో ఈ సినిమా బిగ్ హిట్ అయ్యింది. తెలుగులోనూ అంతకంటే పెద్ద విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా' అని తెలిపారు.
'ఈ సినిమాను తమిళంలో నేనే ప్రొడ్యూస్ చేసి, డైరెక్ట్ చేశాను. తమిళం కంటే తెలుగు ఆడియెన్స్ బాగా రిసీవ్ చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఈ మూవీకి 3, 4 పార్ట్స్ కూడా చేయబోతున్నాం' అని డైరెక్టర్ అజయ్ ఆర్ జ్ఞానముత్తు చెప్పారు. డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, 'నిర్మాత సురేష్ రెడ్డి మంచి మూవీస్ తీసుకుంటాడనే నమ్మకం ఉంది. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమాని ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని తెలిపారు.



రుద్ర గరుడ పురాణం

రిషి, ప్రియాంక కుమార్ జంటగా కేఎస్ నందీష్ దర్శకత్వంలో రూపొందుతున్న కన్నడ చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. అశ్విని ఆర్ట్స్ బ్యానర్‌పై అశ్విన్ విజయ్ లోహిత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
బైలింగ్వల్ మూవీగా తెరకెక్కించి నాలుగు భాషల్లో సినిమా రిలీజ్ చేస్తున్నారు. బుధవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నిర్మాత మధుర శ్రీధర్ అశ్విన్ ఆర్ట్స్ బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, హీరో సోహైల్ తెలుగు టీజర్‌ను విడుదల చేశారు. హీరో రిషి మాట్లాడుతూ, 'గరుడ పురాణం ఎలిమెంట్స్‌ను బేస్ చేసుకుని రూపొందిస్తున్న చిత్రమిది. రుద్ర అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేస్తున్నా. 25 ఏళ్ల క్రితం యాక్సిడెంట్ అయిన ఒక బస్.. దానిలో చనిపోయిన వారంతా తిరిగి వస్తే ఏం జరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది' అని తెలిపారు.
దర్శకుడు నందీష్ మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. దర్శకుడిగా నాకు, నిర్మాతగా లోహిత్‌కి ఇది మా ఫస్ట్ మూవీ. టీజర్ అందరికీ నచ్చిందనుకుంటున్నా' అని అన్నారు.
'మ అశ్విని ఆర్ట్స్‌లో నిర్మిస్తున్న మొదటి సినిమా ఇది. బైలింగ్వల్ మూవీగా తెరకెక్కిస్తున్నాం. నాలుగు భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నా' అని నిర్మాత విజయ్ లోహిత్ చెప్పారు. హీరోయిన్ ప్రియాంక కుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా మీ అందరికీ తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

నవచిత్రం

దసరాని మించి..



ప్రియాంక అరుల్ మోహన్, నాని

నాని, డైరెక్టర్ వివేక్ ఆత్రేయ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో ఎస్‌జే సూర్య పవర్ ఫుల్ రోల్ ప్లే చేస్తున్నారు. ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఈనెల 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నాని మాట్లాడుతూ,'మన మధ్యలో ఒక ప్రామిస్, ఒక బాండ్ ఉంది. ఈ బాండ్‌ని ఇంకా ఇంకా బలపరిచే సినిమా ఇది. ఈసారి థియేటర్లలో కాన్సర్ట్‌లా ఉంటుంది. జేక్స్ బిజోయ్ చితకొట్టేస్తున్నాడు. ఎప్పుడెప్పు మీరు చూస్తారా అని ఎదురుచూస్తున్నాను. మీతో పాటు చూడటానికి ఎదురుచూస్తున్నాను. సుదర్శన్ 35 ఎంఎం కి మార్నింగ్ 11 షోకి వస్తున్నాను. కలసి సెలబ్రేట్ చేసుకుందాం. ప్రీరిలీజ్ ఈవెంట్ ఈనెల 24న జరగబోతోంది. సినిమా బ్లాక్‌బస్టర్ ఖాయం' అని అన్నారు.
'ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత దానయ్య బ్యానర్ నుంచి వస్తున్న ఈ సినిమా తెలుగు స్టేట్స్ డిస్ట్రిబ్యుషన్ రైట్స్‌లో నన్ను పార్ట్ చేసినందుకు థ్యాంక్స్'. నాని నటించిన 'దసరా'ని ఈ సినిమా బీట్ చేయబోతోందని ట్రైలర్ చూసి కాన్ఫిడెంట్‌గా చెప్పొచ్చు' అని దిల్ రాజు చెప్పారు. హీరోయిన్ ప్రియాంక మోహన్ మాట్లాడుతూ,"గ్యాంగ్ లీడర్' తర్వాత నానికి జోడిగా ఈ సినిమాతో రావడం ఆనందంగా ఉంది. డీవీవీ ప్రొడక్షన్‌లో ఈ సినిమాతో పాటు 'ఓజీ'తో మళ్ళీ వస్తున్నాను. ఇందులో నా పాత్ర పేరు చారులత. చాలా సాఫ్ట్ కాప్. వివేక్ చాలా బ్యూటీఫుల్ కథని రాశారు' అని అన్నారు.
నిర్మాత డివివి దానయ్య మాట్లాడుతూ, 'సినిమా చూశాను. చాలా బాగా వచ్చింది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారణం నాని. డైరెక్టర్ అద్భుతమైన కథ రాశారు, గొప్పగా తీశారు. సూర్య, ప్రియాంకలతోపాటు ఇతర నటీనటుల నటన చిత్రానికి ప్రధాన ఆకర్షణ అవుతాయి' అని చెప్పారు.

రేవు రిలీజ్‌కి రెడీ



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రేవు'.
ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్, పారుపల్లి ప్రొడక్షన్ పై నిర్మాత డా.మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మించారు. నిర్మాణ సూపర్ విజన్‌గా జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు వ్యవహరిస్తున్నారు. హరినాథ్ పులి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈనెల 23న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత మురళి గింజుపల్లి మాట్లాడుతూ, ఇప్పటికే ట్రైలర్, మూడు అద్భుతమైన పాటలు వచ్చాయి. ఇంకో పాట కూడా ఉంది. అది త్వరలోనే వస్తుంది. సినిమా రిలీజయ్యాక ఆ పాట చూసి మరింత ఎగ్జైట్ ఫీల్ అవుతారు అని అన్నారు. 'ఎప్పుడో సంవత్సరం క్రితం నేను ఒక అయిదు నిమిషాల ట్రైలర్ చూసాక ప్రేక్షకులకు నచ్చుతుంది ఈ సినిమా అనే కాన్ఫిడెన్స్ ఏర్పడింది. ఆ నమ్మకమే ఈనెల 23 సినిమా రిలీజ్ వరకు తీసుకొచ్చింది' అని ప్రభు చెప్పారు. పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ,'హరినాథ్ పులి చేసిన ఈ సినిమా, అతని టేకింగ్ చూసాక ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకంతో మా ఫ్రెండ్స్ మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లిలకు చెప్పి ఈ సినిమాను ఈ స్టేజీవరకు తీసుకొచ్చాం. ఓ మంచి సినిమాని చూడబోతున్నారని చెప్పగలను' అని తెలిపారు.

పవర్‌ఫుల్ పోలీస్ కథ



దేవ్‌గిల్

బ్లాక్‌బస్టర్ 'మగధీర'తో సహా పలు దక్షిణ భారతీయ చిత్రాల్లోని విభిన్న పాత్రలు, ఆకర్షణీయమైన నటనతో దేవ్ గిల్ అందరినీ ఆకట్టుకున్నారు. ఆయన హీరోగా దేవ్ గిల్ ప్రొడక్షన్స్ రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'అహో! విక్రమార్క'. ఈనెల 30న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర యూనిట్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు.
అసుర అనే విలన్ ఓ ప్రాంతాన్ని తన కంట్రోల్‌లో పెట్టుకుని ఉంటాడు. అలాంటి అసురుడిని అంతమొందించటానికి ఆ ప్రాంతంలోకి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ వస్తాడు. తనేం చేశాడు.. ఎలా విలన్స్ భరతం పట్టాడు.. అనేది తెలుసుకోవాలంటే ఈనెల 30న విడుదలవుతున్న సినిమా చూడాల్సిందే అన్నట్టుగా ట్రైలర్ ఉండటం విశేషం.
ఈ సందర్భంగా దేవ్ గిల్ మాట్లాడుతూ,' ఈ సినిమాతో మహారాష్ట్ర పోలీసుల ధైర్యాన్ని, వారి అంకితభావాన్ని ఆకర్షణీయంగా, ప్రభావవంతంగా ప్రదర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు నాలోని నటుడిని ఓ కోణంలో చూసిన ప్రేక్షకులు మరో కోణాన్ని వెండితెరపై చూస్తారు' అని తెలిపారు. దర్శకుడు పేట త్రికోటి మాట్లాడుతూ, 'పోలీసుల పవర్‌ను తెలిపే సినిమా ఇది. ఇందులో సరికొత్త దేవ్ గిల్‌ను చూస్తారు' అని చెప్పారు.



జోశర్మ, సంబీత్ ఆచార్య

నెక్ట్స్ లెవల్ మ్యూజిక్

'మల్లెపువ్వు, మెంటల్ కృష్ణ, కలవరమాయే మదిలో వంటి చిత్రాలను నిర్మించిన మోహన్ వడ్లపట్ల దర్శకుడిగా రూపొందిస్తున్న చిత్రం ఎం4ఎం ('మోటివ్ ఫర్ మర్డర్'). సంబీత్ ఆచార్య, జో శర్మ జంటగా నటిస్తున్నారు.
ఈ సినిమాలోని మ్యూజిక్‌పై స్పెషల్ వీడియో చేశారు మోహన్ వడ్లపట్ల. వసంత్ ఇసైపెట్టై అందించిన ఈ సినిమా మ్యూజిక్ చాలా బాగుందని ప్రశంసలు కురిపించారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా నెక్ట్స్ లెవల్‌లో ఉందన్నారు. ఇలాంటి ట్యూన్స్ ఇప్పటి వరకు చూసి ఉండరని చెప్పారు.
ఈ సందర్భంగా తనకు ఇంత పెద్ద అవకాశం ఇచ్చిన మోహన్ వడ్లపట్లకు మ్యూజిక్ డైరెక్టర్ వసంత్ ఇసైపెట్టై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా మ్యూజిక్ లవర్స్‌కి బాగా నచ్చుతుందని అన్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మళయాలం.. ఇలా ఐదు భాషలలో విడుదలకు సిద్ధం అవుతోంది. తాజాగా ఐదు భాషలలో రిలీజ్ అయిన టీజర్స్‌కు ఇసైపెటై ఇచ్చిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందరినీ ఆకట్టుకుని అంచనాలు పెంచేసింది. ప్రస్తుతం వసంత్ ఇసైపెట్టై నేతృత్వంలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తుది మెరుగులు దిద్దుకుంటోంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

అక్రమ నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

హైడ్రాకు హైకోర్టు ఆదేశం
- జన్వాడలో ఫామ్‌హౌజ్ కూల్చకుండా స్టే ఇవ్వాలి
- బద్వేలు ప్రదీప్‌రెడ్డి పిటిషన్
- నిరాకరించిన న్యాయమూర్తి లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



అక్రమ నిర్మాణాల కూల్చివేత నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసిన వ్యవహారంలో హైకోర్టు స్పందించింది. హైడ్రా ఏర్పాటు జీవో 99 ప్రకారం చర్యలు ఉండాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అక్రమ నిర్మాణాలకు చెందిన స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, నిర్మాణ అనుమతులు, పన్ను రశీదులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాకే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది. దుందుడుకుగా వ్యవహరించేందుకు ఆస్కారం కలిగించొద్దనీ, చట్టప్రకారం చేయడం వల్ల ప్రజలకు ప్రభుత్వంపై విశ్వసనీయత పెరుగుతుందని చెప్పింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామం సర్వే నెంబర్ 311 (311/7)లో 1210 యార్డ్స్‌లోని 3894 అడుగుల్లోని ఫామ్‌హౌస్‌ను కూల్చకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ బద్వేలు ప్రదీప్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దానిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ బుధవారం విచారించారు. ఫామ్‌హౌస్ కూల్చివేత చర్యలు చేపట్టకుండా స్టే ఇవ్వాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని ఆయన నిరాకరించారు. అక్రమ కట్టడాల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముందనీ, అయితే ఆ చర్యలు చట్టప్రకారం ఉండాలని సూచించారు. ఈ కారణంగా ఫామ్‌హౌస్‌ను కూల్చివేయకుండా స్టే జారీకి ఉత్తర్వులు ఇవ్వడం లేదన్నారు. నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకోవాలని హైడ్రాకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉంటే ఆ చట్టప్రకారం అధికారులు నోటిఫికేషన్ జారీ చేయాలనీ, ఆ తర్వాత పిటిషనర్‌కు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఫామ్‌హౌస్‌కు చెందిన జాగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, నిర్మాణ అనుమతులు, ఇంటి పన్ను రశీదులు పరిశీలించాక చర్యలు ఉండాలని ఆదేశించారు. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ ప్రాథమిక, తుది నోటిఫికేషన్ సమర్పించాలని అన్నారు. హైడ్రా ఏర్పాటు జీవో 99లోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చనని తెలిపారు. ప్రాథమికంగా ఆక్రమణ దారులు చేపట్టే అనధికార నిర్మాణాలను గుర్తించాక వాళ్ల హక్కులకు చెందిన డాక్యుమెంట్లను పరిశీలించాలనీ, జీహెచ్‌ఎంసీతోపాటు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి తీసుకున్న నిర్మాణ అనుమతులు కూడా పరిశీలించాలని కోరారు. 60 గజాల స్థలమైనా ఎకరా స్థలంలోని ఇల్లయినా ఒకే తరహాలో అధికారులు వ్యవహరించాలని ఆదేశించారు. వివక్షకు ఆస్కారం లేకుండా చేయాలని సూచించారు. హైడ్రా ఏర్పాటుకు చెందిన జీవో 99లో పేర్కొన్న నిబంధనలను అమలు చేయాలని కోరారు.

చెరువులను ఆక్రమించిన వారిపైనా చర్యలు తీసుకోవాలి

చెరువులను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపైనా జీవో 99 ప్రకారమే చర్యలు తీసుకోవాలని హైడ్రాను జస్టిస్ లక్ష్మణ్ ఆదేశించారు. విచారణ సమయంలో హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఏ చట్టం కింద హైడ్రా ఏర్పాటైందో చెప్పాలని కోరారు. ఏ అధికారంతో చర్యలు చేపడుతుందో చెప్పాలన్నారు. చెరువుల పరిరక్షణ మంచిదేననీ అయితే నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేతలు ఉండరాదని ఆదేశించారు. ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ జులై 19న జారీ చేసిన జీవో 99ను పరిశీలించాలని కోరారు. జీహెచ్‌ఎంసీ, ఇతర మున్సిపాలిటీలకు హైడ్రా కోఆర్డినేటర్‌గా ఉంటుందన్నారు. ఈ కేసులో స్టే ఇవ్వరాదని కోరారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించాలనీ, పిటిషన్‌ను ఆదిలోనే కొట్టేయాలని విజ్ఞప్తి చేశారు. 2019లో పిటిషనర్ ఫామ్‌హౌస్‌ను, దాని పక్కనే ఉన్న 3.30 ఎకరాల భూమిని కొన్నారని పిటిషనర్ లాయర్ చెప్పారు. పంచాయతీ అనుమతులతో నిర్మాణం చేపట్టారని వివరించారు. గ్రామ పంచాయతీ నుంచి 2014లో అనుమతులు తీసుకున్నారని చెప్పారు. హైడ్రా వెబ్‌సైట్‌లో సర్వే నెంబర్ 311 భూమి ఎఫ్‌టీఎల్‌కు బయటే ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక నేతతో ఉన్న సంబంధం కారణంగా ఫామ్‌హౌస్ కూల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, దీన్ని అడ్డుకోవాలనీ, స్టే ఇవ్వాలని కోరారు. ఈనెల 14న ఇరిగేషన్ అధికారులమంటూ ఇద్దరు వ్యక్తులు వచ్చి ఫామ్‌హౌస్ నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని హైడ్రా అధికారులు వస్తారంటూ చెప్పారని అన్నారు. వాదనల తర్వాత న్యాయమూర్తి, జీవో 99 ప్రకారం ఎన్ని నిర్మాణాలను కూల్చివేశారో వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రాను, ప్రభుత్వాన్ని ఆదేశించారు. విచారణను సెప్టెంబరు 12కు వాయిదా వేశారు.

ప్రతి విద్యార్థి పాల్గొనేలా క్రీడావిధానం

- రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా ప్రతిభావంతులకు ప్రోత్సాహం
- క్రీడాక్యాలెండర్ అమలుకు ఉన్న అవకాశాలు పరిశీలన
- క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, శాట్స్ చైర్మెన్ శివసేనారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మారుమూల పాఠశాల స్థాయి నుంచి ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు ఏదో ఒక క్రీడలో పాల్గొనే విధంగా తెలంగాణ క్రీడా విధానాన్ని రూపొందిస్తామని క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, క్రీడా అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) చైర్మెన్ కె శివసేనారెడ్డి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజా హోటల్‌లో క్రీడా విధానం ముసాయిదా రూపకల్పన కోసం రాష్ట్రస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనేలా క్రీడా విధానాన్ని రూపొందించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారని గుర్తు చేశారు. అందుకనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చే ప్రతిభావంతులైన క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమని అన్నారు. వారిని ప్రోత్సహించేందుకు పటిష్టమైన క్రీడా విధానాన్ని రూపొందింస్తామన్నారు. యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ మాట్లాడుతూ క్రీడా ముసాయిదాపై అందిన సూచనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గతంతో పోల్చితే క్రీడలకు ఈ ఏడాది 10 రెట్లు అధికంగా నిధులను ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. క్రీడా క్యాలెండర్ అమలుకు అవసరమైన వసతులతోపాటు నిర్వహణకు క్రీడల అభివృద్ధి నిధుల ఏర్పాటుకు ఉన్న అవకాశాల గురించి పలువురు సూచనలు చేశారని అన్నారు. క్రీడలను ప్రోత్సహించటంలో ఐటీ, ఫార్మా ఇతర ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యం ఒక సమావేశాన్ని నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారని వివరించారు. స్టేడియంలు, రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో ఉన్న వసతులను అభివృద్ధి చేసి, పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న ప్రోత్సాహకాలను పరిశీలించాలని చెప్పారు. పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో రెగ్యులర్‌గా క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వేణుగోపాలచారి, శాట్స్ వైస్ చైర్మెన్, ఎండీ సోనీ బాలాదేవి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్, ఇస్మాయిల్ బేగ్, ప్రముఖ క్రీడా కన్సల్టెన్సీ పీడబ్ల్యూసీ ప్రతినిధి ప్రాన్షు జైన్, ఇతర క్రీడా ప్రముఖులతోపాటు సింగరేణి, విద్యా, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీజేశ్‌కు కేరళ రూ.2 కోట్ల పురస్కారం



తిరువనంతపురం: భారత పురుషుల జట్టు హాకీ గోల్‌కీపర్, ఆర్‌పి శ్రీజేశ్‌కు కేరళ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. తాజాగా కేరళ ప్రభుత్వం అతడికి రూ.2 కోట్ల నగదు పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సిఎంఓ బుధవారం ప్రకటించింది. 'భారత హాకీ జట్టులో సభ్యుడు, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన శ్రీజేశ్‌కు రెండు కోట్ల రూపాయలు బహుమతిగా అందిస్తున్నాం' అని ప్రకటనలో తెలిపింది. కేరళకు చెందిన శ్రీజేశ్ 2004లో జాతీయ జూనియర్ జట్టులో.. అనంతరం సీనియర్ జట్టులోకి చేరాడు. 20 ఏళ్లలో భారత్ తరఫున 336 మ్యాచ్‌లు ఆడాడు. అతడి ఖాతాలో రెండు ఒలింపిక్ పతకాలతో పాటు రెండు ఆసియా క్రీడల స్వర్ణాలు, రెండు కామన్వెల్త్ రజతాలు, రెండు ఛాంపియన్ ట్రోఫీ రజతాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్యం సొంతం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. ఆ తర్వాత ఆటకు వీడ్కోలు పలికాడు. శ్రీజేశ్‌ను జూనియర్ టీమ్‌కు ప్రధాన కోచ్‌గా హాకీ ఇండియా నియమించింది. అదేవిధంగా సీనియర్ జట్టు నుంచి జెర్సీ నంబరు 16కు సైతం రిటైర్‌మెంట్ ఇస్తున్నట్లు ఇటీవల శ్రీజేశ్ ప్రకటించాడు.

దేవిస్‌కప్‌లో సిద్ధార్థ్‌కు చోటు



న్యూఢిల్లీ: స్టాక్‌హోమ్ వేదికగా స్వీడన్‌తో జరిగే భారత డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్-1 పోటీలకు 29ఏళ్ల సిద్ధార్థ్ వైశ్వకర్మ చోటు దక్కించుకున్నాడు. సిద్ధార్థ్‌తోపాటు సుమిత్ నాగల్, రామక్ కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ భారత డేవిస్ కప్ జట్టులో సభ్యులు. అలాగే ఆర్యన్ షా రిజర్వ్ ఆటగానికి చోటు దక్కించుకున్నాడు. కోచ్‌గా అశుతోష్ సింగ్ నియమితులయ్యారు. ఆ పోటీల్లో సిద్ధార్థ్ బరిలోకి దిగితే అంతర్జాతీయ టెన్నిస్‌లో అతడు అరంగేట్రం చేయనున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో జరిగిన డేవిస్ కప్‌లో భారత్ 4-0తో గెలిచింది. ప్రస్తుతం భారత టెన్నిస్ జట్టుకు కోచ్‌గా ఉన్న రతన్ గుజరాత్‌లోని నోయిడా విన్నర్స్ టెన్నిస్ అకాడమీకి సేవలందించనున్నాడు. సెప్టెంబర్ 14, 15న భారత్-స్వీడన్ జట్ల మధ్య డేవిస్‌కప్ టోర్నమెంట్

ఐసిసి అధ్యక్ష రేసులో జై షా



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) అధ్యక్షునిగా భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) కార్యదర్శి జై షా ఎన్నిక దాదాపు ఖాయంగా కనబడుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు గ్రెగ్ బార్ క్లే (న్యూజిలాండ్) పదవీ కాలం నవంబర్ 30తో ముగియనుంది. ఇప్పటికే రెండు దఫాలుగా బార్ క్లే ఐసిసి అధ్యక్షునిగా ఉన్నారు. దీంతో బిసిసిఐ కార్యదర్శి జై షా ఆ పదవికి పోటీపడనున్నారు. మిగతా దేశాల బోర్డులనుంచి కూడా జై షాకు మద్దతు ఉండగా.. ఈ పదవికి పోటీపడేందుకు ఇప్పటివరకు మరొకరు దరఖాస్తు చేసుకోలేదు. మూడోసారి పోటీ చేయాలనే ఆసక్తి తనకు లేనట్టు బార్ క్లే ఇప్పటికే ఐసిసి సభ్యులకు తెలియజేశాడు. ఈ నెల 27న ఈ విషయమై పూర్తి స్పష్టత రాబోతోంది. ఛైర్మన్ పోస్ట్ కోసం నామినేషన్లు వేసేందుకు 27 ఆఖరి తేదీ. ఐసిసి నిబంధనల ప్రకారం ఎవరైనా వ్యక్తి మూడు పర్యాయాలు ఛైర్మన్‌గా ఉండొచ్చు. ఒక్కో టర్మ్‌కు రెండేళ్ల పదవీ కాలం ఉంటుంది. అంటే ఎవరైనా వ్యక్తి గరిష్టంగా ఆరు సంవత్సరాలు ఐసిసి ఛైర్మన్ హోదాలో ఉండొచ్చు. 2020 నుంచి బార్ క్లే ఐసిసి ఛైర్మన్‌గా కొనసాగుతున్నాడు. ఐసిసి ఛైర్మన్ ఎన్నికల్లో మొత్తం 16 మంది సభ్యులు ఓట్లు వేయాల్సి ఉంది. వారిలో 9మంది ఓట్లు ఎవరికి పడితే వారు ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికవుతారు.
ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు మెంబర్లతో సహా మిగిలిన దేశాల క్రికెట్‌బోర్డులు కూడా జై షా వైపే ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం బిసిసిఐ కార్యదర్శిగా ఉన్న షాకు మరో ఏడాది పదవీ కాలం ఉంది. ఆ తర్వాత అతడు తప్పనిసరిగా బిసిసిఐ పదవుల నుంచి మూడేళ్ల పాటు తప్పుకోవాలి. గతంలో భారత్‌కు చెందిన జగన్మోహన్ దాల్మియా(1997-2000), శరద్ పవార్ (2010-12) ఐసిసి ఛైర్మన్‌గా పని చేశారు. జై షా ప్రస్తుతం ఐసిసి ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల ఉప సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు.

సిన్సినాటి టైటిల్ విజేత సిన్నర్

ఐటిఐఎ క్లీన్‌చిట్‌తో ఊరట

న్యూయార్క్: టాప్‌సీడ్ టెన్నిస్ ఆటగాడు, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్‌కు ఊరట లభించింది. నిషేధిత ఉత్ప్రేరకాలను తీసుకోవడంతో రెండుసార్లు పాజిటివ్ వచ్చిన సిన్నర్‌కు తాజాగా అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ(ఐటిఐఎ) క్లీన్‌చిట్ ఇస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. 2024 ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీ శాంపిల్స్‌లో తక్కువస్థాయిలో క్లోస్టెబోల్ మెటాబోలైట్ ఉన్నట్లు తేలింది. చిన్న గాయానికి మందు రావడం కారణంగా ఇలా జరిగిందని పరీక్షల్లో తేలింది. ఇక రెండోసార్లు డోప్ పరీక్షలకు ఉల్లంఘనలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఐటిఐఎ బుధవారం సమావేశమై స్పోర్ట్స్ నిబంధనలను అతడు అతిక్రమించలేదని, స్వతంత్ర ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీంతో అతడు వచ్చే వారం నుంచి ప్రారంభమయ్యే యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో బరిలో దిగేందుకు దారి సుగమమైంది.
సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో సిన్నర్ 7-6(7-4), 6-2తో స్థానిక ఆటగాడు టఫీని ఓడించి టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్ టైటిల్ 3వ సీడ్, బెలారస్‌కు చెందిన సబలెంక కైవసం చేసుకుంది. ఫైనల్లో సబలెంక 6-3, 7-5తో 6వ సీడ్, అమెరికాకు చెందిన పెగూలాను ఓడించింది.

ధనుంజయ, ప్రియనాథ్ అర్ధసెంచరీలు

శ్రీలంక-ఇంగ్లండ్ తొలి టెస్ట్

మాంచెస్టర్: ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన శ్రీలంక జట్టు తొలి టెస్ట్‌లో గొప్పగా పుంజుకుంది. 113పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డా లంక జట్టు తొలిరోజు టీ విరామ సమయానికి 7వికెట్ల నష్టానికి 216పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక టాపార్డర్ ఘోరంగా విఫలమైంది. దీంతో తొలి మూడు వికెట్లను 6పరుగుల్లోపే కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత కెప్టెన్ ధనుంజయ(74), లోయర్ ఆర్డర్ బ్యాటర్ ప్రియనాథ్(66నాటౌట్) రాణించడంతో 68ఓవర్లలో 8వికెట్ల నష్టానిక 216పరుగులు చేసింది. ఆ సమయానికి క్రీజ్‌లో ప్రియనాథ్‌తోపాటు ఫెర్నాండో(3) క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లు బోక్స్‌కు మూడు, అట్కిన్సన్, బషీర్‌కు రెండేసి, మార్క్ వుడ్‌కు ఒక వికెట్ దక్కాయి. మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు శ్రీలంక జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లింది.

పాకిస్తాన్ 158/4

ఆయుబ్, షకీల్ అర్ధసెంచరీలు

రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో పాకిస్తాన్‌జట్టు తడబడి నిలబడింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 158 పరు గులు చేసింది. 16పరు గులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును సైమ్ ఆయుబ్(56), షకీల్(57) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886